ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 29.10.2026 | సంపుటి:13 సంచిక : 99 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# ఆంధ్రాలో అర్నబ్ బీభత్సం

## కృష్ణా, గుంటూరు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జిల్లాల్లో అతిభారీ వర్షాలు

- పొంగుతున్న వాగులు, వంకలు రహదారులు జలయమం.. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టం
- తుపాను ధాటికి వేర్వేరు జిల్లాల్లో ఏడుగురి మృతి
- తుపాను వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం:సీఎం చంద్రబాబు
- మృతుల కుటుంబాలకు రూ.5లక్షల సాయం ప్రకటన..





## మాకు సాయం చేయండి

### తెలంగాణను అభ్యర్థించిన ఆంధ్రా

తెలంగాణ విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో ఫోన్

విద్యుత్ సిబ్బందిని, సాంకేతిక పరికరాలను పంపాల్సిందిగా మంత్రి గొట్టిపాటి విజ్ఞప్తి

సానుకూలంగా స్పందించిన తెలంగాణ ప్రభుత్వం

2లో..

# అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేష్‌రంజన్

విద్యుత్తుశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్..

తెలంగాణలో 12 మంది సీనియర్ ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో 12 మంది సీనియర్ ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేష్ రంజన్, విద్యుత్తుశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్, క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వాణీ ప్రసాద్, పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నవీన్‌మిత్తల్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్ నియమితులయ్యారు. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న దానకిశోర్ పదవీకాలాన్ని పొడిగించారు. గిరిజన సంక్షేమశాఖ

మిగతా 2లో..

# హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రావొద్దు

## శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయండి

- నీటి నాణ్యతపై ఎక్కడా రాజీ పడవద్దు
- ట్రీటెడ్ వాటర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఎస్‌టీపీలు, ట్రీటెడ్ వాటర్‌పై రేవంత్ రెడ్డి సమీక్ష జరిపారు. ఈ ప్లాంట్లపై హైడ్రా మానిటరింగ్ ఉండాలని ఆదేశించారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలో తాగు నీటి సమస్య రాకూడదని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవన నిర్మాణాలకు, మొక్కలు, గార్డెనింగ్ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని సీఎం ఆదేశించారు. ట్రీటెడ్ వాటర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్స హించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు.

**శుద్ధి చేసిన నీటినే వాడాలి**

హైదరాబాద్ కోర్ అర్బన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్?హెచ్?ఆర్డీ బోధి పెవిలియన్?లో రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని, క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు, ఎస్టీపీలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. సెక్రటేరియట తోపాటు సీఎంవో, అవుటర్ రింగ్, మెట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చూడాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్క్‌లు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్‌నే వాడాలన్నారు.

మిగతా 2లో..



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ షాక్

- కర్ణాటక ఫలితాల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ
- నాలుగు స్థానాల్లోనూ ఓటమి
- ఉత్తర్‌ప్రదేశ్,బిహార్‌లోనూ వెనుకంజ
- బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించినా ఓడిపోయారు కదా!
- ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు



అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతో నిర్వహించే దమ్ముందా?'

ప్రధాని మోదీకి కాంగ్రెస్ సవాల్

2లో..



# కష్టకాలంలో కలిసికట్టుగా పనిచేద్దాం

## అవసరమైతే ఢిల్లీకి వెళ్దాం

- ఎల్‌నినో పరిస్థితులు, కార్యాచరణపై అఖిలపక్ష భేటీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం
- హాజరైన మంత్రులు, బీఆర్ఎస్ నేతలు
- కృష్ణా జలాల వినియోగంపై బీఆర్ఎస్ మాటలు అవాస్తవం: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):

ఎల్‌నినో కారణంగా తెలంగాణలో నెలకొన్న కార్యాచరణపై, కరవు పరిస్థితులను ఎదుర్కొనేదెలా అనే అంశంపై అఖిలపక్ష భేటీలో చర్చిస్తున్నారు.ఎల్‌నినో కారణంగా తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులను ఎదుర్కొనేదెలా? అనే అంశంపై ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఎల్‌నినో ఎల్‌నినో నోడల్ అధికారి రామకృష్ణారావు హాజరయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, భాజపా నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు పాల్గొన్నారు. ప్రకృతి విపత్తు కారణంగా ఎదురవుతున్న సవాళ్లను నిర్మాణాత్మక దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. నదీజలాల అంశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "కృష్ణా జలాల వినియోగంపై బీఆర్ఎస్ మాటలు అవాస్తవం. ఇప్పటి వరకు శ్రీశైలం నుంచి తెలంగాణ 127 టీఎంసీలు, ఏపీ 72 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో తెలంగాణ 41 టీఎంసీలు,

మిగతా 2లో..

# రైళ్లు ఇవ్వకపోయినా.. ఢిల్లీ ర్యాలీ ఆగదు

## మహేశ్‌కుమార్ నేతృత్వంలో ఆందోళన

మంత్రి పొన్నం,ఎమ్మెల్యేల అరెస్ట్

కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనకడుగువేయమని స్పష్టం చేసిన నేతలు

హైదరాబాద్(జనంసాక్షి):నవంబర్ 1న ఢిల్లీలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ నిరాకరించిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు రైల్ నిలయం వద్ద ఆందోళనకు దిగారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేలు శ్రీగణేష్, నవీన్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, దానం నాగేందర్ తదితరులు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా రైల్ నిలయంలోకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రైల్ నిలయం వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ధర్నా చేస్తున్న నాయకులను అరెస్టు చేసి మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. 6 రోజుల క్రితమే

మిగతా 2లో..



# సైబర్ నేరాలంటే.. డిజిటల్ దోపిడీనే

సైబర్ నేరాల్లోపై ఉక్కుపాదం మోపాలి

డిజిటల్ అరెస్టులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



2లో..

# ఓటరు జాబితాలో పేరున్నవారికి మళ్లీ ఫారం-6 ఎందుకు?

- 'సర్' ప్రక్రియపై ఈసీని ప్రశ్నించిన సుప్రీం కోర్టు
- ఇది తీవ్ర అసమానతలకు దారితీస్తుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇప్పటికే సవరణలో తొలగించిన ఓటర్లను, కొత్త ఓటర్ల కోసం ఉద్దేశించిన ఫారం- 6 సమర్పించమని ఎందుకు అడుగుతున్నారంటూ సుప్రీం కోర్టు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది.ఢిల్లీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీం కోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలోనే ఓటు హక్కు కలిగి ఉండి, ప్రస్తుత ముసాయిదా జాబితా నుంచి పేర్ల తొలగింపునకు గురైన వారిని మళ్లీ ఫారం- 6 సమర్పించాలని ఎన్నికల సంఘం ఎందుకు

మిగతా 2లో..



# పోలీసు సేవల్లో సాంకేతిక విప్లవం

సీఐడీలో ఏడు డిజిటల్ సేవలు ప్రారంభించిన డీజీపీ సి. వి.ఆనంద్

- పౌరుల అభిప్రాయాల సేకరణకు ప్రత్యేక కేంద్రం
- నేర పరిశోధనలో ఫేస్ రికగ్నిషన్, ఫింగర్‌ప్రింట్ యాప్‌లు
- భరోసా కేంద్రాల సేవలకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్
- జైళ్ల నుంచి విడుదలయ్యే ఖైదీలపై నిఘాకు వ్యవస్థ

హైదరాబాద్(జనంసాక్షి):పోలీసు సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా, సమర్థంగా అందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నేర పరిశోధన విభాగం (సీఐడీ) రూపొందించిన ఏడు డిజిటల్ సేవలను డిజిపి సి.వి.ఆనంద్ డిజిపి కార్యాలయంలో ప్రారంభించారు. పౌరుల అభిప్రాయాల సేకరణకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్.పోలీసు సేవలను ఇటీవల వినియోగించుకున్న ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేశారు. పిటిషన్లు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, ఈ-చలాన్లు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ సేవలపై ప్రజల స్పందనను ఈ



కేంద్రం సేకరిస్తుంది. భరోసా కేంద్రాలకు డిజిటల్ సేవలు మహిళా భద్రతా విభాగం రూపొందించిన 'భరోసా' సాఫ్ట్‌వేర్ ద్వారా రాష్ట్రంలోని 35 భరోసా కేంద్రాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. బాధితులకు అందించే కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస సేవల వివరాలను నమోదు చేసి, కేసు ప్రారంభం

మిగతా 2లో..

# 'టాటా గ్రూప్‌ను నాశనం చేసేందుకు కుట్ర

దీని గురించి ఏ వ్యాపారి మాట్లాడే ధైర్యం చేయలేకపోతున్నారు

దేశంలో వ్యాపారం ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాల ఆటబొమ్మ కాదు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):

టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌లో ఛైర్మన్ నియామకంపై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారని.. దీని గురించి ఏ వ్యాపారి మాట్లాడే ధైర్యం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. టాటా గ్రూప్ సామాజిక నిబద్ధతను, యాజమాన్య విధానాలను పరిరక్షించాల్సిన అవసరముందన్నారు. 'టాటా గ్రూప్‌ను కుట్ర పూరితంగా నాశనం చేస్తున్నారు.

మిగతా 2లో..



# ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్..

## డీఏ పెంపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. కరవు భత్యాన్ని (డీఏ) మరో 3 శాతం పెంచాలని నిర్ణయించింది. దీంతో ఆ ఉద్యోగుల డీఏ 60 నుంచి 63 శాతానికి డీఏ పెరిగింది. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసి పింఛన్ పొందుతున్నవారికి ఇస్తున్న

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
29.10.2026

## ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్..

కరవు భృతి (డీఆర్) కూడా 3శాతం పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో డీఏ పెంపునకు ఆమోదం లభించింది.ఈ ఏడాది జులై నుంచే వర్తిస్తుందని కేంద్రం తెలిపింది. దీంతో కేంద్రంపై రూ.10,016కోట్ల మేర అదనపు భారం పడనుంది. ఈ నిర్ణయంతో 48.54లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, 68.71లక్షల పింఛనుదారులకు ప్రయోజనం చేకూరనుంది.

## రైళ్లు ఇవ్వకపోయినా ఢిల్లీ ర్యాలీ ఆగదు

– కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనకడుగువేయం

ఎంపీ అనిల్ యాదవ్ రైల్వే జీఎంను కలిసి తమ నిరసన కార్యక్రమానికి రెండు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. నిన్నటి వరకు కాలయాపన చేసిన రైల్వే అధికారులు సానుకూలంగా ఉన్నట్లు నమ్మించి.. చివరికి అనుమతి నిరాకరిస్తున్నట్లు నిన్న రాత్రి సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్ల కేటాయింపునకు దక్షిణ మధ్య రైల్వే నిరాకరించడంతో కాంగ్రెస్ నాయకులు ఆగ్రహానికి గురై రైల్ నిలయం వద్ద ఆందోళనకు దిగినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా దిల్లీలో నిరసన కార్యక్రమానికి హాజరవుతామని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంతవరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

## సైబర్ నేరాలంటే.. డిజిటల్ దోపిడీనే...

న్యూఢిల్లీ(జనంసాక్షి):డిజిటల్ అరెస్టు పేరిట జరుగుతోన్న మోసాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సైబర్ నేరాలను డిజిటల్ దోపిడీగా అభివర్ణించింది. ఆ దోపిడీదారుల్ని నిర్దాక్షిణ్యంగా శిక్షించాలని, సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని సర్వోన్నత న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. డిజిటల్ మోసాలకు సంబంధించి దేశవ్యాప్తంగా తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ ఒకచోటకు చేర్చాలంటూ నిందితులు వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. నిందితుల సౌలభ్యం కోసం బాధితులను ఇబ్బంది పెట్టలేమని తేల్చి చెప్పింది. “మా అభిప్రాయం ప్రకారం.. డిజిటల్ అరెస్టులంటే డిజిటల్ దోపిడీనే. వీడియో కాల్స్ ద్వారా ఈ నేరాలకు పాల్పడుతున్నారు. వీరికి కఠిన శిక్షలు పడాల్సిందే. విచారణకు ముందే వారిని శిక్షించేందుకు చట్టంలో ఏదైనా అవకాశం ఉంటే దానిని ఉపయోగించాలి” అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. కమిషన్ల కోసం నిందితులు తమ కంపెనీ బ్యాంకు ఖాతాలను మ్యూల్ అకౌంట్లు (సైబర్ నేరాల సొమ్మును దాచడానికి)గా వాడుకోవడానికి అనుమతించిన ఆరోపణలపై 12 రాష్ట్రాల్లో 30కిపైగా కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్నింటిని ఒకేచోటుకి చేర్చి విచారించాలని కోరుతూ నిందితులు నిధి భండారీ, గౌరబ్ సాహా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే అత్యున్నత న్యాయస్థానం వారి అభ్యర్థనను తోసిపుచ్చింది. “డిజిటల్ అరెస్టులతో పెద్దమొత్తంలో ప్రజలను మోసగిస్తోన్న నేరస్థులకు ఎలాంటి వెసులుబాట్లు ఇవ్వబోం. నిందితుల సౌలభ్యం కోసం బాధితులు లేక దర్యాప్తు సంస్థలు వేరే ప్రాంతాలకు వెళ్లేలా ఆదేశించలేం. బాధితుల హక్కులను విస్మరించి నిందితుల ప్రయోజనాలను కాపాడలేం” అని ధర్మాసనం స్పష్టం చేసింది. దోపిడీ సొమ్మును హాంకాంగ్, బ్యాంకాక్‌లో డిపాజిట్ చేస్తే.. పరిష్కారం కోసం బాధిత వ్యక్తిని అక్కడికి వెళ్లమని చెప్పలేం కదా..? అని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీంతో నిందితులు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. వారిపై దిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, కేరళం సహా పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ షాక్

న్యూఢిల్లీ(జనంసాక్షి):నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పేలవ ప్రదర్శనపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. “ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక.. ఈ నాలుగు పెద్ద రాష్ట్రాల్లోని 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. బ్యాలెట్ పత్రాలతోనే పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. మరి కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలిచిందో తెలుసా?” అంటూ ‘ఎక్స్’ వేదికగా చురకలంటించారు. ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు ఉపయోగించాలంటూ కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంత రించుకున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆరు ఉపాధ్యాయ, అయిదు పట్టభద్రుల, బిహార్‌లో నాలుగు ఉపాధ్యాయ, నాలుగు పట్టభద్రుల, కర్ణాటకలో రెండు ఉపాధ్యాయ, రెండు పట్టభద్రుల, మహారాష్ట్రలో రెండు ఉపాధ్యాయ, మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు ఈ నెల 23న ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ఫలితాల్లో కర్ణాటకలో అధికార పార్టీ కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నాలుగు స్థానాల్లోనూ ఓడిపోయింది. భాజపా మూడు స్థానాలను నిలబెట్టుకోగా, జేడీఎస్ ఒక స్థానాన్ని కైవసం చేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇప్పటివరకు భాజపా అయిదు, సమాజ్‌వాదీ పార్టీ మూడు స్థానాల్లో గెలుపొందాయి. మహారాష్ట్రలో భాజపా నేతృత్వంలోని అధికార మహాయుతి మూడు స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) రెండు స్థానాల్లో ముందంజలో ఉంది. బిహార్‌లో జన్‌సురాజ్ పార్టీ.. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకుంది. భాజపా, జేడీయూ, ఆర్జేడీ, స్వతంత్ర ఒక్కో సీటును గెలుచుకున్నాయి. ఓట్ల లెక్కింపు కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి ఫలితాలు వెలువడాల్సి ఉంది.

## ఓటరు జాబితాలో పేరున్నవారికి మళ్లీ ఫారం- 6 ఎందుకు?

కోరుతోందని ప్రశ్నించింది. ఫారం- 6 అనేది సాధారణంగా తొలిసారి ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారి కోసం ఉద్దేశించినది అని అత్యున్నత న్యాయస్థానం గుర్తు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహన సభ్యులుగా ఉన్న ధర్మాసనం బుధవారం రోజు ఈ అంశంపై విచారణ చేపట్టింది. సర్ ప్రక్రియ సమయంలో ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో పారదర్శకత లేదంటూ దాఖలైన పిటిషన్లను విచారిస్తూ సుప్రీం కోర్టు బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది.సాధారణంగా చిరునామా మార్పులు లేదా ఇతర ఓటరు వివరాల సవరణల కోసం ఫారం- 8 ఉపయోగిస్తారని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఓటరుగా నమోదైన వ్యక్తిని ముసాయిదాలో పేరు పోయినంత మాత్రాన మళ్లీ కొత్త ఓటరు కింద నమోదు చేసుకోవాలని పరిగణించడం సరైన విధానమా అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు.మరోవైపు ఓటరు జాబితాలో పేరున్న వ్యక్తి మళ్లీ ఫారం- 6 సమర్పించాల్సి రావడం అనేది తీవ్ర అసమానతలకు దారితీస్తుందని జస్టిస్ జోయ్?మాల్య బాగ్చి అభిప్రాయపడ్డారు. ఓటు హక్కు అనేది పౌరులకు అత్యంత కీలకమైనదని, దానిని నిర్లక్ష్యంగా అంత తేలికగా తొలగించలేరని స్పష్టం చేశారు.

**దిల్లీలో 43 లక్షల మంది పేర్లు గల్లంతయ్యాయా?**

పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్– నివాసం మారడం లేదా అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో సుమారు 43 లక్షల మంది పేర్లను దిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించారని తెలిపారు. వీరు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించకపోవడంతో పేర్లు చేర్చలేదని వివరించారు. చాలా మందికి ఫారం సమర్పించాలనే విషయం తెలియలేదని, మరికొందరికి పాత చిరునామాలకు ఫారాలు పంపించారని భూషణ్ వాదించారు. అయినా కూడా గతంలో ఓటర్లుగా నమోదైన వారిని ఇప్పుడు తిరిగి జాబితాలో చేర్చాలంటే ఫారం- 6 ఇవ్వాలని అధికారులు అడుగుతున్నట్లు చెప్పారు. ఇలా చేయడం వల్ల ఇంతకుముందు ఎప్పుడూ ఓటరుగా నమోదు కాలేదని, ఓటు హక్కు పొందలేదని తప్పుడు ప్రకటన చేసినట్లవుతుందని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్యుమరేషన్ ఫారం గడువులోగా సమర్పించలేకపోయిన వారికి ఇప్పుడు కూడా అదే ఫారం ఇచ్చే అవకాశం కల్పించాలని సూచించారు. అదే విధంగా నివాసం మారినవారు ఎన్యుమరేషన్ ఫారంతో పాటు ఫారం- 8 సమర్పించేలా అనుమతించాలని కోరారు.దీనిపై స్పందించిన సుప్రీం కోర్టు– డ్రాఫ్ట్ జాబితా ప్రచురించిన తర్వాత ఎన్యుమరేషన్ ఫారం స్వీకరించడానికి ఎందుకు నిరాకరిస్తున్నారని ఎన్నికల సంఘాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఫైనల్ ఓటర్ లిస్ట్ సిద్ధమయ్యే వరకు గతంలో నమోదైన ఓటర్లు ఆలస్యంగా అయినా ఫారాలు సమర్పించడానికి అవకాశం ఇవ్వొచ్చని సూచించింది.

# ఆంధ్రాలో ‘అర్నబ్’ బీభత్సం





రాత్రికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం

అమరావతి(జనంసాక్షి):అర్నబ్ తుపాను ఉభయగోదావరి జిల్లాలతో పాటు, ఉత్తరాంధ్రలో బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల తీవ్రతకు పలు చోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిన ఘటనల్లో ఏడుగురు మృతి చెందారు. విశాఖ పాత గోశాల సమీపంలో విద్యుత్తు స్తంభం కూలి మహిళ మృతి చెందగా, విశాఖ బాలాజీనగర్‌లో విద్యుత్ స్తంభం కూలి కె.మాధవి దుర్మరణం చెందారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.బీమవరంలోని చర్చి వద్ద చెట్టు విరిగిపడి చొక్కా కిషోర్(45) మృతి చెందగా, బొండాడవారివీధిలో విద్యుత్తు స్తంభం విరిగిపడి రాంబాబు (34) మృతి చెందారు. ఈదురుగాలుల ధాటికి భీమవరంలో దుకాణాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రకాష్‌పురంలో వృద్ధురాలు మృతి చెందారు. అదే జిల్లాలో ఈదురుగాలులు, వర్షానికి గుడిసె కూలి కొల్లు వెంకాయమ్మ దుర్మరణం చెందారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో ఈదురుగాలులకు విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఉదయాన్నే ప్రమాదవశాత్తూ ఇంటి ముందు ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మహిళ మృతి చెందారు.

**తుపాను వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం:సీఎం చంద్రబాబు**

అమరావతి: అర్నబ్ తుపానుతో పంట, ఆస్తి నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడారు.“అర్నబ్ తుపానుపై మూడు రోజులుగా నిరంతర సమీక్షలు చేశాం. తీవ్రత గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాం. పరిస్థితులకు అనుగుణంగా అధికారులను సన్నద్ధం చేశాం. ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా ఇస్తూ పనిచేశాం. సేఫ్, సెక్యూరిటీ, రిహాబిలిటేషన్ అనుసరిస్తూ ముందుకెళ్లాం” అని చెప్పారు.“గతంలో తుపానుల వల్ల చాలామంది చనిపోయేవారు. కానీ ఈ తుపాను ప్రభావంతో ఐదుగురే చనిపోయారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మంగళవారం రాత్రి 11.15 గంటలకు అర్నబ్ తుపాను తీరాన్ని తాకింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ నుంచి పక్క రాష్ట్రాలకు వెళ్లింది. దీని ప్రభావంతో ఇంకా కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వాతావరణం అనుకూలించక సహాయక చర్యలు ఆలస్యమవుతున్నాయి. ఆ రెండు జిల్లాలు తప్ప అన్ని జిల్లాల్లో సాయంత్రానికి విద్యుత్తు పునరుద్ధరిస్తాం. గురువారం సాయంత్రం వరకు శ్రీకాకుళం, అల్లూరి, మన్యం, అనకాపల్లి జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి” అని సీఎం సూచించారు.

**మృతుల కుటుంబాలకు రూ.5లక్షల సాయం..**

“తుపాను మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. శిబిరాల్లోని బాధితులకు రూ.1000 చొప్పున రూ.మూడు వేల వరకు సాయం చేస్తాం. కిరాణా దుకాణాలు, రెస్టరంట్లు దెబ్బ తింటే రూ.25 వేలు, రూ.40 లక్షల లోపు టర్నోవర్ ఉన్న ఎంఎస్ఎంఈలకు రూ.50 వేలు, రూ.40 లక్షల నుంచి రూ.కోటిన్నర లోపు టర్నోవర్ ఉన్న వాటికి రూ.లక్ష, రూ.కోటిన్నరకు పైగా టర్నోవర్ ఉన్న ఎంఎస్ఎంఈలకు రూ.1.5 లక్షల సాయం అందిస్తాం. ద్విచక్ర వాహనం దెబ్బతింటే రూ.3 వేలు, త్రిచక్ర వాహనానికి రూ.10 వేల సాయం, దెబ్బతిన్న ఫిషింగ్ బోట్లకు రూ.9 వేలు, వలల మరమ్మతులకు రూ.5 వేలు, వలలు ఉన్న ఫిషింగ్ బోటు దెబ్బతింటే రూ.25 వేల సాయం చేస్తాం” అని చంద్రబాబు తెలిపారు.

**రాత్రికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం**

అతి తీవ్ర తుపాను అర్నాబ్ తుపానుగా బలహీనపడిందని, ఈ రోజు రాత్రికి క్రమంగా తీవ్ర వాయుగుండంగా మారనుందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో గురువారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీవర్షాలు.. మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు. భారీ వర్షాలతో ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉన్నందున.. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

**అర్నబ్ బీభత్సం.. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టం**

అర్నబ్ తుపాను ఉమ్మడి గుంటూరు కృష్ణా జిల్లాలను సైతం వణికిస్తోంది. ఎడతెరిపిలేని వర్షాలతో గుంటూరులోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గుజ్జనగుండ్ల–కొరిటపాడు మార్గంలో రహదారిపై మోకాళ్ల లోతు వరకు వరద చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారు. బాపట్లలో 8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈదురుగాలుల బీభత్సానికి తీర ప్రాంతంలో చెట్లు నేలకొరిగాయి. వేమూరు నియోజకవర్గంలో పంట పొలాలు నీటమునిగాయి. మరోవైపు కృష్ణా జిల్లాలోనూ లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

**ఉమ్మడి విజయనగరంలో భారీ వర్షాలు**

విజయనగరంలో అర్నబ్ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తోన్న వర్షాలకు రహదారులు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వర్షాలతో చెరువులు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇంటర్నెట్ డెస్క్: ఏపీని వణికించిన ‘అర్నబ్’ అతి తీవ్ర తుపాను యానాంకు నైరుతి దిశలో నరసాపురానికి సమీపంలో తీరం దాటింది. ఈ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రహదారులతోపాటు ఇళ్లపై చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వరిపంట నేలకొరిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్నబ్ తుపాను ఉమ్మడి గుంటూరు కృష్ణా జిల్లాలను సైతం వణికిస్తోంది. ఎడతెరిపిలేని వర్షాలతో గుంటూరులోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గుజ్జనగుండ్ల–కొరిటపాడు మార్గంలో రహదారిపై మోకాళ్ల లోతు వరకు వరద చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బాపట్లలో 8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈదురుగాలుల బీభత్సానికి తీర ప్రాంతంలో చెట్లు నేలకొరిగాయి. వేమూరు నియోజకవర్గంలో పంట పొలాలు నీటమునిగాయి. మరోవైపు కృష్ణా జిల్లాలోనూ లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అర్నబ్ తుపాను ప్రభావంతో ఏపీ అతలాకుతలమవుతోంది. ఎడతెరపి లేకుండా వర్షాలు, ఈదురు గాలులతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నదులు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

**విశాఖ అతలాకుతలం**

విశాఖలో అర్నబ్ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తోన్న వర్షాలకు రహదారులు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

## మాకు సాయం చేయండి

హైదరాబాద్(జనంసాక్షి):బంగాళాఖాతంలో ఏర్పడిన ‘అర్నబ్’ తుపాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏపీ ప్రభుత్వం.. తెలంగాణ రాష్ట్ర సహాయ సహకారాలు కోరింది. ఏపీలో తుపాను ధాటికి విద్యుత్ వ్యవస్థకు ఎలాంటి నష్టం వాటిల్లినా తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా సహకరించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ మేరకు తెలంగాణ విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంత్తో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఫోన్లో మాట్లాడారు. తుపాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే త్వరితగతిన పునరుద్ధరించేందుకు వీలుగా అదనపు సిబ్బందిని, అవసరమైన విద్యుత్ సామాగ్రిని పంపాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ విజ్ఞప్తిపై తెలంగాణ ప్రభుత్వం అత్యంత సానుకూలంగా స్పందించింది. విపత్తు సమయంలో ఏపీకి అన్ని విధాలా అండగా నిలిచేందుకు ముందుకు వచ్చింది. అవసరమైన సాంకేతిక సిబ్బందిని, విద్యుత్ సామగ్రిని తక్షణమే ఏపీకి పంపించేందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్.. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

## అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేష్ రంజన్

ప్రధాన కార్యదర్శిగా రాహుల్‌బొజ్జాకు, కోర్ అర్బన్ రీజియన్ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శిగా కె.ఇలంబర్తి, మహిళా సంక్షేమం, ఎస్సీ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శ్రుతి ఓజా, వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించింది. ఎస్పీడీసీఎల్ ఎండీ జితేష్ పాటిల్‌కు టీజీ రెడ్కో వీసీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

### కష్టకాలంలో కలిసికట్టుగా పనిచేద్దాం

ఏపీ 17 టీఎంసీలు వినియోగించుకున్నాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు చేపట్టాం. కేంద్ర జల్‌శక్తి సాంకేతిక కమిటీ మార్గదర్శకాల ప్రకారమే ముందుకెళ్తున్నాం. మరమ్మతులు పూర్తయ్యే వరకు గేట్లు దించొద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. మేడిగడ్డ గేట్లు దించకుండా నీరు ఎత్తిపోసి నిల్వ చేయడం సాధ్యం కాదు” అని వివరించారు.

## హైస్పీడ్ రైళ్లు ఢీ..

### 64 మంది మృతి!

### స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం

మాడ్రిడ్(జనంసాక్షి):స్పెయిన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. టోలెడో ప్రావిన్సులో రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 64 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికిపైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగినట్లు స్పెయిన్ రైల్ సిస్టమ్ ఆపరేటర్ ఏడీఐఎఫ్ వెల్లడించింది. దీంతో మాడ్రిద్, సియదాద్ రియల్, అందాలూసియా నగరాల మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయినట్లు తెలిపింది.మాడ్రిద్ నుంచి సెవిల్లే వైపు ఒకే దిశలో రెండు రైళ్లు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఆగి ఉన్న రైలును వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో రైలు ఢీకొట్టడంతో దుర్ఘటన జరిగినట్లు తెలిపింది. రెండు బోగీలు పూర్తిగా పట్టాలు తప్పినట్లు సమాచారం. ఘటన సమయంలో ఒక రైల్లో 397 మంది, మరో రైల్లో 147 మంది ప్రయాణికులు ఉన్నారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాది జనవరిలో దక్షిణ స్పెయిన్‌లో జరిగిన రైలు ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు.



# హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రావొద్దు

భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు.

**ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి**

ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి, నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును హైడ్రా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు.ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్‌ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, నవీన్ నికోలస్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, జితేష్ వి.పాటిల్, రవి, ముకుందరెడ్డి సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలీసు సేవల్లో సాంకేతిక విప్లవం

నుంచి ముగింపు వరకు పర్యవేక్షించవచ్చు. కాగితపు రిజిస్టర్లకు బదులుగా రాష్ట్రస్థాయి డ్యాష్‌బోర్డులు, 23 రకాల నివేదికలు అందుబాటులో ఉంటాయి.విడుదలైన ఖైదీల నిఘా జైళ్ల నుంచి విడుదలయ్యే ఖైదీల సమాచారాన్ని పోలీసులకు సకాలంలో చేరవేసేందుకు జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టమ్ (జేఆర్ఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చారు. ఎన్ఐసీకి చెందిన ఈ–ప్రిజన్స్ వ్యవస్థను సీసీటీఎన్ఎస్‌తో అనుసంధానించారు. ఖైదీల విడుదల వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్లు, అధికారులకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయడంతోపాటు రాష్ట్రస్థాయి డ్యాష్‌బోర్డులు, కృత్రిమ మేధ ఆధారిత విశ్లేషణ, ఖైదీల వివరాల శోధనకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. నేర నెట్‌వర్క్‌లను గుర్తించేందుకు, ముందస్తు నిఘాను బలోపేతం చేసేందుకు దోహదపడుతుంది. 15 సెకన్లలో ముఖ గుర్తింపు 9.8 లక్షలకు పైగా ఫొటోలతో రూపొందించిన మొబైల్ ఫేస్ సెర్చ్ యాప్ ద్వారా సుమారు 15 సెకన్లలో ముఖాలను సరిపోల్చవచ్చు. అనుమానితులు, మృతులు, గుర్తుతెలియని మృతదేహాలు, తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడంలో ఇది ఉపయోగపడుతుంది. ఫింగర్ ప్రింట్లతో వేగంగా ఆధారాల సేకరణ క్రైమ్ సీన్ ఛాన్స్ ప్రింట్ యాప్ ద్వారా నేరస్థలాల్లో లభించే వేలిముద్రలను ఆండ్రాయిడ్ ఫోన్లతోనే సేకరించి, వెంటనే రాష్ట్ర సర్వర్‌కు పంపవచ్చు. అక్కడ ఆటోమేటిక్‌గా సరిపోల్చడం ద్వారా అనుమానితులను గుర్తించేందుకు త్వరితగతిన ఆధారాలు లభిస్తాయి. దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తు అధికారులకు మార్గదర్శకాలు నేర పరిశోధనలో ప్రమాణాలను మెరు గుపరిచేందుకు ఐదు సంపుటాల ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్ఓపీలు) రూపొందించారు. శారీరక నేరాలు, ఆస్తి నేరాలు, మహిళలు–పిల్లలపై నేరాలు, ప్రత్యేక–స్థానిక చట్టాలు, ఇతర నేరాలకు సంబంధించి వీటిలో మార్గదర్శకాలు ఉన్నాయి. దర్యాప్తు నాణ్యతను పెంచి, న్యాయస్థానాల్లో నేర నిరూపణ అవకాశాలను మెరుగుపరిచేందుకు ఇవి దోహదపడనున్నాయి.ఈ డిజిటల్ సేవలతో పోలీసు వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెరగడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని అధికారులు పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ప్రామాణిక దర్యాప్తు విధానాల సమన్వయంతో నేర నియంత్రణ, పరిశోధనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిజిపి సి. వి. ఆనంద్ తో పాటు, డిజి (లా&ఆర్డర్) మహేష్ భగవత్, డిజి (సిఐడి) చారు సిన్హా, ఎడిజి అకన్ సబర్వాల్, ఐజి (పిఎల్) గజరావు భూపాల్, డిఐజిలు నారాయణ నాయక్, పరిమళ హన నూతన్ , ఎస్పీలు విశ్వజిత్ కంపాటి, రూపేష్, ప్రవీణ్ కుమార్, మల్లారెడ్డి , బాలకోటి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతో నిర్వహించే దమ్ముందా?’

దేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు బ్యాలెట్ పేపర్, ఓటర్ల జాబితాల చుట్టూ తిరుగుతున్న రాజకీయం మరోసారి తీవ్రరూపం దాల్చింది. తాజాగా నాలుగు ప్రముఖ రాష్ట్రాల్లోని 28 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాల్లో ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవకపోవడంపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించిన సంగతి తెలిసిందే. బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వచ్చాయన్నట్లు ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేయగా, దీనిపై కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది. ఈవీఎంలపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న సందేహాలకు సంబంధించి ప్రధాని మోదీకి కాంగ్రెస్ పార్టీ సవాల్ విసిరింది. ఈవీఎంల వల్ల ఎన్నికల ఫలితాల్లో ఎలాంటి ప్రభావం ఉండదని ప్రధాని నిజంగా నమ్మితే, భవిష్యత్తులో జరిగే అన్ని లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు అన్నింటినీ బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేసింది. మాటలకే పరిమితం కాకుండా, బీజేపీ ఎన్నికల్లో గెలవగలదనే విశ్వాసాన్ని చేతల్లో చూపించాలని పేర్కొంది.ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ అంతకుముందు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, కర్ణాటక, మహారాష్ట్ర ఇలా నాలుగు పెద్ద రాష్ట్రాల్లోని 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయని చెప్పిన మోదీ– బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికల ప్రక్రియ నిర్వహించారని తెలిపారు. మరి కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలిచిందో తెలుసా? అని ప్రశ్నిస్తున్నట్లు వ్యంగ్యంగా పోస్ట్ చేశారు. బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయిందని మోదీ ఎద్దేవా చేశారు. ఈవీఎంలపై ప్రతిపక్షాలు తరచుగా విమర్శలు చేస్తున్న నేపథ్యంలోనే మోదీ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే మరోసారి రెండు పార్టీల మధ్య రాజకీయ వాగ్వాదం మొదలైంది. మోదీ పోస్ట్‌పై కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం హెడ్ పవన్ ఖేరా స్పందించారు.

**సర్ ప్రక్రియను నిలిపివేయాలి– తొలగించిన ఓటర్ల పేర్లను చేర్చాలి!**

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికల నిర్వహణకు హామీ ఇవ్వడంతో పాటుగా పవన్ ఖేరా కాంగ్రెస్ తరఫున మరో 3 డిమాండ్లను కూడా ముందుకు తెచ్చారు. ముందుగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయాలని, తొలగించిన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. అలానే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఆయనకు చట్టపరంగా రక్షణ కల్పిస్తున్న చట్టాన్ని రద్దు చేయాలని స్పష్టం చేశారు. ఈ డిమాండ్లపై ప్రధాని చర్యలు తీసుకునే వరకు ఆయన వ్యాఖ్యలను ఎవరూ తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదని ఖేరా విమర్శించారు.

## ‘టాటా గ్రూప్‌ను నాశనం చేసేందుకు కుట్ర

ట్రస్ట్‌ను బలహీనపరిస్తే గ్రూప్ కంపెనీలు, వాటిపై ఆధారపడిన ఉద్యోగుల భవిష్యత్ ప్రమాదంలో పడుతుంది. ఇంత జరుగుతున్నా.. ఏ వ్యాపారవేత్త కూడా ఒక్క మాట మాట్లాడటానికి సాహసించట్లేదు. మీరు ఇంకెంతకాలం మౌనంగా ఉంటారు? వారు మిమ్మల్ని సొంతం చేసుకునేంత వరకా? భారతదేశంలో వ్యాపారం ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాల ఆటబొమ్మ కాదు. దీనిపై ప్రశ్నించేందుకు మీకు ధైర్యం లేదు. కానీ మాకు ఉంది. ఈ విషయంలో తగిన న్యాయం జరిగేలా చూస్తాం’ అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన ఆరోపణలపై ప్రభుత్వం గానీ.. టాటా గ్రూప్ గానీ స్పందించలేదు.అలా అయితే న్యూస్‌రూంలు మూతపడతాయి

ఇటీవల ఎన్.చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్ల కాలానికి ఛైర్మన్‌గా పునర్నియమిస్తూ టాటా సన్స్ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ నిర్ణయం చట్టవిరుద్ధమని, చెల్లుబాటు కాదని ట్రస్ట్ వ్యతిరేకిస్తోంది. ఈక్రమంలోనే రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించండి

- జిల్లా కలెక్టర్ మను చౌదరిని కోరిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానికంగా కళాశాల అందుబాటులో ఉంటే విద్యార్థులకు ఉన్నత విద్య మరింత చేరువవుతుందని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించి, నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ ప్రతిపాదనను పరిశీలించి, స్థల కేటాయింపునకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# సమాచార హక్కు చట్టంలోని సెక్షన్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(జనంసాక్షి) :** సమాచార హక్కు చట్టంలోని ప్రతి సెక్షనుపై ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, అప్పిలేట్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ డా. జి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మోసిన పర్వీన్, దేశాల భూపాల్, బో రెడ్డి అయోధ్య రెడ్డి, వైష్ణవి మెర్ల, జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, అదనపు ఎస్.పి. చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి లతో కలిసి అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులకు నిర్వహించిన సమాచార హక్కు చట్టం సెక్షన్ల అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలోని ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆర్.టి.ఐ. దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా సమాచారం అందించవచ్చని తెలిపారు. సమాచారం పూర్తి పారదర్శకంగా, సరళీకృతంగా ఉండేలా చూడాలని, ఆర్.టి.ఐ. దరఖాస్తు అంటే ఎలాంటి ఆందోళన, భయం ఉండకూడదని, దరఖాస్తులోని అంశాలను పూర్తిగా తెలుసుకోవాలని, ఇవ్వవలసిన సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఉద్యోగుల వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదని సూచించారు. ప్రపంచంలో 132 దేశాలలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలవుతుందని, సంస్థ విధులు, బాధ్యతలు అధికారులు, ఉద్యోగులు బాధ్యతలు, నిర్ణయ ప్రక్రియ, పర్యవేక్షణ, జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిషనర్ల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ లపై అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తుదారులకు, పౌరులకు సమాచారాన్ని సకాలంలో అందించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పారదర్శకతను పెంపొందించడం, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచార హక్కు చట్టంలోని అంశాలు సెక్షన్లపై సమాచార కమిషనర్లు వివరించారు. అనంతరం సమాచార హక్కు చట్టం అప్పీలు దరఖాస్తులపై హియరింగ్ నిర్వహించారు. అంతకుముందు సమీకృత జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న సమాచార కమిషనర్లకు జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్లు స్వాగతం పలికారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో అప్పిలేట్ అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు పాల్గొన్నారు.

# మైనార్టీ సంక్షేమ దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

- సీఎం ప్రజావాణిలో వినతి పత్రం
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** భారతదేశపు మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నవంబర్ 11న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంఘం అధ్యక్షులు ఎండి యాకూబ్ పాషా మంగళవారం నాడు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆధునిక విద్యారంగంలో, దేశ నిర్మాణంలో ఆయన చేసిన సేవలు మరువలేమని దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి రాష్ట్రంలో దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవం,అలాగే మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించడం జరిగిందని అన్నారు.నేటి ప్రభుత్వాలు మాత్రం సూత్రప్రాయంగా మైనార్టీ దినోత్సవాన్ని కేవలం మైనార్టీ గురుకుల విద్యా సంస్థలకే పరిమితం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించేలా తగు ఉత్తర్వులు జారీ చేస్తూ రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం నాడు సీఎం ప్రజా వాణిలో వినతి పత్రం సమర్పించడంతోపాటు ముఖ్యమంత్రి ,మైనార్టీ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మైనార్టీ సంక్షేమ కార్యదర్శికి లేఖలు రాశామని యాకూబ్ పాషా తెలిపారు.

# ఓయూలో ఉద్యోగుల పెన్‌డౌన్-టూల్‌డౌన్ నిరసన

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని నాన్ టీచింగ్ జేఏసీ డిమాండ్



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాన్ టీచింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పెన్‌డౌన్–టూల్‌డౌన్ కార్యక్రమానికి ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది నిరసనలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని యూనివర్సిటీ యాజమాన్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం పెన్షన్ ప్రయోజనాలు కల్పించాలని, టైమ్‌స్కేల్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 60 శాతం బకాయిలను విడుదల చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. 2023 నుంచి నిలిచిపోయిన రిటైర్మెంట్ ప్రయోజనాలను పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏప్రిల్ 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.1,500 వార్షిక ఇంక్రిమెంట్‌ను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని కోరారు. దీర్ఘకాలంగా యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని, కోర్టు ఆదేశాల ప్రకారం వారి వివరాలను అనుబంధం 1, అనుబంధం 2 రూపంలో అక్టోబర్ 30లోగా సమర్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కుమార్, అధ్యక్షుడు ఖదీర్ ఖాన్, కార్యవర్గ సభ్యులు, ఆరు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం

- ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(జనంసాక్షి ):** ఓటు హక్కును కాపాడటం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్ అన్నారు. నవంబర్ 1న న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఓట్ బచావో- దేశ్ బచావో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో బుధవారం డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఏఐసీసీ అబ్జర్వర్ మరియప్పన్, కార్యక్రమ కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావో – దేశ్ బచావో' కార్యక్రమం ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పోరాటాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు సంరక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. ఓటరు జాబితాలో అక్రమాలు, అవకతవకలు జరగకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు దక్కేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని, 'ఓట్ బచావో – దేశ్ బచావో' అభియాన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జి శ్యాంనాయక్ మాట్లాడుతూ ఓటరు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభియాన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు దక్కేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కోట్లాది మంది ఓటర్ల ఓటు హక్కులను ప్రమాదంలోకి నెట్టివేశారని, ఆయన బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. అందుకే ప్రధాని మోదీ ఆయనను కాపాడుతున్నారని విమర్శించారు.

ఈ సమావేశంలో మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్ రావు,మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్,ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, కాగాజ్ నగర్ మార్కెట్ చైర్మన్ సుద్దాల దేవయ్య,ఆసిఫాబాద్ మున్సిపాల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# బీసీ లైజన్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బి.కృష్ణప్రసాద్‌కు ఘన సన్మానం



**శ్రీరాంపూర్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ డివిజన్ జీఎం కార్యాలయంలో ఎస్ఓ టు జీఎంగా విధులు నిర్వహిస్తున్న బి.కృష్ణ ప్రసాద్ బీసీ లైజన్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జీఎం కార్యాలయానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొని కృష్ణ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ లైజన్ అధికారి అటు కంపెనీకి, ఇటు ఉద్యోగులకు మధ్య సమన్వయ వారధిగా వ్యవహరించే కీలకమైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సేవా సంబంధిత అంశాల్లో ఏవైనా అన్యాయాలు లేదా సమస్యలు ఎదురైనప్పుడు వాటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, సానుకూలమైన వాతావరణంలో పరిష్కరిం చేందుకు లైజన్ అధికారి కృషి చేయాలని అన్నారు. కంపెనీ, ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు, పరస్పర అవగాహన పెంపొందించడంలో లైజన్ అధికారి పాత్ర ఎంతో కీలకమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అధికారులు, సిబ్బంది కమిటీ కన్వీనర్, బీజీఎం పర్సనల్ డాక్టర్ అనిల్ కుమార్, ఎస్సీ లైజన్ అధికారి కె. ఆనంద్ కుమార్, ఎస్టీ లైజన్ అధికారి ఆర్. గుండేరావు, అడ్వైజర్ డీజీఎం రాజన్న, అకౌంట్స్ ఆఫీసర్ కె.రవి, డాక్టర్ రమేష్ బాబు, పర్చేస్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఉద్యోగుల కో–కన్వీనర్ ధారావత్ రాజేష్, సంగీత, సంజయ్ జై, జె. కుమార్ (అకౌంటెంట్), సిబ్బంది అజ్మీర్ గణేష్, ఎస్. శ్రావణ్, పత్తిపాక రమ్య శ్రీ, తౌటం నవ్య, రజిత, సుమన్, స్వామి, బానోత్ గీత, జుమ్మిడి శ్యామల, తనుజ, బీసీ సంఘం వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సిక్కా నాయకులు కన్నం సాంబయ్య, సోమిశెట్టి వేణి, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన బీసీ లైజన్ అధికారి బి.కృష్ణప్రసాద్‌కు పలువురు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేసి, ఆయన భవిష్యత్తులో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.



# వరిపొలంలో మొసలి

**పాపన్నపేట, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ఓ రైతు వరి పొలంలో భారీ మొసలి ప్రత్యక్షమైంది. దీంతో కర్షకులు,గ్రామ ప్రజలు ఆందోళన చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా ఎన్కేపల్లి గ్రామంలో బుధవారం ఉదయం వెలుగు చూసింది. దీంతో అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు, సంగారెడ్డి రెస్క్యూ టీం వెంటనే రంగం లోకి దిగారు. క్షేత్ర స్థాయిలో మొసలిని తాడు,వివిధ సామాగ్రి సాయంతో సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం మంజీరా డ్యామ్ ప్రాంతంలో వదిలిపెట్టారు. నది పరివాహక తీర ప్రాంతాల్లోని రైతులు పొలాల వద్ద వన్యప్రాణుల పట్ల జాగ్రత్తలు పాటించాలని అటవీ శాఖ రేంజ్ అధికారిణి హిమ చందన తెలిపారు. అటవీ శాఖ బీట్ అధికారిణి శారద, సెక్షన్ అధికారి శ్రీనివాస్,సిబ్బంది భవాని ప్రసాద్, మెదక్ బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ లీగల్ మెట్రోలజీ ఇన్‌స్పెక్టర్

**యాదాద్రి భువనగిరి (జనంసాక్షి) :** జిల్లాలోని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వర్లు అవినీతి అధికారులకు చిక్కాడు. ఆయనతోపాటు మరో ప్రైవేట్ వ్యక్తిని పట్టుకున్నారు. జిల్లాలోని పెట్రోల్ బంక్‌లో డెయిలీ సేల్స్ రిజిస్టర్‌వెరిఫికేషన్ సర్టిఫికేట్ మంజూరి కోసం ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వర్లు మధ్యవర్తి కాశారం రవీందర్ ద్వారా రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. ఫిర్యాదు దారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో బుధవారం లంచం తీసుకున్న ప్రైవేట్ వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచాన్ని పురామాయించిన లీగల్ మెట్రోలజీ ఇన్‌స్పెక్టర్ ను అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

# మోడల్ పోలీసింగ్‌లో ఏఐ టెక్నాలజీ వినియోగం

- పైలట్ ప్రాజెక్టుగా పంజాగుట్ట మోడల్ పోలీస్ స్టేషన్ ఎంపిక




**అమీర్‌పేట/పంజాగుట్ట, అక్టోబర్ 28 (జనం సాక్షి):** పోలీసు సేవలను మరింత సరళతరం చేసి, ప్రజలకు వేగంగా అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా పంజాగుట్ట మోడల్ పోలీస్ స్టేషన్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మేరకు ఫిర్యాదుల నమోదు కోసం రూపొందించిన 'సేతు' యాప్ పనితీరును ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి పరిశీలించారు. యాప్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నిర్వాహకులను అడిగి దాని పనితీరు, వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. చదువురాని వారు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేసి ఫిర్యాదు నమోదు చేసుకునేలా ఈ విధానాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా ఫిర్యాదుదారులు ప్రత్యేక యంత్రం ముందు నిలబడి తమ వివరాలను నమోదు చేస్తే టోకెన్ జనరేట్ అవుతుంది. అనంతరం సుమారు 30 సెకన్ల వ్యవధిలో వీడియో రికార్డింగ్ ద్వారా తమ ఫిర్యాదును తెలియజేసే అవకాశం కల్పిస్తారు. ఈ వీడియో రికార్డింగ్ సంబంధిత అడ్మిన్ ఆఫీసర్‌తో పాటు సెక్టార్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)కు చేరుతుంది. దీంతో కాగితాల అవసరం లేకుండానే ఫిర్యాదుల నమోదు, సంబంధిత అధికారులకు సమా చారం చేరవేత ప్రక్రియ సులభతరం కానుం ది. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరు వ చేయడం, ఫిర్యాదుల నమోదులో ఇబ్బం దులను తగ్గించడం, సాంకేతిక పరిజ్ఞానంతో సేవలను మెరుగుపరచడం ఈ పైలట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.

# సాయి శ్రీనివాస బాటిల్ కంపెనీలో వైభవంగా ఎల్లమ్మ కల్యాణం, పుట్టమన్ను మైలపోలు

- పెద్ద అంబర్‌పేట-కోహెడ రోడ్డులోని సాయి సాయి శ్రీనివాస బాటిల్ కంపెనీలో ఆధ్యాత్మిక శోభ





**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెద్ద అంబర్‌పేట-–కోహెడ రోడ్డులోని సాయి సాయి శ్రీనివాస బాటిల్ కంపెనీలో నిర్వహించిన ఎల్లమ్మ కల్యాణం, పుట్టమన్ను మైలపోలు, అంగరంగ వైభవమైన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు ఎల్లమ్మ తల్లులకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల కృపాకటాక్షాలు కంపెనీపై ఎల్లప్పుడూ ఉండాలని, సంస్థ నిరంతరం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రతి ఒక్కరికీ అమ్మవార్ల ఆశీస్సులు లభించాలని మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అమ్మవార్ల పూజలు, బోనాల సమర్పణ, ఎల్లమ్మ కల్యాణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని చాటిచెప్పాయి. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తాయి. అనంతరం కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఉప్పల శ్రీనివాస్ గుప్త వస్త్రాలను పంపిణీ చేశారు. కార్మికులతో ఆత్మీయంగా మెలుగుతూ వారికి వస్త్రాలు అందజేశారు. సంస్థ అభివృద్ధిలో కార్మికులు, ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, వారి కష్టపడి పనిచేసే తత్వం, అంకితభావమే సంస్థ పురోగతికి పునాదులని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడమే కాకుండా, ప్రజల మధ్య సోదరభావాన్ని, ఆత్మీయతను, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. అమ్మవార్ల దీవెనలతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త సతీమణి ఉప్పల స్వప్న, పెద్ద కుమారుడు ఉప్పల సాయి కిరణ్, చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ, వైష్ణవి, కుటుంబ సభ్యులు, కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, కార్మికులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ తెలంగాణ!

సంపాదకీయం

విడిపోయినా విడిపోని బంధం ఇది. రాష్ట్రాలుగా వేరైనా, తెలంగాణ, ఆంధ్ర ప్రజల గుండె ఒక్కటే అని తెలంగాణ మరోసారి నిరూపించింది. అర్నబ్ తుఫాను ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత జిల్లాలను అతలాకుతలం చేసి, విద్యుత్ వ్యవస్థను దెబ్బతీసిన వేళ, సాయం కోరిన మరుక్షణమే చేయందించిన తెలంగాణ ప్రభుత్వ స్పందన అభినందనీయం.

బుధవారం ఏపీ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేసిన విజ్ఞప్తికి తెలంగాణ ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెంటనే స్పందించారు. స్వయంగా ఫోన్ చేసి మాట్లాడి, అనుభవజ్ఞులైన క్షేత్రస్థాయి సిబ్బందిని, పునరుద్ధరణ పనులకు అవసరమైన భారీ సామాగ్రిని పంపేందుకు పూర్తిగా అంగీకరించారు. ఇది కేవలం అధికారిక లాంఛనం కాదు; కష్టంలో ఉన్న సోదరుడికి అందిన భరోసా.

విపత్తు సమయంలో ప్రతి గంటా విలువైనదే. కరెంటు లేకపోతే ఆసుపత్రులు, తాగునీటి సరఫరా, సమాచార వ్యవస్థలు స్తంభిస్తాయి. సామాన్యుడి జీవితం చీకట్లో మగ్గుతుంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ సుమారు 6,000 మంది సిబ్బందిని రంగంలోకి దించింది. 1912 కాల్ సెంటర్‌ను బలోపేతం చేసి ఒకేసారి 30,000 కాల్స్ స్వీకరించే ఏర్పాటు చేసింది. ఇప్పుడు తెలంగాణ సిబ్బంది కూడా తోడైతే పునరుద్ధరణ పనులు మరింత వేగం పుంజుకుంటాయి. ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వెలుగులు త్వరగా చేరతాయి.

ఈ సహకారానికి రాజకీయ రంగులు పులమాల్సిన అవసరం లేదు. పరిపాలనా సరిహద్దులు మనుషుల మధ్య గోడలు కాకూడదనే సందేశం ఇందులో ఉంది. భాష, సంస్కృతి, చరిత్ర, బంధుత్వాలతో పెనవేసుకున్న రెండు రాష్ట్రాలు కష్టకాలంలో ఒకరికొకరు తోడుగా నిలవడమే నిజమైన సహకార సమాఖ్య స్ఫూర్తి. గతంలో వరదల సమయంలోనూ ఇరు రాష్ట్రాల ప్రజలు, ప్రభుత్వాలు ఇలాగే చేయి కలిపిన సందర్భాలు ఉన్నాయి. ఆ సంప్రదాయం కొనసాగడం శుభపరిణామం.

తెలంగాణ ఇచ్చిన ఈ మద్దతుకు ఆంధ్రప్రదేశ్ మంత్రి కృతజ్ఞతలు తెలపడం సముచితం. రేపు తెలంగాణకు ఏ ఆపద వచ్చినా ఆంధ్రప్రదేశ్ కూడా అదే ఆత్మీయతతో స్పందిస్తుందనడంలో సందేహం లేదు. ప్రకృతి వైపరీత్యాలకు ప్రాంతాల హద్దులు తెలియవు. వాటిని ఎదుర్కోవడానికి కావాల్సింది ఐక్యతే. ప్రాంతాలుగా విడిపోయినా, అన్నదమ్ములుగా కలిసి ఉండటమే తెలంగాణ, ఆంధ్ర ప్రజల గొప్పదనం. ఈ ఆపన్నహస్తం ఆ గొప్పదనానికి నిలువెత్తు సాక్ష్యం. శభాష్ తెలంగాణ!

# ఓటు హక్కుపై నీడలు!



భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణం. ప్రజలు తమ పాలకులను స్వేచ్ఛగా ఎన్నుకోవడం, అధికారంలో ఉన్నవారిని ఓటుతో గద్దె దించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అసలైన బలం. అయితే ఎన్నికలు నిర్వహించే సంస్థ విశ్వసనీయతే ప్రశ్నార్థకమైతే ప్రజాస్వామ్య పునాదులే కదిలిపోతాయి. ప్రస్తుతం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలి, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నెలకొన్న వివాదాలు ఇలాంటి ఆందోళనలనే ముందుకు తెస్తున్నాయి. ఇది అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సాధారణ రాజకీయ ఘర్షణగా కొట్టిపారేయదగిన అంశం కాదు. రాజ్యాంగ సంస్థల స్వతంత్రత, ఎన్నికల పారదర్శకత, పౌరుల ఓటు హక్కుకు సంబంధించిన కీలకమైన ప్రజాస్వామ్య పరీక్ష.

ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ ప్రతిపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఢిల్లీలోని రెండు వేదికల వద్ద అనుమతులు లభించకపోవడంతో, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో అక్టోబర్ 30న ప్రతీకాత్మక అభిశంసన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ కార్యక్రమాన్ని చట్టబద్ధమైన అభిశంసన ప్రక్రియగా కాకుండా, ఎన్నికల సంఘంపై తమ అభ్యంతరాలను ప్రజల ముందుంచే రాజకీయ నిరసనగా చూడాలి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఎంత ముఖ్యమో, దానికి వర్తించే చట్టబద్ధమైన నిబంధనలూ అంతే ముఖ్యమైనవి. ప్రభుత్వ భవనమైన అశోకా హోటల్‌లో అనుమతి నిరాకరించిన తరువాత, రామ్‌లీలా మైదాన్ వద్ద ఏర్పాట్లను కూడా పోలీసులు అడ్డుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే శుక్రవారం జరగనున్న కార్యక్రమానికి ప్రత్యేక అనుమతి కోరలేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరస్పర విరుద్ధ వాదనలపై నిర్ధారిత సమాచారం ఆధారంగా మాత్రమే నిర్ణయానికి రావాలి. అదే సమయంలో, ప్రతిపక్షాల నిరసనలకు అనుమతుల విషయంలో ప్రభుత్వ యంత్రాంగం నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నదా అనే ప్రశ్నకు పారదర్శకమైన సమాధానం అవసరం.

ఇంతకంటే తీవ్రమైన అంశం ఓటర్ల జాబితాల సవరణ. ఓటర్ల జాబితాల్లో మరణించినవారి పేర్లు తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం, నకిలీ నమోదులను సరిదిద్దడం ఎన్నికల సంఘం బాధ్యత. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఆ ప్రక్రియలో నిజమైన ఓటర్ల పేర్లు తొలగిపోతే, అర్హత ఉన్న పౌరులు ఓటు వేయలేని పరిస్థితి ఏర్పడితే, సవరణ లక్ష్యమే ప్రశ్నార్థకమవుతుంది. ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం పేరుతో ఓటు హక్కును కుదించే పరిస్థితి ఏర్పడకూడదు. ఎన్నికల నిష్పాక్షికతను కాపాడటానికి చేపట్టే చర్యలే పౌరుల్లో అభద్రతను పెంచితే, వాటి అమలులోని లోపాలను సరిదిద్దడం అనివార్యం.

ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న వివాదాల్లో ఎస్ఐఆర్ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నారా, ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యం ఇచ్చారా, కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో మార్పులు ఎలా జరిగాయి అనే అంశాలు ఉన్నాయి. ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో ఎస్ఐఆర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నామని పేర్కొంది. అయితే గత పది నెలల్లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కనీసం 14 సందర్భాల్లో తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా వ్యక్తం చేశారన్న వార్తా కథనం ఈ వ్యవహారంపై మరిన్ని ప్రశ్నలను లేవనెత్తింది. ఆ అభ్యంతరాలే తుది నిర్ణయాల్లో విభేదాలున్నాయని నిరూపించవు. అలాగే ఎన్నికల సంఘం ఏకగ్రీవ నిర్ణయాల వాదన ఒక్కటే అంతర్గతంగా ఎలాంటి సమస్యలూ లేవని నిర్ధారించదు. అసలు నిర్ణయాలు ఎలా తీసుకున్నారు, అభ్యంతరాలను ఎలా పరిష్కరించారు, సంబంధిత రికార్డులు ఏమి చెబుతున్నాయి అనే అంశాలు నిష్పాక్షిక విచారణ ద్వారానే స్పష్టమవుతాయి.

ఫారం-6 వివాదం ఈ పారదర్శకత అవసరాన్ని మరింత స్పష్టంగా చూపుతోంది. కొత్త ఓటర్ల నమోదుకు ఉద్దేశించిన ఈ ఫారంలో ఎస్ఐఆర్‌కు సంబంధించిన అదనపు ప్రకటనను చేర్చిన విధానంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు ఈ మార్పును తాను ఆమోదించలేదని స్పష్టం చేసిన నేపథ్యంలో, ఎన్నికల సంఘం తన వివరణను కోర్టుకు సమర్పించింది. ఆ ప్రకటనను ప్రత్యేక పత్రంగా పరిగణించాలన్నది సంఘం వాదన. ఆన్‌లైన్‌లో దాన్ని ప్రదర్శించిన విధానం ఫారం సవరించినట్లుగా కనిపించి ఉండవచ్చని కూడా సంఘం అంగీకరించింది. ఇక్కడ సమస్య కేవలం ఒక ఫారం రూపకల్పనకు పరిమితం కాదు. ఓటరు నమోదు వంటి కీలక ప్రక్రియలో ఏ సమాచారం తప్పనిసరి, దానికి చట్టబద్ధమైన ఆధారం ఏమిటి, మార్పులను ఎవరు ఆమోదించారు అనే విషయాలు స్పష్టంగా ఉండాలి. సాంకేతిక సౌలభ్యం చట్టబద్ధతకు ప్రత్యామ్నాయం కాలేదు.

భారత రాజ్యాంగంలోని 324వ అధికరణ ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల తయారీపై పర్యవేక్షణాధికారాన్ని ఎన్నికల సంఘానికి అప్పగించింది. ఈ అధికారం ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేయడానికి కాదు; ప్రజల స్వేచ్ఛాయుత తీర్పును కాపాడటానికి. అందుకే ఎన్నికల సంఘం స్వతంత్రత అంటే ప్రభుత్వ జోక్యం లేకపోవడమే కాదు. రాజకీయ పక్షపాతానికి తావులేని నిర్ణయాలు తీసుకోవడం, తన చర్యలకు తగిన వివరణ ఇవ్వడం, చట్టపరమైన అభ్యంతరాలను గౌరవించడం కూడా అందులో భాగమే. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించే ప్రక్రియకు రాజ్యాంగం అత్యంత కఠినమైన రక్షణ కల్పించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానానికి సమానమైన ప్రక్రియ, కారణాలు అవసరమని 324వ అధికరణ నిర్దేశిస్తుంది. అందువల్ల రాజకీయ నిరసన ఎంత బలంగా ఉన్నా, పదవి నుంచి తొలగింపు చట్టబద్ధమైన రాజ్యాంగ ప్రక్రియ ద్వారానే జరగాలి. అదే సమయంలో, ఈ రక్షణను బాధ్యతల నుంచి మినహాయింపుగా భావించరాదు.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు పాత్ర అత్యంత కీలకం. ఎస్ఐఆర్ ప్రక్రియపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తూ, ఎన్నికల సంఘం నిర్ణయాలకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి పేర్కొనడం ప్రాధాన్యం కలిగిన పరిణామం. అయితే కోర్టులో విచారణ ప్రారంభమైందని ఆరోపణలు నిరూపితమైనట్లు కాదు; ఎన్నికల సంఘం వాటిని ఖండించిందని వివాదం ముగిసినట్లూ కాదు. న్యాయస్థానం ముందు ఆధారాలు, చట్టాలు, విధానపరమైన లోపాలు పరిశీలనకు రావాలి. అవసరమైతే బాధిత ఓటర్లకు న్యాయం జరిగేలా మార్గదర్శకాలు రూపొందించాలి. న్యాయపరిశీలన రాజకీయ పోరాటానికి ప్రత్యామ్నాయం కాదు; రాజ్యాంగ పరిమితుల్లో వాస్తవాలను నిర్ధారించే ప్రక్రియ.

ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు అవసరం. ఓటర్ల పేర్ల తొలగింపునకు స్పష్టమైన కారణాలు తెలియజేయాలి. అభ్యంతరాలు దాఖలు చేసేందుకు తగిన సమయం, సులభమైన అప్పీల్ విధానం కల్పించాలి. పేదలు, వలస కార్మికులు, నిరాశ్రయులు, వృద్ధులు, అక్షరాస్యత తక్కువగా ఉన్నవారు పత్రాల సమస్యల వల్ల ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక సహాయం అందించాలి. ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తినప్పుడు వాటిని చట్టబద్ధంగా నమోదు చేసి, నిర్ణయ ప్రక్రియలో పారదర్శకతను పెంచాలి. ఎన్నికల సంఘం డిజిటల్ వ్యవస్థలపై స్వతంత్ర సాంకేతిక పరిశీలనకు అవకాశం కల్పించాలి. ఓటర్ల జాబితాల సవరణలో ఎన్ని పేర్లు తొలగించబడ్డాయి, ఎన్ని అభ్యంతరాలు వచ్చాయి, ఎన్ని పరిష్కరించబడ్డాయి అనే గణాంకాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం అధికార పార్టీకీ, ప్రతిపక్షాలకీ చెందదు. అది రాజ్యాంగానికి, ఓటరుకూ జవాబుదారీగా ఉండాలి. ప్రతిపక్షాల ఆరోపణలు నిజమైతే వాటిని సరిదిద్దాలి; నిరాధారమైతే ఆధారాలతో ఖండించాలి. అదే విధంగా, ఎన్నికల సంఘంపై విమర్శలు చేసే రాజకీయ పక్షాలు కూడా తమ వాదనలను నిర్ధారిత ఆధారాలతోనే ప్రజల ముందుంచాలి. సంస్థలపై గుడ్డి విశ్వాసమూ, గుడ్డి అనుమానమూ ప్రజాస్వామ్యానికి మేలు చేయవు. పారదర్శకత, జవాబుదారీతనం, స్వతంత్ర విచారణలే విశ్వాసానికి పునాదులు.

ఎన్నికల్లో గెలుపు ఒక పార్టీకి అధికారం ఇవ్వవచ్చు; కానీ ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత మాత్రం ప్రతి రాజ్యాంగ సంస్థపైనా ఉంటుంది. ఓటరు పేరు జాబితాలో ఉండటం ఒక పరిపాలనా అంశం మాత్రమే కాదు-అది పౌరుడి గొంతుకు రాజ్యాంగం ఇచ్చిన గుర్తింపు. ఆ గొంతు వినిపించే హక్కును కాపాడటంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ, పక్షపాతానికీ, రాజకీయ జోక్యానికీ స్థానం ఉండకూడదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ప్రకృతి విధ్వంసానికి మూల్యం చెల్లిస్తున్న సామాన్య ప్రజలు

ఆధునిక నాగరికతకు పర్యావరణ పరిరక్షణే నిజమైన పరీక్ష!ప్రకృతి మానవాళికి ప్రసాదించిన అపురూపమైన వరం. స్వచ్ఛమైన గాలి, నిర్మలమైన నీరు, సారవంతమైన భూమి, పచ్చని చెట్లు, జీవవైవిధ్యం, అనుకూలమైన వాతావరణం మానవ మనుగడకు ప్రాథమిక ఆధారాలు. ప్రకృతి సమతుల్యతలో ఉన్నంతకాలం మానవ జీవనం సజావుగా సాగుతుంది. అయితే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కొద్దీ ప్రకృతికి జరుగుతున్న నష్టం కూడా అంతకంతకూ పెరుగుతోంది. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వాహనాల కాలుష్యం, అడవుల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, రసాయనాల అధిక వినియోగం, సహజ వనరుల విచక్షణారహిత దోపిడీ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. విలాసవంతమైన జీవితం కోసం కొందరు అనుసరిస్తున్న వినియోగ సంస్కృతి వల్ల కలిగే దుష్పరిణామాలను మాత్రం ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు, రైతులు, కార్మికులు, పేద కుటుంబాలు ఎక్కువగా అనుభవించాల్సి వస్తోంది. ప్రకృతిని నాశనం చేస్తున్నది ఒక వర్గం అయితే, ఆ విధ్వంసం వల్ల కలిగే అనారోగ్యాన్ని భరిస్తున్నది మరో వర్గం కావడం నేటి సమాజంలోని అత్యంత తీవ్రమైన వైరుధ్యం.

ప్రపంచం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా ప్రజలు ఆరోగ్యంగా జీవించలేకపోతే ఆ అభివృద్ధికి అర్థం ఏమిటి? అంతరిక్ష పరిశోధనలు, కృత్రిమ మేధస్సు, అత్యాధునిక వైద్య పరికరాలు, భారీ పరిశ్రమలు, ఎత్తైన భవనాలు, విలాసవంతమైన వాహనాలు మానవ ప్రగతికి సూచికలుగా కనిపిస్తున్నాయి. కానీ అదే సమయంలో స్వచ్ఛమైన గాలి పీల్చుకోలేని పరిస్థితులు ఏర్పడటం, కలుషితమైన నీటిని తాగాల్సి రావడం, ఆహారంలో రసాయన అవశేషాలపై ఆందోళనలు పెరగడం, చిన్న వయసులోనే అనేక దీర్ఘకాలిక వ్యాధులు ఎదురుకావడం మన అభివృద్ధి నమూనాలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. అభివృద్ధి అంటే కేవలం సంపద పెరగడం కాదు. మనిషి ఆరోగ్యంగా జీవించగలగడం, ప్రకృతి వనరులు భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉండటం, పేదరికంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన పరిసరాలు లభించడం కూడా అభివృద్ధిలో భాగమే.

భారతదేశంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న తీరు ప్రజారోగ్య వ్యవస్థకు తీవ్రమైన సవాలుగా మారుతోంది. భారత వైద్య పరిశోధనా మండలి ఆధ్వర్యంలోని జాతీయ క్యాన్సర్ నమోదు కార్యక్రమం అంచనాల ప్రకారం, 2020లో దేశంలో సుమారు 13,92,179 కొత్త క్యాన్సర్ కేసులు నమోదయ్యే అవకాశం ఉండగా, 2021లో ఈ అంచనా 14,26,447కు, 2022లో 14,61,427కు చేరింది. 2023కు సంబంధించిన అంచనా 14,96,972 కేసులు. అంటే 2020తో పోలిస్తే 2023 నాటికి అంచనా వేసిన వార్షిక కొత్త కేసుల సంఖ్య సుమారు 7.5 శాతం పెరిగింది. ఇవి ప్రతి సంవత్సరం కొత్తగా వ్యాధి నిర్ధారణ అయ్యే కేసుల అంచనాలు మాత్రమే; దేశంలో క్యాన్సర్‌తో జీవిస్తున్న మొత్తం ప్రజల సంఖ్య కాదు.

2022లో చేసిన శాస్త్రీయ అంచనాల ప్రకారం, భారతదేశంలో ప్రతి లక్ష మందికి సుమారు 100.4 కొత్త క్యాన్సర్ కేసులు ఉండవచ్చని, 74 ఏళ్ల వయస్సులోపు ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి జీవితకాలంలో ఏదో ఒక రకమైన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. 2020తో పోలిస్తే 2025లో కొత్త క్యాన్సర్ కేసులు 12.8 శాతం పెరగవచ్చని కూడా ఆ అధ్యయనం అంచనా వేసింది. ఈ గణాంకాలు మనకు ఒక హెచ్చరికను ఇస్తున్నాయి. క్యాన్సర్‌కు పొగాకు వినియోగం, మద్యం, ఆహారపు అలవాట్లు, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, వయస్సు, జన్యుపరమైన అంశాలు, కొన్ని వృత్తిపరమైన రసాయనాల ప్రభావం, వాయు కాలుష్యం వంటి అనేక కారణాలు సంబంధం కలిగి ఉంటాయి. అన్ని క్యాన్సర్ కేసులకూ పర్యావరణ కాలుష్యమే కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైనది కాదు. అయితే కాలుష్యకారక పదార్థాలకు గురికావడాన్ని తగ్గించడం ద్వారా కొన్ని రకాల క్యాన్సర్లతో సహా అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చని ప్రజారోగ్య పరిశోధనలు సూచిస్తున్నాయి. అందువల్ల క్యాన్సర్ గణాంకాలను కేవలం ఆసుపత్రుల సమస్యగా కాకుండా పర్యావరణం, జీవనశైలి, పారిశ్రామిక విధానాలు, ఆహార భద్రత, ప్రజారోగ్య వ్యవస్థలతో ముడిపడిన విస్తృత సమస్యగా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రకృతి విధ్వంసం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని అర్థం చేసుకోవాలంటే వాయు కాలుష్యానికి సంబంధించిన గణాంకాలను పరిశీలించాలి. గాలిలో కనిపించని సూక్ష్మ ధూళికణాలు, పరిశ్రమల నుంచి వెలువడే విషవాయువులు, వాహనాల పొగ, బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి, చెత్త దహనం, నిర్మాణ రంగం నుంచి వెలువడే ధూళి ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. ముఖ్యంగా పీఎం 2.5గా పిలిచే అతి సూక్ష్మ ధూళికణాలు ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి రక్తప్రవాహాన్ని ప్రభావితం చేయగలవు. వీటి దీర్ఘకాలిక ప్రభావం గుండెజబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యలతో సంబంధం కలిగి ఉంటుంది.

హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ రూపొందించిన స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ 2024 నివేదిక ప్రకారం, 2021లో ప్రపంచవ్యాప్తంగా వాయు కాలుష్యానికి సంబంధించి సుమారు 81 లక్షల మరణాలు



సంభవించాయి. వీటిలో భారతదేశంలో సుమారు 21 లక్షల మరణాలు వాయు కాలుష్య ప్రభావంతో ముడిపడి ఉన్నాయని అంచనా వేశారు. ఈ సంఖ్యలు కాలుష్యమే ప్రతి వ్యక్తి మరణానికి ఏకైక కారణమని నిర్ధారించవు. వైద్య, గణాంక నమూనాల ఆధారంగా కాలుష్యానికి ఆపాదించిన మరణాల అంచనాలు ఇవి. అయినప్పటికీ సమస్య తీవ్రతను తెలియజేయడానికి ఈ గణాంకాలు సరిపోతాయి.

భారతదేశంలో 2019లో వాయు కాలుష్యానికి సంబంధించి సుమారు 16.7 లక్షల మరణాలు సంభవించినట్లు గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం అంచనా వేసింది. ఇది అప్పటి దేశంలోని మొత్తం మరణాల్లో సుమారు 17.8 శాతానికి సమానం. 2019, 2021 సంవత్సరాలకు సంబంధించిన అధ్యయనాల అంచనాలు వేర్వేరు పద్ధతులు, నమూనాలు, కాలపరిమితుల ఆధారంగా రూపొందించబడ్డాయి. అందువల్ల వాటిని ఒకే విధమైన గణాంకాలుగా నేరుగా పోల్చడం సరికాదు. అయితే వాయు కాలుష్యం భారతదేశంలో ప్రధాన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతున్నదనే విషయాన్ని ఈ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ పరిస్థితిలో అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే, కాలుష్యాన్ని సృష్టించే కార్యకలాపాల నుంచి ప్రయోజనం పొందేవారికి, వాటి వల్ల అనారోగ్యానికి గురయ్యే వారికి మధ్య తీవ్రమైన అసమానత ఉండటం. పారిశ్రామిక ప్రాంతాల సమీపంలో నివసించే పేద కుటుంబాలు, రహదారుల పక్కన పనిచేసే చిరు వ్యాపారులు, నిర్మాణ కార్మికులు, చెత్త సేకరించే కార్మికులు, వ్యవసాయ కూలీలు రోజూ కాలుష్యానికి గురవుతుంటారు. వారికి నాణ్యమైన ఆరోగ్య పరీక్షలు, వైద్య బీమా, ఖరీదైన చికిత్సలు అందుబాటులో ఉండకపోవచ్చు. ధనికులు కాలుష్యం నుంచి తప్పించుకోవడానికి మెరుగైన నివాసాలు, గాలి శుద్ధి పరికరాలు, ప్రైవేటు వైద్యం పొందగలిగితే, పేదలు మాత్రం తమకు లభించిన పరిసరాల్లోనే జీవించాల్సి వస్తోంది. ఈ వ్యత్యాసం పర్యావరణ సమస్యను సామాజిక న్యాయ సమస్యగా మారుస్తోంది.

ఆధునిక సమాజంలో అభివృద్ధికి వినియోగమే కొలమానంగా మారుతున్నది. అవసరానికి మించిన వాహనాలు, భారీ ఇళ్లు, అధిక విద్యుత్ వినియోగం, తరచూ వస్తువులను మార్చడం, ఒక్కసారి ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తులు, అనవసరమైన వస్తు కొనుగోళ్లు జీవనశైలిలో భాగమవుతున్నాయి. ప్రతి వ్యక్తి సౌకర్యంగా జీవించడంలో తప్పు లేదు. కానీ తన సౌకర్యం కోసం ప్రకృతికి కలిగే నష్టాన్ని పట్టించుకోకపోవడమే అసలు సమస్య. ఒకరి విలాసం మరొకరి అనారోగ్యానికి కారణమైతే ఆ జీవన విధానాన్ని సమాజం ప్రశ్నించాలి.

అధిక వాహన వినియోగం వల్ల ఇంధన దహనం పెరుగుతుంది. బొగ్గు, చమురు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాలపై ఆధారపడిన ఉత్పత్తి వ్యవస్థలు వాతావరణంలోకి హరితగృహ వాయువులను విడుదల చేస్తాయి. పరిశ్రమలు, రవాణా, విద్యుత్ ఉత్పత్తి, భవన నిర్మాణం, వస్తు తయారీ వంటి రంగాలు పర్యావరణంపై ఒత్తిడిని పెంచుతాయి. దీనికి పరిష్కారం అభివృద్ధిని పూర్తిగా నిలిపివేయడం కాదు. తక్కువ కాలుష్యంతో ఉత్పత్తి చేయడం, పునరుత్పాదక ఇంధనాలను ప్రోత్సహించడం, ప్రజా రవాణాను విస్తరించడం, వనరులను సమర్థంగా వినియోగించడం, పర్యావరణానికి హాని కలిగించే విధానాలను మార్చడం.

ప్రకృతి వనరులు అంతులేనివి కావు. భూమి నుంచి నీటిని నిరంతరం తోడేస్తూ, చెరువులను ఆక్రమిస్తూ, అడవులను నరికివేస్తూ, పర్వతాలను తవ్వుతూ, నదుల్లో వ్యర్థాలను కలుపుతూ అభివృద్ధి సాధించామని చెప్పుకోవడం తాత్కాలిక సంతృప్తి మాత్రమే. ప్రకృతిపై మానవ ఒత్తిడి పెరిగినప్పుడు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత దెబ్బతింటుంది. జీవవైవిధ్యం తగ్గుతుంది. నేల నాణ్యత క్షీణిస్తుంది. నీటి వనరులు కలుషితమవుతాయి. వాతావరణ మార్పుల ప్రభావం మరింత తీవ్రమవుతుంది. ఈ పరిణామాలన్నీ ఆరోగ్యాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేయగలవు.

నీరు జీవనానికి ఆధారం. అయితే పరిశ్రమల నుంచి శుద్ధి చేయకుండా విడుదల చేసే వ్యర్థాలు, మురుగునీరు, వ్యవసాయంలో అధికంగా వినియోగించే ఎరువులు, పురుగు మందులు, ఘన వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం నీటి వనరులను కలుషితం చేసే ప్రమాదాన్ని పెంచుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం బోరుబావులపై ఆధారపడుతున్నారు. భూగర్భజలాల్లో సహజంగా ఉండే కొన్ని హానికర మూలకాలు లేదా మానవ కార్యకలాపాల ద్వారా చేరే కలుషితాలు ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి.

కలుషిత నీరు, అపరిశుభ్రమైన పారిశుద్ధ్యం వల్ల విరేచనాలు, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు వ్యాపించవచ్చు. కొన్ని రసాయనాల దీర్ఘకాలిక ప్రభావం మూత్రపిండాలు, కాలేయం, నాడీవ్యవస్థ తదితర అవయవాల పనితీరును ప్రభావితం చేయవచ్చు. అయితే ఏ ప్రాంతంలో ఏ వ్యాధి ఎంతమందికి వస్తున్నదో నిర్ధారించడానికి నీటి నమూనాల పరీక్షలు, వైద్య రికార్డులు, శాస్త్రీయ పరిశోధనలు అవసరం. ప్రతి అనారోగ్యాన్నీ ఒక నిర్దిష్ట రసాయనానికి ఆపాదించడం సరైన పద్ధతి కాదు.

వ్యవసాయ రంగంలో కూడా సమతుల్యత అవసరం. పంటల దిగుబడి పెంచడానికి ఎరువులు, పురుగుమందులు ఉపయోగించడం కొన్నిసార్లు అవసరమే. కానీ సూచించిన పరిమితులను మించి వాడటం, రక్షణ పద్ధతులు పాటించకపోవడం, పంట కోతకు ముందు నిర్దేశిత విరామాన్ని పాటించకపోవడం, ఖాళీ పురుగుమందుల డబ్బాలను నిర్లక్ష్యంగా పారవేయడం వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు, పర్యావరణం ప్రమాదంలో పడవచ్చు. రైతుకు శాస్త్రీయ అవగాహన, సురక్షిత పరికరాలు, ప్రత్యామ్నాయ పద్ధతులు, నాణ్యమైన సలహాలు అందుబాటులో ఉండాలి. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను రైతులపై మాత్రమే మోపకుండా, రసాయనాల తయారీ సంస్థలు, సరఫరా వ్యవస్థలు, ప్రభుత్వ నియంత్రణ సంస్థలు కూడా సమాన బాధ్యత వహించాలి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యంపై అనేక విధాలుగా ప్రభావం చూపుతున్నాయి. తీవ్రమైన వేడిగాలులు వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, బయట పనిచేసే కార్మికులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు శరీరంలో నీరు తగ్గడం, వడదెబ్బ, గుండె సంబంధిత సమస్యలు, మూత్రపిండాలపై ఒత్తిడి పెరగడం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా బయట పనిచేసే కార్మికుల పనిసామర్థ్యం తగ్గుతుంది. రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలకు ఆదాయం తగ్గడంతో పాటు వైద్య ఖర్చులు పెరిగే ప్రమాదం ఉంది.

అతివృష్టి, వరదలు, తుపానులు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాలు కూడా ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తాయి. వరదల అనంతరం తాగునీటి కలుషితం, దోమల వ్యాప్తి, పారిశుద్ధ్య సమస్యలు పెరగవచ్చు. కరువు వ్యవసాయ దిగుబడులను తగ్గించి రైతుల ఆదాయాన్ని దెబ్బతీయవచ్చు. పంట నష్టాలు, అప్పుల భారం, ఉపాధి కోల్పోవడం కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మరింత బలహీనపరుస్తాయి. వాతావరణ మార్పులన్నింటినీ ఒకే కారణంతో వివరించలేము. అయితే మానవ చర్యల వల్ల పెరుగుతున్న హరితగృహ వాయు ఉద్గారాలు ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలకు ప్రధాన కారణమని శాస్త్రీయ ఆధారాలు సూచిస్తున్నాయి.

పర్యావరణ సంక్షోభం అందరినీ ప్రభావితం చేసినప్పటికీ, దాని నుంచి రక్షణ పొందే సామర్థ్యం అందరికీ సమానంగా ఉండదు. ఎయిర్ కండిషనర్ ఉన్న ఇంట్లో ఉండగలిగేవారికి, ఎండలో పనిచేయాల్సిన కార్మికుడికి మధ్య వ్యత్యాసం ఉంది. స్వచ్ఛమైన నీటిని కొనుగోలు చేయగలిగేవారికి, కలుషిత నీటిని తప్పనిసరిగా వినియోగించాల్సిన కుటుంబానికి మధ్య వ్యత్యాసం ఉంది. ఖరీదైన ఆసుపత్రుల్లో చికిత్స పొందగలిగేవారికి, ప్రభుత్వ ఆసుపత్రుల కోసం ఎదురుచూసే పేదలకు మధ్య వ్యత్యాసం ఉంది. అందుకే పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం చెట్లు నాటే కార్యక్రమం కాదు; సమానమైన ఆరోగ్య హక్కును కాపాడే సామాజిక బాధ్యత కూడా. క్యాన్సర్‌తో పాటు గుండెజబ్బులు, మధుమేహం, పక్షవాతం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి అసంక్రమిత వ్యాధులు భారతదేశంలో ప్రధాన ఆరోగ్య సమస్యలుగా కొనసాగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, 2023లో భారతదేశంలోని మొత్తం మరణాల్లో సుమారు 71.1 శాతం అసంక్రమిత వ్యాధులకు సంబంధించినవిగా అంచనా వేయబడ్డాయి. ఈ విభాగంలో క్యాన్సర్‌తో పాటు గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు తదితర అనేక సమస్యలు ఉంటాయి. కాబట్టి ఈ 71.1 శాతాన్ని క్యాన్సర్ మరణాల శాతంగా భావించకూడదు.

ఈ వ్యాధులన్నింటికీ పర్యావరణ కాలుష్యమే కారణమని చెప్పలేం. వయస్సు, వంశపారంపర్యత, పొగాకు వినియోగం, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, మద్యపానం, ఆరోగ్య సేవలకు అందుబాటు వంటి అంశాలు కూడా ప్రభావితం చేస్తాయి. అయితే వాయు కాలుష్యం గుండెజబ్బులు, పక్షవాతం, శ్వాసకోశ వ్యాధులు, కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచగలదు. అందువల్ల వ్యాధుల నియంత్రణలో వ్యక్తిగత జీవనశైలి మార్పులతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యాధి వచ్చిన తరువాత చికిత్స అందించడం ఎంత ముఖ్యమో, వ్యాధి వచ్చే ప్రమాదాన్ని ముందుగానే తగ్గించడం అంతకంటే ముఖ్యమైనది.

మిగితా తరువాయి సంచికలో..



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



## కారు చీకట్లు కమ్మిన వేళ

అలల సవ్వడి మా జోలపాట,
కానీ...అదే సాగరం ఒక్కోసారి,
మృత్యువుతో ఆడే ఉప్పెనలా మారుతుంది!
తీరాన్ని ముంచెత్తే తుఫానులు
బతుకు నావను ముక్కలు చేస్తుంది.
కుదురులేని ఈదురు గాలుల
జడివాన సుడులుగా తిరిగి
అలలై ఎగిసి పడుతుంది
కారుచీకట్లు కమ్మిన వేళ
కడలి గర్భం నుండి భయం ముంచుకొస్తుంది.
సముద్రతీర జీవనం
ఉప్పెనతో సవాసం చేస్తూ
బతుకులు తెరచాప లేని నావై
తిమిరం చుట్టూ తిరుగాడుతాయి
రాకాసి అలలు ఊరు మీద పడి
యే ఏటికాయేడు
కరువులో ముంచి
కలలను కల్లోలం చేస్తాయి
వందల ఏళ్ళనాటి
పాత గురుతుల జ్ఞాపకాల చెట్టు
నిట్ట నిలుపునా కూలి
మ్రాన్పడిపోతుంది
విరిగిన విద్యుత్ స్తంభాలు
కారుచికటిని పరిచయం చేస్తాయి
వాయుగుండం వణికించిన వేళ
వరి చేలన్నీ జల సమాధిలో
విశ్రాంతి తీసుకుంటాయి
రైతుల కన్నీళ్లు వాన నీటిలో తడిసి
కష్టజీవులకు ఊపిరి సలపనివ్వదు
ఆటూ పోటూల నడుమ
వేట నిషిద్ధమై పల్లీల బ్రతుకు భారమవుతుంది
ఆకాశవాణి మత్స్యకారుల జాడకై
నిరంతర స్రవంతిఅవుతుంది
తుఫాన్ల హెచ్చరికలు జారీ చేసిన ప్రభుత్వాలు
తీర ప్రాంత ప్రజలను సురక్షిత
ప్రాంతాలకు తరలిస్తూనే ఉన్నారు
సామాజిక కార్యకర్తలు ఉద్యోగులు, రెస్క్యూ
టీమ్లు  నిరంతరం పర్యవేక్షణలో మానవత్వం
చాటుతున్నారు
తుఫాను తీరం దాటినా
సముద్రతీర జీవనం
కరువులో ముంచినా
జీవన పోరాటం ఆగదు!
నిరంతరం... సాగరతీరాన
ఈ మథనం తప్పదు!

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

## టీబీ నిర్మూలనకు శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి

- అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి




**హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ లక్ష్య సాధనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జి. జితేందర్ రెడ్డి సూచించారు. క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచడంతోపాటు వ్యాధి లక్షణాలున్న వారిని ముందుగానే గుర్తించి, సకాలంలో పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్) – టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా సూచనల మేరకు అదనపు కలెక్టర్ జి. జితేందర్ రెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. టీబీ నిర్మూలనలో భాగంగా మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లతో జోష్ బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంపై చర్చించారు. టీబీపై ఉన్న అపోహలు, వివక్షను తొలగించి, బాధితులు సకాలంలో చికిత్స పొందేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. టీబీ అనుమానితులను సమీప ఆరోగ్య కేంద్రాలకు పంపించడం, చికిత్స మధ్యలో ఆపకుండా కొనసాగించేలా సహకరించడం, నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా రోగులకు అవసరమైన సహాయం అందించడంపై దృష్టి సారించారు. ప్రభుత్వ శాఖలు, వైద్య కళాశాలలు, విద్యాసంస్థలు, యువజన సంస్థలు, సమాజ ప్రతినిధులు సమష్టిగా పనిచేస్తే టీబీ నిర్మూలన లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం, పర్యవేక్షణ కీలకమని వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ జి.యాదగిరి, వివిధ వైద్య కళాశాలల ప్రతినిధులు, మై భారత్, ఎన్‌సీసీ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, ఎన్‌టీఈపీ సిబ్బంది, ప్రోగ్రామ్ అధికారులు, సీనియర్ ప్రజారోగ్య అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# రైస్‌మిల్లు వద్దని రోడ్డెక్కిన పోచారం ప్రజలు

- పంచాయతీ పాలకవర్గం మద్దతు
- కాలుష్య కోరల్లో పోచారం, ఉప్పరిగూడ
- రైస్ మిల్లులు, ప్లైవుడ్ కంపెనీలను తరలించాలి
- పెట్రోల్ బాటిల్‌తో యువకుడి హల్చల్
- అడ్డుకున్న సర్పంచ్, పోలీసులు

**రంగారెడ్డి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** నాడు పచ్చని పొలాలతో, స్వచ్ఛమైన గాలితో కళకళలాడిన ఆ గ్రామాలు నేడు కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. పీల్చే గాలిలో విషం, తాగే నీటిలో రసాయనాలు చేరి ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. పరిశ్రమల నుంచి వస్తున్న దుమ్ము, పొగ, రసాయన వ్యర్థాల వల్ల ఊపిరి ఆడక జనం అల్లాడిపోతుంటే.. అధికారుల పట్టింపులేనితనం, పాలకుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. "మా ప్రాణాలు పోయాకే స్పందిస్తారా? మా చావులను చూడటానికే ఉన్నారా?" అంటూ పోచారం, ఉప్పరిగూడ గ్రామాల ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

### సంవత్సరాలుగా పోరాటం..

పోచారం, ఉప్పరిగూడ గ్రామాల పరిధిలో కాలుష్యం సమస్య నిన్న మొన్నటిది కాదు. గత కొన్ని సంవత్సరాల నుండి ఈ ప్రాంత ప్రజలు కాలుష్యానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. దఫాలవారీగా నిరసనలు తెలపడం, ధర్నాలు నిర్వహించడం, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం చేస్తూనే ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు తమ గోడును ఎన్నిసార్లు వెళ్లబోసుకున్నా, వారి వద్ద నుంచి వచ్చిన అర్థనాదాలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. సమస్య పరిష్కారంలో మాత్రం పురోగతి శూన్యమని గ్రామస్తులు వాపోతున్నారు.

6 రైస్ మిల్లులు, 6 ప్లైవుడ్ కంపెనీలు..

పోచారం, ఉప్పరిగూడ గ్రామాల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా 6 రైస్ మిల్లులు, 6 ప్లైవుడ్ కంపెనీలు ఏర్పాటు చేశారు. వీటి నుంచి ప్రతినిత్యం వెలువడే విపరీతమైన పొగ, పొట్టు, రంపపు పొడి, కెమికల్ దుమ్ము గ్రామాలపై కప్పుకుంటోంది. నిమిషం పాటు బయట నిలబడలేని పరిస్థితి నెలకొంది.

### విషం చిమ్ముతున్న పరిశ్రమలు...

పొల్యూషన్ తీవ్రమవ్వడంతో ఇళ్లలోని పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు ఊపిరితిత్తుల వ్యాధులు, ఆస్తమా, శ్వాసకోశ సమస్యలు, తీవ్రమైన చర్మ రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లోని ఇళ్లు, చెట్లు, తాగునీటి వనరులు అన్నీ నల్లటి బూడిద, దుమ్ముతో నిండిపోతున్నాయి.

### పోచారం వద్ద ఉద్రిక్తత..

పంచాయతీ పాలకవర్గంతో కలిసి ప్రజలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. మిల్లులు, కంపెనీల వల్ల తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని, వీటిని తక్షణమే ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ పోచారం గ్రామస్తులు నిరసన బాట పట్టారు. ఊరి రక్షణ కోసం పంచాయతీ పాలకవర్గం కూడా ప్రజలతో జతకట్టింది. గ్రామ సర్పంచ్ వెంకటేష్, ఉప్పసర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు, గ్రామస్తులు అందరూ కలిసి రైస్ మిల్లుల ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి భారీ రాస్తారోకో



నిర్వహించారు. మిల్లులకు వ్యతిరేకంగా, అధికారుల అలసత్వానికి నిరసనగా నినాదాలతో హోరెత్తించారు. ధర్నా వార్త తెలియగానే పోలీసులు భారీగా మోహరించారు. రాస్తారోకోను విరమింపజేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో గ్రామస్తులకు, పోలీసులకు మధ్య చర్చలు జరిపిన ఫలితం లేకుండా పోయింది.

### పెట్రోలు బాటిల్‌తో హల్చల్..

ఈ సందర్భంగా ఓ యువకుడు పెట్రోల్ బాటిల్ తో హల్చల్ చేశాడు. దాంతో స్థానిక సర్పంచ్ వెంకటేశ్, పోలీసులు అప్రమత్తమయ్యారు. పెట్రోలు బాటిల్ లాగేసుకున్నారు. సుమారు నాలుగు గంటల ఆందోళన అనంతరం స్థానిక తహసిల్దార్ సునీత రెడ్డి ఆందోళన వద్దకు చేరుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# తాండూరు కందులకు అంతర్జాతీయ గుర్తింపు

- ఆస్ట్రేలియాకు తొలి ఎగుమతి

**తాండూరు, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన తాండూరు కందులు తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి ప్రాధికార సంస్థ (అపెడా) సహకారంతో ఈ ఎగుమతి సాధ్యమైంది. తొలి సరుకును బుధవారం హైదరాబాద్ నుంచి హైబ్రిడ్ విధానంలో జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ, సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి సురేంద్ర మోహన్ (ఐఏఎస్), హైదరాబాద్ అపెడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పి. నాయుడు వర్చువల్ విధానంలో సరుకును ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రాంతీయ అథారిటీ అదనపు విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంపత్ కుమార్ (ఐటీఎస్), హైదరాబాద్‌కు చెందిన ఎం/ఎస్ దుర్గా ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ ప్రతినిధి, ఎగుమతిదారు శ్రీ సుమంత్ ఆర్., ఇతర అపెడా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సరుకులో 2.5 మెట్రిక్ టన్నుల జీఐ ట్యాగ్ తాండూరు కందులు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎం/ఎస్ దుర్గా ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ సంస్థ 'అమ్మాస్' బ్రాండ్ పేరుతో వీటిని ఎగుమతి చేస్తోంది. సముద్ర మార్గంలో రవాణా అయ్యే ఈ సరుకును ఆస్ట్రేలియాలోని



ఎం/ఎస్ భారతమ్మ పీటీవై లిమిటెడ్ సంస్థ దిగుమతి చేసుకుంటుంది. అపెడాలో నమోదైన ఈ సంస్థ తెలంగాణ నుంచి బియ్యం, పప్పుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కిరాణా సరుకులను ఎగుమతి చేస్తోంది. తెలంగాణకే ప్రత్యేకమైన వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రోత్సహించడంలో ఈ ఎగుమతి ఒక ముఖ్యమైన ముందడుగని అధికారులు పేర్కొన్నారు.

### తెలంగాణ గర్వకారణం తాండూరు కందులు

తెలంగాణ నుంచి జీఐ గుర్తింపు పొందిన మొట్టమొదటి వ్యవసాయ ఉత్పత్తి తాండూరు కందులే. తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, యాలాల మండలాల్లోని వర్షాధార భూముల్లో ప్రధానంగా ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని సారవంతమైన లోతైన నల్లరేగడి నేలలు, అటాపుల్జైట్ బంకమట్టి ఖనిజ నిక్షేపాలు, విస్తారమైన సున్నపురాయి నిక్షేపాల వల్లే తాండూరు కందులకు ప్రత్యేక లక్షణాలు వచ్చాయి. తాండూరు కందుల్లో 22 నుంచి 24 శాతం మాంసకృత్తులు (ప్రోటీన్) ఉంటాయి. ఇది ధాన్యాల్లోని ప్రోటీన్ కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. రుచి, వంటకు అనుకూలత, ఎక్కువ కాలం నిల్వ ఉండే గుణం వీటి ప్రత్యేకత. జీఐ గుర్తింపు వల్ల ఈ ఉత్పత్తికి మరింత ప్రాచుర్యం, మార్కెట్‌లో గుర్తింపు లభించడంతో పాటు దేశ, విదేశీ మార్కెట్లలో అధిక విలువ పొందే అవకాశం ఉంటుంది. ఆస్ట్రేలియాకు జరుగుతున్న ఈ ఎగుమతి, ఈ విశిష్ట వ్యవసాయ ఉత్పత్తికి కొత్త విదేశీ మార్కెట్లను అన్వేషించే దిశగా కీలక అడుగు. దీని ద్వారా రైతులకు, ఉత్పత్తిదారులకు, ఎగుమతిదారులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి.

### జీఐ ఉత్పత్తుల ప్రోత్సాహానికి అపెడా చేయూత

దేశంలోని జీఐ గుర్తింపు పొందిన వ్యవసాయ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లో ప్రోత్సహించేందుకు అపెడా నిరంతరం కృషి చేస్తోంది. ఎగుమతి అనుసంధానాలు కల్పించడం, వాణిజ్య ప్రదర్శనల్లో ఎగుమతిదారులు పాల్గొనేలా ప్రోత్సహించడం, ఎగుమతి అవకాశాలు, మార్కెట్ ప్రవేశంపై మార్గదర్శనం చేయడం ద్వారా ఈ ఉత్పత్తులకు చేయూతనిస్తోంది.

## ఒక్క ఓటు కూడా మిస్ కావద్దు

- పట్టభద్రుల నమోదుపై ఎమ్మెల్యే ఫోకస్
- ప్రజాస్వామ్యంలో గ్రాడ్యుయేట్ల భాగస్వామ్యం పెరగాలి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** త్వరలో జరగనున్న ఉమ్మడి మహబూబ్ నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి బుధవారం క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పరిధిలోని పట్టభద్రులకు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలి. గ్రామాలు మరియు పట్టణాల్లో పట్టభద్రులను గుర్తించి, ఓటు నమోదు ప్రక్రియపై చైతన్యం తీసుకురావాలని అన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలని ఎమ్మెల్యే ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

## రూ.54 లక్షల పనులకు శ్రీకారం..

**నాణ్యతలో రాజీపడొద్దు**
**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**



**అల్వాల్, అక్టోబరు 28 (జనంసాక్షి) :** కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మచ్చ బొల్లారం డివిజన్‌లో రూ.54 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రెసిడెన్సీ అవెన్యూలో రూ.16 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. భారతి ఆవాస్ అపార్ట్‌మెంట్ వాసులు డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భూపతిరావు నగర్‌లో రూ.16 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు, వజ్ర ఎన్‌క్లేవ్‌లో రూ.22 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, అల్వాల్ సర్కిల్ ఏఈ రవళి, సూపర్‌వైజర్ కృష్ణ, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్‌బాబు, శ్రీధర్‌గౌడ్, సురేష్, నర్సింగ్‌రావు, సతీష్, భాస్కర్, కాలనీవాసులు రాజు, పెంటయ్య, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- సోషల్ జస్టిస్ పార్టీ ధర్నాలో నాయకుల డిమాండ్

**హయత్‌నగర్, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సోషల్ జస్టిస్ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దివ్యాంగుల సంక్షేమ డైరెక్టరేట్‌కు పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని కోరారు. బుధవారం సోషల్ జస్టిస్ పార్టీ దివ్యాంగ విభాగం అధ్యక్షుడు ఎం.ఎస్. యాదవ్, అధికార ప్రతినిధి సీహెచ్. వేణుగౌడ్, కార్యదర్శి ధనలక్ష్మి ఆధ్వర్యంలో మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి టీ. చిరంజీవులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీ. చిరంజీవులు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించడం బాధాకరమని అన్నారు. దివ్యాంగులు తమ హక్కులు సాధించే వరకు ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. సంక్షేమ రంగానికి తగిన నిధులు కేటాయించాలని, గవర్నర్ కోటాలో దివ్యాంగులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగుల కోసం కేవలం ఐదు కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దివ్యాంగులు చేపట్టే ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారి హక్కుల సాధన కోసం అండగా నిలుస్తామని తెలిపారు. వికలాంగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని



కోరారు. ధర్నా అనంతరం దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కేవీ గౌడ్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్, కార్యదర్శి ఏర్పుల బాలస్వామి, బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్, దివ్యాంగ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్, దివ్యాంగుల రాజ్యాధికార ఫోరం అధ్యక్షుడు వంశరాజు రామచంద్ర, టీవీహెచ్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్, మహిళా సాధికారత అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, మరుగుజ్జుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్, డాక్టర్ అశోక్, నల్గొండ శ్రీనివాస్, వెంకటరెడ్డి, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- వర్షపాతం లోటుతో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్నాయి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న నెలల్లో నీటి కొరత తలెత్తకుండా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పిలుపునిచ్చారు. జల సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ప్రజలందరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా యంత్రాం గం ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహ న కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఘోడే కీ ఖబర్‌లోని 2బీహెచ్‌కే కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు రియాజ్ ఉల్ హసన్ ఎఫెంది, తెలంగాణ ఫిషరీస్ కార్పొరేష న్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు నుంచి నాలుగు నెలల్లో సాధారణం కంటే సుమారు 30 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. వర్షపాతం లోటుతో భూగ ర్భ జలమట్టాలు తగ్గుతున్నాయని, ఫలితంగా బోరుబావుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో నీటిని జాగ్రత్తగా వినియోగిస్తూ



అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించాలని సూచించారు. తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అనవసరంగా నీటిని వృథా చేయ వద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబం గృహావసరాలకు నీటిని పొదుపుగా వినియోగించడంతోపాటు, నీటి సంరక్షణ ప్రాముఖ్యతను ఇరుగు పొరుగు వారికి వివరించాలని కోరారు. కాలనీలకు నేరుగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా జల సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చేం దుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, కాలనీ ప్రతి నిధులు ప్రజలను చైతన్యపరిచి, అవగాహన కార్యక్రమం ముగిసిన తర్వాత కూడా నీటి పొదుపు చర్యలను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ చర్యలకు ప్రజల సహకారం తోడైతేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. శాసనమండలి సభ్యుడు రియాజ్ ఉల్ హసన్ ఎఫెంది మాట్లాడుతూ నీరు జీవనానికి అత్యంత విలువైన వనరని అన్నారు. ముఖ్యంగా మహిళలు, గృహిణులు నీటిని అవసరాలకు అనుగుణంగా పొదుపుగా వినియోగించాలని కోరారు. కుటుంబ సభ్యులందరిలో నీటి సంరక్షణ అలవాటును పెంపొందించి, దైనందిన జీవితంలో నీటి పొదుపును భాగంగా చేసుకోవాలని సూచిం చారు. తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ, పాత్రలు కడగడం, ఇళ్లను శుభ్రం చేయడం, ఇంటి ప్రాంగ ణాల్లో నీటిని చల్లడం వంటి పనుల్లో అవసరానికి మించి నీటిని వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షపాతం లోటు కారణంగా రానున్న నెలల్లో హైదరాబాద్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. నీటి కొరత ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నీటిని పొదుపు చేయడం ముఖ్య మని స్పష్టం చేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ నివాసితులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాశ్, ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్ నయీముద్దీన్, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ హరీష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు కృషి

- కాప్రాలో రూ 2.5 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు బుధవారం కాప్రా డివిజన్‌లో రూ.2.50 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీలలో రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. సైనిక్ ఎన్‌క్లేవ్ – రూ.27 లక్షల,. భాస్కర్ రావు నగర్ – రూ.50 లక్షలు, సాయిబాబా ఆఫీసర్స్ కాలనీ – రూ.27 లక్షలు, ఆకాశ్ జోసెఫ్ కాలనీ – రూ.46 లక్షలు, సాయిపురి కాలనీ – రూ.50 లక్షలు, ఆర్‌కే ఎన్‌క్లేవ్ – రూ.50 లక్షలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్ , మహేష్, ఇంద్రయ్య, బదురుద్దీన్ అధికారులు కార్యకర్తలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
29 అక్టోబర్ 2026

# పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయ మైనవని నారాయణపేట ఎస్పి వినీత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ బుధవా రం నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు,యువకులు, ఉద్యోగులు, ప్రజలు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పిస్తూ భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరి గింది.జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ ఆర్డీఓ ఆఫీస్,పాత బస్టాండ్, మెయిన్ చౌక్, సుభాష్ రోడ్, సత్యనారా యణ చౌరస్తా, యాద్గిరి రోడ్డు, జిశాన్ హోటల్, అంబేద్కర్ చౌరస్తా, మున్సి పల్ పార్క్ మీదుగా తిరిగి ఎస్పీ కార్యాలయం పరేడ్ మైదానం వరకు కొనసాగిం ది. ర్యాలీ ఆద్యంతం పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుం టూ జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో దేశభక్తి, సేవాభావం,సామాజిక బాధ్యతను పెంపొందించే సందేశాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, సమాజంలో నేరాల నియం త్రణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.విధి నిర్వహణ లో ఎన్నో సవాళ్లను ఎదు ర్కొంటూ,ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్



అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీ యమని పేర్కొన్నారు.ఈ సంవత్సరం దేశంలో 154 ప్రాణాలు త్యాగాలు చేశా రని వారి త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయ కమని, వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యత అని అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మ రణ వారోత్సవాల నిర్వ హణ ప్రధాన ఉద్దేశం అమరవీరుల త్యాగాలను ప్రజలకు గుర్తుచేయడంతో పాటు, వారి సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించడం అని తెలిపారు. విధి నిర్వ హణలో ప్రాణాలు కోల్పో యిన పోలీసుల కుటుంబా ల త్యాగాలను కూడా సమా జం ఎల్లప్పుడూ గుర్తుంచు కోవాలని అన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన అమర వీరుల త్యాగాలకు సమా జం గౌరవం తెలపాలని పేర్కొన్నారు.పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువ కావడానికి, పోలీసుల విధులు, బాధ్యతలపై ప్రజ ల్లో అవగాహన పెంపొందిం చడానికి ఇలాంటి కార్యక్ర మాలు దోహదపడతాయని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖ నిర్వహించే ప్రజా భద్రతా కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్యం గా యువత క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చు కోవాలని సూచించారు.సైకిల్ ర్యాలీలు ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ కాలుష్య నియంత్రణకు కూడాఉపయోగపడతాయని పేర్కొంటూ, ప్రతి ఒక్క రూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహ కరించాలని,నేరాల నియం త్రణలో ప్రజల భాగస్వా మ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు.పోలీస్ అమర వీరుల సంస్మరణ వారో త్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అవగా హన కార్యక్రమాలు, వ్యాస రచన పోటీలు, ఓపెన్ హౌస్, రక్తదాన శిబిరాలు, కొవ్వొత్తుల ర్యాలీల ద్వారా అమరవీరుల త్యాగాలను ప్రజలకు చేరవేస్తూ, పోలీస్–ప్రజల మధ్య సంబంధా లను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, నల్లపు లింగయ్య, సీఐ లు శివ శంకర్ రామ్ లాల్ భగవంత్ రెడ్డి, సైదులు, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు సతీష్ రెడ్డి, విజయ్ కుమార్, చంద్ర శేఖర్, పురుషోత్తం, భాగ్య లక్ష్మీ రెడ్డి, కృష్ణం రాజు, రాజు, నవీద్, మహేందర్ రెడ్డి, గాయత్రి, రేవతి శిరీష, శివ శంకర్ రామ్ లాల్,రమేష్ తది తరులు పాల్గొన్నారు.

## గడువులోగా వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- నవంబర్ 15లోగా ఆధ్యాత్మిక భవనం..
- జనవరి నెలాఖరులోగా అర్చకుల నివాస భవనం పూర్తి చేయాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న అభివృద్ధి, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వనపర్తిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించిన కలెక్టర్ తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న అర్చకుల నివాస భవనం, ఆధ్యాత్మిక భవనం పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక భవనం నిర్మాణ పనులను నవంబర్ 15వ తేదీలోగా, అర్చకుల నివాస భవనం పనులను వచ్చే ఏడాది జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిర్దేశించిన గడువులకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. భక్తులకు, అర్చకులకు ఉపయోగపడేలా భవనాల నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ రఘునాథాచార్యులు, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా బరిలో దిగాలి

- ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి

**హత్నూర, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** పోటీలో పాల్గొనే ప్రతి జట్టు గెలుపే లక్ష్యంగా బరిలో దిగాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు.మండలంలోని దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అండర్ -14,అండర్ -17 బాలికల వాలీబాల్ క్రీడా పోటీలను బుధవారం వారు ప్రారంభించారు.అంతకు ముందు క్రీడా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డికి నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలోని 25 మండలాల నుండి వచ్చిన సుమారు 750 మంది క్రీడాకారిణిలు పాఠశాలల జట్టు వారిగా గౌరవ వందనం చేస్తూ ఫ్లాగ్ మార్చ్ విన్యాసాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి చేతుల మీదుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించి,జ్యోతి ప్రజ్వలన చేశారు.విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, క్లాసికల్ నృత్యాలు ఎంతగానో అలరించాయి. క్రీడాకారిణిలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం కలుగుతుందన్నారు. అదే గాకుండా స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.విద్యార్థులు క్రీడలు,గ్రంథాలయాలపై ఆసక్తి కనబరిస్తే,చెడు వ్యసనాల బారిన పడకుండా రక్షింపబడుతారన్నారు.ప్రతి క్రీడాకారిణి టీమ్ స్పిరిట్ తో ఆడుతూ జట్టును గెలుపు బాటలో నడిపించాలన్నారు.మైదానం చిన్నగా ఉన్నందునా క్రికెట్ ఆడేందుకు



ఇబ్బందిగా ఉన్న దృష్ట్యా బౌండరీ నెట్ ఏర్పాటు చేయించాలని పాఠశాల సిబ్బంది కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు.కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్,మండల విద్యాధికారి,ఉప సర్పంచి శేఖర్,మాజీ ఎంపీపీ నర్సింలు,సర్పంచి శ్రీహరి, నాయకులు ఇబ్రహీం,నరెందర్,శ్రీకాంత్, ఆగమయ్య, అజ్మత్, మధుసూదన్,కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులతో వాలీబాల్–: విద్యార్థులతో వాలీబాల్ ఆడేందుకు ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి కోర్టులో దిగారు. బాల్ ను సర్వీస్ చేయడంతో పాటు పుషింగ్,హ్యాండ్రమ్ ఆడుతూ బాలికలతో పోటీ పడ్డారు. వారు కూడా ఇదివరకు వాలీబాల్ నేషనల్ ఛాంపియన్ కావడంతో వారిలో దాగి ఉన్న క్రీడా సామర్థ్యాన్ని ప్రదర్శించారు. అంతకుముందు శాంతికి శుభ సూచకంగా భావించే కపోతాలను నింగిలోకి ఎగుర వేశారు.

## వాల్మీకి మహర్షి ఆశయాలు సమాజానికి మార్గదర్శకం

- మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్..

**పటాన్చెరు అక్టోబర్ 28 (జనం సాక్షి) :** వాల్మీకి మహర్షి ఆశయాలు, బోధనలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను యువతకు పరిచయం చేస్తూ, వారు చూపిన మార్గంలో నడిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం, చాప్టా (కె) గ్రామంలో బుధవారం నిర్వహించిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి గారితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహావిష్కరణ చేసి, ఆయన ఈ మేరకు ప్రసంగించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి జీవితం, ఆయన రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువల ప్రాధాన్యాన్ని వాల్మీకి మహర్షి జీవితం చాటిచెబుతుందని నీలం మధు అన్నారు. సమాజంలో ఐకమత్యాన్ని పెంపొందిస్తూ, మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే వారి సేవలకు నిజమైన గౌరవం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ద్వారా యువతలో స్ఫూర్తి, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. విగ్రహావిష్కరణలు



కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, మహనీయులు చూపిన మార్గంలో నడిచేందుకు ప్రేరణ కలిగించాలని ఆయన సూచించారు. విద్య, సామాజిక అభివృద్ధి, సమానత్వానికి ప్రాధాన్యమిస్తూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వర అంబికా శివయోగి మహారాజ్, గుండు లక్ష్మణ్ అధ్యక్షులు, గుండు మోహన్ మాజీ జెడ్పీటీసీ, సత్యనారాయణ మాజీ ఎంపీపీ, కౌన్సిలర్ రామకృష్ణ, సర్పంచులు శివరాజ్ పటేల్, కృష్ణ, సాయిలు పటేల్, వెంకటేష్, భూమయ్య, నాయకులు ప్రకాష్ రాథోడ్, వెంకట రాములు, రవి, వెంకన్న, ముచందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వాల్మీకి సంఘం నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

**రేవల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు రేవల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ. సుల్తాన్ అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రేవల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్, యూనియన్ బ్యాంక్, పోలీస్ స్టేషన్, అగ్రికల్చర్ ఆఫీస్, కస్తూరిబా స్కూల్ లను సందర్శించి అక్కడ పని చేస్తున్న పట్టభద్రులకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎండీ. సుల్తాన్ అలీ మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ వాడాల పర్వతాలు, రేవల్లి మండల



కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మిద్దె రాములు అలియాస్ స్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మబ్బు సుధాకర్, రేవల్లి మండల సర్పంచ్ తప్ప రాజయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బాలరెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా నదిలో గల్లంతైన తల్లి బిడ్డల మృతదేహాలు లభ్యం

- ఏడుపాయల వద్ద విషాద ఘటన..
- బంధువుల రోదనలు

**కొల్చారం, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న ఘనపూర్ శివారులోని ఏడుపాయల మొదటి బ్రిడ్జి సమీప మంజీరా నదిలో మంగళవారం గల్లంతైన తల్లి, ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బుధవారం కొల్చారం పోలీసులు వెలికితీశారు. తల్లి, పిల్లలు విగతజీవులుగా కనిపించడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడటం స్థానికులను కలచివేసింది. బంధువుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగోల్ల



సరిత (27)కు వైష్ణవి (7), సాన్విక (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు, పిల్లలను తనకు దూరంగా ఉంచాల్సి వస్తున్న పరిస్థితులతో ఆమె మనస్తాపానికి గురైనట్లు బంధువులు తెలిపారు.

### కేసు నమోదు.. దర్యాప్తు

కొల్చారం పోలీసులు మృతదేహాలను వెలికితీసి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గడువులోగా ఎస్ఐఆర్-2026 పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**జడ్చర్ల, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్--2026)ను నిర్ణీత గడువులోగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఈఆర్ఓ జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్టోబర్ 28 నాటికి 99.74 శాతం నోటీసుల పంపిణీ, 98 శాతం విచారణలు పూర్తయ్యాయని, మిగిలిన కేసులను త్వరగా ముగించాలని సూచించారు. ఏఈఆర్ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న ఫారం--6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించి, ఆమోదించిన, తిరస్కరించిన జాబితాలను నోటీసు బోర్డులపై ప్రదర్శించాలన్నారు. నోటీసుల జారీ, విచారణలు నవంబర్ 5తో ముగియనుండగా, నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ఓటర్లు విచారణలకు హాజరయ్యేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో జడ్చర్ల మండల డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- మంత్రి సీతక్క

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 28 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావం గ్రామీణ ప్రాంతాలపై పడకుండా వీబీ–జీ రామ్ జీ పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారము హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్,సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ఉన్నతాధికారులతో వీబీ --జి రామ్ జి అమలు పై జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు, ఐటీడీఏ పీఓలు,ఎంపీడీవోలు, సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిపై ఎలాంటి ప్రభావం పడకుండా పనులు కల్పించాలని ఆదేశించారు.గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా అండగా నిలుస్తూ, నీటి భద్రతను పెంపొందించేలా వీబీ --జీ రామ్ జీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో వీబీ --జి రామ్ జీ పనుల అమలులో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని,కూలీలను సమీకరించి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా,గ్రామాల్లో మేట్‌లను గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ అందించి పనుల నిర్వహణలో సమర్థవంతంగా భాగస్వాములను చేయాలని తెలిపారు.రాష్ట్రంలో చెరువుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామాల్లోని చెరువులు, కాలువలను గుర్తించి,వాటిలో పూడిక తొలగింపు పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో పశువులకు నీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేసి నిరంతరం నీటి లభ్యత ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాస కొరత తలెత్తకుండా వీబీ --జి రామ్ జి పథకం కింద పశుగ్రాస సాగును ప్రోత్సహిస్తూ,ఎకరాకు రూ.14,000 ఆర్థిక సహాయం అందించే అంశంపై రైతులకు అవగాహన కల్పించి,పశుసంపద సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జలసిరిలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు,ప్రతి ఊరికి ఊట కుంటలు,ప్రతి పంటకు నీటి కుంటలు నిర్మించి వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు,అంగన్వాడీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల పనులను వేగవంతం పూర్తి చేయాలన్నారు. వీబీ–జీ రామ్ జీ పథకం కింద చేపట్టే పనులను స్పష్టమైన ప్రణాళికతో, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామాల్లో వీబీ–జీ రామ్ జీ పథకం కింద ఉత్తమంగా




పనులు చేపట్టి విజయవంతంగా అమలు చేసిన సర్పంచులు, ఎంపీడీవోలు,సంబంధిత అధికారులతో మాట్లాడి,వారి కృషిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణాభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతం చేసి,నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ముషాయిదా బేగం, డీపీఓ శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, పంచాయత్ రాజ్ ఈ.ఈ ప్రభాకర్, మిషన్ భగీరథ ఈ ఈ లు శ్రీధర్ రెడ్డి,పరమేశ్వరి,వివిధ శాఖల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీయే ప్రతి ఒక్కరి బాధ్యత

- అవినీతి రహిత సమాజమే లక్ష్యం
- ఏసీబీ డీఎస్పీ పి. సాంబయ్య
- భూపాలపల్లిలో అవినీతి నిర్మూలనపై అవగాహన



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** నిజాయితీయే ప్రతి ఒక్కరి బాధ్యత అని, అవినీతి రహిత సమాజమే తమ లక్ష్యమని వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ పి. సాంబయ్య అన్నారు. విజిలెన్స్ వారోత్సవం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో అవినీతి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్యనిష్ఠతో సమృద్ధి అనే నినాదంతో అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా వరంగల్ పరిధి ఏసీబీ డీఎస్పీ పి. సాంబయ్య అవగాహన కల్పించారు. అవినీతికి దూరంగా ఉంటూ నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత పాటిస్తామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు విధులను నిజాయితీతో, నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అధికారాలను వ్యక్తిగత ప్రయోజనాలకు వాడరాదని తెలిపారు. అవినీతి వల్ల ప్రజాధనం వృథా కావడమే కాకుండా ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల నమ్మకం దెబ్బతింటుందని వివరించారు. ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మధుసూదన్, ఉప వైద్యాధికారులు దేవేందర్, శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొని వ్యసనాలకు 'నో' చెప్పాలి

- చదువుతో పాటు క్రీడలు, పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి
- పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన జీవితానికి పునాది వేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.




**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 28(జనంసాక్షి) :** విద్యార్థులు సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొని, చెడు వ్యసనాలకు 'నో' అని స్పష్టంగా చెప్పే గుణాన్ని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలు, పౌష్టికాహారంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్రవ్యాప్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ నుండి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వర్చువల్ విధానంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, మత్తుపదార్థాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మత్తురహిత సమాజ నిర్మాణాన్ని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలసి సందేశాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకుని ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల, కళాశాల దశల్లో స్నేహితుల ప్రభావంతో సరదాగా ఒక్కసారి ప్రయత్నిద్దామనే ఆలోచనతో మత్తుపదార్థాలు, ఇతర హానికరమైన వ్యసనాల వైపు వెళ్లవద్దని హితవు పలికారు. ప్రారంభ దశలోనే వాటికి దూరంగా ఉండటం భవిష్యత్తులోనూ వ్యసనరహిత జీవితాన్ని కొనసాగించేందుకు దోహదపడు తుందని తెలిపారు. 'ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమీ కాదు.. మేమూ చేస్తున్నాం.. మాకు ఎలాంటి ఇబ్బంది లేదు' అంటూ స్నేహితులు ఒప్పించే ప్రయత్నం చేసినా ప్రభావితం కావద్దని సూచించారు. తోటి వారిలో కొందరు అలాంటి అలవాట్లకు లోనైనా, వారితో కలవాలనే ఒత్తిడితో వాటిని అనుసరించవద్దని పేర్కొన్నారు. స్నేహం పేరుతో బలవంతం చేసినా తమ నిర్ణయంపై దృఢంగా నిలబడాలని, స్పష్టంగా తిరస్కరిస్తే క్రమంగా ఇతరులు కూడా ఒత్తిడి చేయడం మానుకుంటారని వివరించారు. చెడు వ్యసనాలకు 'నో' చెబుతూ, క్రీడలతో సన్మార్గంలో పయనించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రతిరోజూ క్రీడలు, శారీరక శ్రమకు సమయం కేటాయించాలని సూచించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలని, నడక, పరుగు వంటి వ్యాయామాలను అలవాటు చేసుకోవాలని తెలిపారు. క్రమం తప్పని శారీరక శ్రమ వల్ల శరీరం చురుగ్గా ఉండటంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని, చదువుపై ఏకాగ్రతకు దోహదప డుతుందని పేర్కొన్నారు. మార్కులు, భవిష్యత్తు గురించి అనవ సర ఆందోళనకు గురికాకుండా ప్రతిరోజూ చేయాల్సిన పనులు, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. పౌష్టికాహారం, నిత్య వ్యాయామం, తగిన నిద్రను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ అలవాట్లను పాఠశాల, కళాశాల దశలకే పరిమితం చేయకుండా ఉన్నత విద్య, ఉద్యోగ జీవితంలోనూ నిరంతరం కొనసాగించాలని సూచించారు. శారీరక చురుకుదనం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని, ఆలోచించి, ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిస్తారని, అందుకే వారితో సంభాషించడం తనకు ఇష్టమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తెలియజేసిన అంశాలపై ఆలోచించి, వాటి ప్రయోజనాలను గుర్తించి, మంచి అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, సెక్రటరీ రాజి రెడ్డి, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాలలో విద్యాబోధన తీరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, ప్రయోగశాలల నిర్వహణను పరిశీలించారు. వివిధ తరగతులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాలతో పాటు హెల్త్ కేర్, రిటైల్ ఒకేషనల్ కోర్సుల తరగతులను పరిశీలించారు. అన్ని తరగతుల్లో వంద శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి అని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతులు, ల్యాబ్ సౌకర్యాలను పరిశీలించి ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని, మరమ్మతులు వెంటనే చేయించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రాజేశ్వర రావు, ప్రిన్సిపాల్ తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఆరోగ్యవంతమైన యువతతోనే వికసిత్ భారత్-2047 సాధ్యం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, చదువుపై దృష్టి సారించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పై సందేశం ఇచ్చారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు, వైస్ చైర్మన్ శనబోయిన రాజ్‌కుమార్, సలహా దారులు ఈవీ శ్రీనివాసరావు, కోశాధి కారి బొల్లం శివ, రాష్ట్ర మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు నడెం శాంతికుమార్, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ మండల పరశురాములు, తోట సంపత్ కుమార్, మామిడాల రమేష్ బాబు, డాక్టర్ రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, ముల్క ప్రసాద్, కళాశాల డైరెక్టర్లు సీహెచ్ వాణి, విశ్వాంబర్ రెడ్డి, అధ్యాపకులు, ఎండీ అజం, రియాజ్ తదితరులతో పాటు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, అవగాహన కల్పిస్తూ మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థిని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.



# రేషన్ షాప్ డీలర్ నియామకంపై అభ్యంతరాలు

- నిబంధనలు పాటించకుండా నియామకం చేపట్టారంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు..

**కడెం, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** కడెం మండల కేంద్రంలోని ఎఫ్‌ఎస్‌సీ షాప్ నంబర్ 3504019 డీలర్ నియామకంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. డీలర్ నియామకంలో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ కడెం మండలానికి చెందిన పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం గతంలో సదరు రేషన్ షాపును నిర్వహించిన వ్యక్తిపై రేషన్ సరఫరా వ్యవస్థకు సంబంధించిన అవకతవకల ఆరోపణలు రావడంతో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం నోటిఫికేషన్ ద్వారా కొత్త డీలర్‌ను నియమించినట్లు తెలిపారు. అయితే ఆ తర్వాత డీలర్ మృతి చెందడంతో కొంతకాలం ఆయన భార్య రేషన్ షాపును నిర్వహించారని, అనంతరం ఆమె షాపును వదిలివేయడంతో ప్రస్తుతం ఇన్‌చార్జి డీలర్ ద్వారా రేషన్ సరఫరా జరుగుతోందని ఫిర్యాదుదారులు తెలిపారు. ఇటీవల అదే ఎఫ్‌ఎస్‌సీ షాపునకు కొత్త డీలర్‌ను నియమించినట్లు తెలిసిందని, అయితే డీలర్ నియామకానికి ముందుగా నోటిఫికేషన్ జారీ చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అలా చేయలేదని ఫిర్యాదుదారులు ఆరోపించారు. గతంలో వివాదాలకు గురైన వ్యక్తికి తిరిగి డీలర్‌గా అవకాశం కల్పించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, డీలర్ నియామక ప్రక్రియను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే ప్రస్తుత నియామకాన్ని రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని ఫిర్యాదుదారులు కోరారు. రేషన్ సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు.

# ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

- విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్ జ్యోతి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (జనం సాక్షి) :** కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి హాజరయ్యారు వివిధ క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన జట్లకు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వీరికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేయూ క్రీడా విభాగం కార్యదర్శి డాక్టర్ శాస్త్రి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్ ఎన్ రహమాన్, కళాశాల క్రీడా విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఏ టి బి టి ప్రసాద్, డాక్టర్ సోమన్న, డాక్టర్ జితేందర్, భుఖ్య రాజు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలు ప్రపంచానికి దిక్సూచి వంటివి




**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 28(జనంసాక్షి) :** నూతన ఆవిష్కరణలు ప్రపంచానికి దిక్సూచి వంటివని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ములుగు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె మల్లేశం పేర్కొన్నారు. కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్స్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ బి శిరీష ఆధ్వర్యంలో "నూతన ఆవిష్కరణలపై అవగాహన" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ అధ్యక్షత వహిస్తూ 2017 సంవత్సరంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టిజిఐసి) ఏర్పడినప్పటి నుండి దాని ప్రోత్సాహంతో అనేకమంది యువత మరియు విద్యార్థులు నూతన ఆవిష్కరణలు కనుగొనడమే కాకుండా వాటిని సమాజానికి తోడ్పడే విధంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. కావున విద్యార్థులు తమలో అంతర్గతంగా నిమిడికృతమైన నైపుణ్యాలను వెలికి తీసి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్స్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ బి శిరీష మాట్లాడుతూ విద్యార్థులలో నూతన ఆలోచనలు, సృజనాత్మకత, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. అటువంటి విద్యార్థులకు తమ ఈడిసి సెల్ అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. భారతదేశంలో అత్యున్నత నైపుణ్యము గ్రామీణ భారతంలో ఉన్నట్లు దానిని వెలికి తీయడం మీదనే వ్యక్తి పురోగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగ సాధన తో పాటు భవిష్యత్తులో ఉద్యోగాలను కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా విచ్చేసిన తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సీనియర్ ఇన్నోవేషన్ ఫెల్లో రమేష్ గౌడ్ మాట్లాడుతూ, తమ సంస్థ నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే అవకాశాల గురించి వివరించారు. ఒక వ్యక్తి నూతన ఆవిష్కరణలను కనుగొన్న వెంటనే పేటెంట్ పొందే అవకాశం ఉంటుందని తద్వారా అందులో నూతనత్వాన్ని కూడా ఆపాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. మరొక రిసోర్స్ పర్సన్ ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు నిరంతరం ప్రయత్నించాలని సూచించారు. నూతన ఆవిష్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి, సామాజిక ప్రగతికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి బాలయ్య, సిహెచ్ భాస్కర్, ఎస్ కవిత, కె సరిత, బి శిరీష, డి రాధిక, బి జగదీష్, ఎం అనిల్ కుమార్, పి ఉదయశ్రీ, పి విజేత, జె శంకర్, తేజు లత, తేజోవత్ శ్రీను, అమ్మ రవి, ఎన్ సుమన్, హెచ్ రమేష్, పులి రాంచందర్ ఇతర అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0 ప్రారంభం




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 60 రోజుల పాటు నిర్వహించే టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మధుసూదన్ మంగళవారం ప్రారంభించారు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీలు, హైస్కూళ్లలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించనున్నారు. ఇందులో భాగంగా భూపాలపల్లిలోని మైనారిటీ గురుకుల కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ 60 రోజుల పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలలు, గురుకులాల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. 8 వారాల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రెండు వారాలు ఐఈసీ కార్యక్రమాల ద్వారా దుష్పరిణామాలపై అవగాహన, 3, 4 వారాల్లో విద్యా సంస్థల్లో సైన్ ఏజ్ బోర్డుల ప్రదర్శన, 5, 6 వారాల్లో గ్రామ పంచాయతీల సహకారంతో టొబాకో ఫ్రీ విలేజ్ ఏర్పాటు, 7, 8 వారాల్లో పోలీస్ శాఖ సహకారంతో ఇంటెన్సిఫైడ్ ఎన్ ఫోర్స్ మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగరాణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మురళీధర్ రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# మాదారంలో పోలీసుల పెట్రోలింగ్

- బైక్ దొంగ అరెస్ట్



**తాండూర్, అక్టోబర్ 28(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూర్ మండల పరిధిలోని మాదారం గ్రామంలో పోలీసులు నిర్వహించిన పెట్రోలింగ్‌లో ఓ బైక్ దొంగ పట్టుబడ్డాడు. మాదారం సబ్ ఇన్స్పెక్టర్ సౌజన్య, తెలిపిన వివరాల ప్రకారం మండలంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మాదారం ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో ఏఎస్ఐ రవి మరియు పోలీస్ సిబ్బంది గురువారం మాదారం గ్రామంలో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో గ్రామ పరిధిలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసుల కంటపడ్డాడు. పోలీసులను చూసి సదరు వ్యక్తి తడబడటంతో, సిబ్బంది చాకచక్యంగా అతడిని అదుపులోకి తీసుకుని ఆరా తీశారు. పోలీసులు తమదైన శైలిలో క్షుణ్ణంగా విచారించగా, సదరు వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని (బైక్) దొంగిలించినట్లు నిజం ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని తక్షణమే పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, దొంగతనానికి సంబంధించిన పూర్తి వివరాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సౌజన్య పేర్కొన్నారు. ఈ పెట్రోలింగ్‌లో ఎస్సై సౌజన్య, ఏఎస్ఐ రవి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎంఆర్ ధాన్యం బకాయిలను గడువులోగా చెల్లించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** సిఎంఆర్ ధాన్యం బకాయిలను గడువులోగా చెల్లించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ మానిటరింగ్ అధికారి అజయ్‌బాబు(సి.ఐ.) తో కలసి సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం బకాయిల వసూళ్లు, వేలం వేసిన ధాన్యానికి సంబంధించిన మొత్తాల చెల్లింపులు, ప్రస్తుత సీజన్ల సిఎంఆర్ ధాన్యం అప్పగింతలపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2019-20 సంవత్సరం నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024-25 వరకు పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యానికి చెల్లించవలసిన మొత్తాలను సకాలంలో జమ చేయాలని, ఖరీఫ్ 2025-26, రబీ 2025-26 సీజన్లకు సంబంధించిన సిఎంఆర్ డెలివరీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు, జి.ఓ. ఎం.ఎస్. నం. 17 ప్రకారం నిర్ణీత గడువులోగా పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను పూర్తిగా చెల్లించాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. బకాయిల చెల్లింపులలో జాప్యం చేయకుండా, ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తాలను సకాలంలో జమ చేయాలని తెలిపారు. అంతకుముందు జిల్లా ఆహార భద్రత అధికారి వాసురామ్ తో కలిసి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 పై నిర్వహించిన ఆన్లైన్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, డిప్యూటీ తహసిల్దార్ (సివిల్ సప్లైస్), సంబంధిత రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం



**ఖానాపూర్ రూరల్ 28 అక్టోబర్ (జనం సాక్షి):** మండలంలోని సత్తనపల్లి పంచాయతీ పరిధి రామిరెడ్డిపల్లిలో అడవి పందుల దాడితో వరి పంటకు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన రైతు లెక్కల రాజకుమార్ పొలంలోకి చొరబడిన అడవి పందులు పంటను ధ్వంసం చేశాయి. అలాగే ఖానాపూర్ పట్టణ శివారులోని చెట్పల్లి మోహన్ వరి పొలంలోనూ పందులు పంటను నాశనం చేశాయి. దీంతో నష్టపోయిన రైతులు ఆందోళన చెందుతున్నారు. అడవి పందులు పంట పొలాల్లోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతోపాటు, నష్టపోయిన పంటకు పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
29 అక్టోబర్ 2026

# ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా గుట్టురట్టు

- నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్
- ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** రైతుల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును నల్లగొండ జిల్లా పోలీసులు రట్టు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 29 ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.20 లక్షల నగదు, రూ.30 లక్షల విలువైన రెండు కార్లు, కాపర్ వైర్లు, చోరీలకు ఉపయోగించే పరికరాలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 100 శాతం రికవరీ సాధించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ వెల్లడించారు.

### వాహన తనిఖీల్లో బయటపడిన ముఠా

వేములపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువకు చెందిన ఎల్-15 లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలోని 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 300 కిలోల కాపర్, 250 లీటర్ల ఆయిల్ చోరీకి గురైనట్లు ఆగస్టు 22న ఫిర్యాదు అందింది. ఈ మేరకు వేములపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.జిల్లాలో వరుసగా జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో మిర్యాలగూడ డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుల కదలికలపై నిఘా పెట్టారు.ఈ క్రమంలో అక్టోబర్ 28న మధ్యాహ్నం వేములపల్లి గ్రామ శివారులోని సూర్యాపేట ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన కారును ఆపి తనిఖీ చేశారు. అందులో ఉన్న వ్యక్తుల్లో గతంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కేసులో నిందితుడిగా ఉన్న షేక్ చంద్ పాషాను గుర్తించారు. మిగిలిన వారిని విచారించగా వారూ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

### పాత సామగ్రి వ్యాపారికి విక్రయం

నిందితులు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్లు, ఆయిల్, ఇతర భాగాలను చోరీ చేసి హైదరాబాద్‌లోని హయత్‌నగర్ ప్రాంతానికి చెందిన పాత సామగ్రి వ్యాపారి ఇస్లావత్ దేశిరామ్‌కు విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చోరీ చేసిన సామగ్రి విక్రయాల ద్వారా వచ్చిన డబ్బులను ముఠా సభ్యులు పంచుకునేవారని పోలీసులు తెలిపారు. చోరీ చేసిన కాపర్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దేశిరామ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

### నలుగురు అరెస్ట్.. మరో ఐదుగురు పరారీలో..

పోలీసులు అరెస్టు చేసిన వారిలో షేక్ చంద్ పాషా (26), రామావత్ సూర్య (19), గలబ సాయి కిరణ్ (19), ఇస్లావత్ దేశిరామ్ (24) ఉన్నారు. వీరిలో దేశిరామ్ చోరీ చేసిన సామగ్రిని కొనుగోలు చేస్తున్న వ్యక్తిగా పోలీసులు పేర్కొన్నారు.ఈ ముఠాకు చెందిన మరో ఐదుగురు సభ్యులు సంతోష్, నాన్కు, మోడల్ సాయి, ప్రియా, సునీత పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

### తెలుగు రాష్ట్రాల్లో 29 చోరీలు

పోలీసుల విచారణలో ఈ ముఠా తెలంగాణలో 25, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. నల్లగొండ జిల్లాలోనే 18 చోరీలు జరిగినట్లు తెలిపారు.




వేములపల్లి, వాడపల్లి, మాడ్గులపల్లి, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ రెండో పట్టణం, తిరుమలగిరి సాగర్, హాలియా, త్రిపురారం, కనగల్, చింతపల్లి, నేరెడుగొమ్ము, దేవరకొండ తదితర పోలీస్‌స్టేషన్ పరిధుల్లో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. ఇతర ప్రాంతాల్లోనూ, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు ప్రాంతంతో పాటు మాచవరం, దాచేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధుల్లో నేరాలకు పాల్పడినట్లు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న వస్తువులు:నిందితుల నుంచి రూ.20 లక్షల నగదు, రూ.30 లక్షల విలువైన రెండు కార్లు, కాపర్ వైర్లు, రెండు కట్టర్లు, నాలుగు పానాలు, హ్యాండ్ గ్లౌజులు, మూడు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు:
డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్ రెడ్డి, మిర్యాలగూడ రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ జె. సోమనార్సయ్య, మిర్యాలగూడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.ఎన్.డి. ప్రసాద్, ఎస్ఐలు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించినట్లు తెలిపారు.రైతుల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో ఇబ్బందులు పడుతున్న వారికి ఈ కేసు ఛేదన భరోసా కల్పిస్తుందని పోలీసులు పేర్కొన్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

## బోరబండలో రూ.6.50 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- 13 కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- ఒకరి అరెస్ట్

**అమీర్‌పేట్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** నగరంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) బృందం, బోరబండ పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త దాడుల్లో 13 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, మొబైల్ ఫోన్ విలువ సుమారు రూ.6.50 లక్షలుగా పోలీసులు అంచనా వేశారు.

### ఒడిశా నుంచి నగరానికి సరఫరా

పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ శ్రీరామ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఆయాజ్ అలియాస్ నిస్సార్ అలియాస్ బాండ్ (28) ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతను గత ఏడాది కాలంగా ఒడిశా రాష్ట్రంలోని ఖోర్ధా జిల్లా టాంగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొస్తున్నాడు. అనంతరం తనకు తెలిసిన వినియోగదారులకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఎస్పీఆర్ హిల్స్ వద్ద పట్టివేత

ఇటీవల ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చిన నిందితుడు, ఎస్పీఆర్ హిల్స్‌లోని ఓ బహిరంగ మైదానం సమీపంలో వినియోగదారుడి కోసం వేచి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్, బోరబండ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 13 కిలోల ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు

యువత భవిష్యత్తును దెబ్బతీసే మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గంజాయి విక్రయాలు లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు.

జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జె. రాజశేఖర్, ఎస్ఐ డి. రవిరాజ్, వారి సిబ్బంది, బోరబండ పోలీసుల సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ వివరాలను హైదరాబాద్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ గాయక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఐపీఎస్ వెల్లడించారు.

## వర్షపు నీరు వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే పువ్వాడ అజయ్



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** తుఫాన్ ప్రభావంతో ఖమ్మం జిల్లాలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి,ఎల్‌నినో ప్రభావం నుంచి తాత్కాలిక ఉపశమనం కలగవచ్చు అని, వర్షపు నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకోవాలని, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రకటన చేశారు. తుఫాన్ ప్రభావంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు. తుఫాన్ కారణంగా సంభవించే నష్టాలను నివారించేందుకు ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం నుంచి ప్రస్తుత వర్షాలతో తాత్కాలిక ఉపశమనం లభిస్తున్న నేపథ్యంలో, వర్షపు నీటిని భవిష్యత్తు అవసరాల కోసం నిల్వ చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, వర్షాలకు తడిసి నష్టపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకం




**ఖమ్మం, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** రాబోయే శాసనమండలి పట్టభద్రుల ఎన్నికలు అత్యంత కీలకమైనవని, అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మంలోని మమత వైద్య విద్యా కళాశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ, ఈ ఎన్నికల ద్వారా ప్రభుత్వం మారుతుందా లేదా అనే విషయాన్ని పక్కన పెడితే... రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, ప్రభుత్వ పాలనపై పట్టభద్రులు తమ మనసులోని భావాలను, అభిప్రాయాలను వ్యక్తపరిచేందుకు ఇదొక చక్కని అవకాశమని పేర్కొన్నారు. విద్యావంతులైన వైద్యులు, పట్టభద్రులు చైతన్యవంతంగా ముందుకొచ్చి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు కుటుంబసభ్యుల్లోని అర్హులను కూడా నమోదు చేయించాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న మంచి, చెడులను నిశితంగా గమనించి, విజ్ఞతతో ఆలోచించి తమ నిర్ణయాన్ని ఓటు రూపంలో తెలియజేయాలని సూచించారు. సమాజంలో వైద్యుల పాత్రను కొనియాడుతూ, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో అనేక కుటుంబాలు సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రాణాలకు తెగించి విశేష సేవలందించారని గుర్తుచేశారు. ఆనాడు ప్రభుత్వం అందించిన సహకారం, వైద్యుల నిస్వార్థ సేవలే ఎంతోమంది ప్రాణాలను కాపాడాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మమత విద్యాసంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, ఆసుపత్రి సూపరింటెండెంట్ రామస్వామి, వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా కృషి చేయాలి

- యువత సమష్టిగా ముందుకు రావాలి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- ఓయూలో 1,200 మందికి పైగా విద్యార్థులతో ప్రతిజ్ఞ, భారీ ర్యాలీ

**సికింద్రాబాద్, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** 2029 నాటికి తెలంగాణతో పాటు దేశాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు యువత సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన మాదకద్రవ్య రహిత భారతదేశం--2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని 1,200 మందికి పైగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్-ఎస్) వాలంటీర్లతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువతతోనే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇచ్చిన మాదకద్రవ్య రహిత భారత్ పిలుపును కార్యాచరణలోకి తీసుకురావాలని గవర్నర్ సూచించారు. యువత వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెడ్‌క్రాస్ తెలంగాణ శాఖ అధ్యక్షుడు ఎం. దానకిశోర్ మాట్లాడుతూ రాజ్యాంగ విధులు, దేశభక్తి, సామాజిక బాధ్యత ప్రతి పౌరుడి జీవితంలో ప్రతిబింబించాలని అన్నారు. అనంతరం గవర్నర్ జెండా ఊపి ప్రారంభించిన ర్యాలీ ఠాగూర్ ఆడిటోరియం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి కె. శశికిరణాచారి, రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి, సీఈఓ ప్రొఫెసర్ ఎ. శ్రీరాములు, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎస్. జితేంద్ర కుమార్ నాయక్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కావాలనే తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కాంగ్రెస్ కుట్ర

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌లో పుష్కలంగా నీళ్ల ఉన్నా కావాలనే తెలంగాణాను ఎడారిగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన, "తెలంగాణ ప్రజల బాధలు తీర్చి, గోదావరి తల్లి కన్నీటి గోసను తీర్చాలంటే తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే సాధ్యమని ప్రజలు అంటున్న మాటలను కేసీఆర్‌ను కలిసి వివరించాలని ఉద్దేశంతో బొడ్డు రవీందర్, ఉప్పు రాజ్ కుమార్ ల ఆధ్వర్యంలో చేపట్టిన 400 కిలో మీటర్ల మహా సైకిల్ యాత్రను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దాసరి మమత రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడిగడ్డ వద్ద పుష్కలంగా నీళ్లను చూసైనా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు కళ్లు తెరువాలని హితవు పలికారు. ఎనిమిది మంది యువకులు సైకిల్ యాత్రతో మేడిగడ్డ వద్ద నీళ్లు ఉన్నాయని, నీళ్లను ఎత్తిపోసి రైతులను, ప్రజలను కాపాడాలని పెద్ద నిర్ణయం తీసుకున్నారని, ఈ యాత్ర దిగ్విజయం కావాలని, వారి యాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరుస్తుందని బావిస్తున్నట్లు చెప్పారు. ఆనాడు బ్రహ్మంగారు కాలజ్ఞానం చెప్పారని, కానీ పదేండ్ల కాలంలో ప్రపంచంలో కరువు వచ్చినా తెలంగాణ రాష్ట్రానికి కరువు చాయలు రాకుండా కాపాడేలా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన గొప్ప కాలజ్ఞాని కేసీఆర్ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసాలు అబద్దాలు చెప్పి గద్దెనెక్కిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడాలని స్తానిక ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఏనాడు ఆలోచన చేయకపోవడం సిగ్గు చేటు, అవమానమని ఆయన ఎద్దేవా చేశారు.



## అర్హులైన పట్టభద్రులంతా వెంటనే నమోదు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదు, ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారు ఓటరుగా నమోదు చేసుకునేలా బూత్ స్థాయిలో అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలంటే నిబంధనల ప్రకారం దరఖాస్తుదారు మూడేళ్ల క్రితం డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, సంబంధిత నియోజకవర్గ పరిధిలో స్థానికులై ఉండాలని కలెక్టర్ వివరించారు. దరఖాస్తుతో పాటు స్వీయ ధ్రువీకరణతో కూడిన డిగ్రీ సర్టిఫికెట్, అవసరమైన ఇతర పత్రాలను సమర్పించాలని తెలిపారు. ఫారం-18 దరఖాస్తులను పరిశీలించేందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించామని, ఈఆర్ఓ లాగిన్‌లో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ముంతాజ్ అలీ, టీఆర్ఎస్ తరఫున బక్క పిచ్చయ్య, బీజేపీ నుంచి లింగస్వామి, సీపీఎం తరఫున సైదులు, టీడీపీ నుంచి తేలు అన్నరవి, ఎంఐఎం నుంచి హషం, బీఎస్పీ తరఫున రవిశంకర్‌తో పాటు ఎన్నికల విభాగం డీటీ సందీప్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం ధరల నియంత్రణకు సహకరించాలి

- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- అనవసర అపోహలు, వదంతులను వ్యాప్తి చేయవద్దు
- రైస్ మిల్లర్లు, ట్రేడర్లతో సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** బియ్యం ధరలను నియంత్రణలో ఉంచేందుకు రైస్ మిల్లర్లు, బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాల విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించి బియ్యం ధరలను పెంచేందుకు ప్రయత్నించినా, అక్రమ నిల్వలకు పాల్పడినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల అతిక్రమణకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం రైస్ మిల్లర్లు, ట్రేడర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛ విపణిలో బియ్యం ధరలు, వాటి క్రయ విక్రయాలు, సన్న బియ్యం సేకరణ స్టాక్ వివరాలు తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు నిత్యావసరమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. మార్కెట్‌లో బియ్యం లభ్యత, ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ బియ్యం క్రయ విక్రయాలలో ఎలాంటి అంతరాయాలు ఏర్పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ కొరత ఉన్నట్లు చూపించడం, ఉద్దేశపూర్వకంగా సరఫరాను తగ్గించడం, ధరలను కృత్రిమంగా పెంచేందుకు ప్రయత్నించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ



సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహించాలని, నిల్వలు, కొనుగోళ్లు, విక్రయాల విషయంలో నిబంధనలు తుచ తప్పక పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రేడర్లు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**పినపాక, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. పినపాక మండలం ఈ. బయ్యారంలోని జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మండల స్థాయి అధికారులతో, సర్పంచులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులకు, సర్పంచులకు సూచించారు. వివిజి రామ్ జీ, ఇరిగేషన్, విద్య, విద్యుత్, హౌసింగ్, అగ్రికల్చర్, పంచాయతీరాజ్, అటవీ శాఖ, మిషన్ భగీరథ తో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్షలో అభివృద్ధి పురోగతి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం లో ఎంపీడీఓ సంకీర్త్, తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం, కార్యదర్శిలు శ్రీనివాస రెడ్డి, బోడ రమేష్, 23 గ్రామ పంచాయతీల సర్పంచులు,ఉప సర్పంచులు, సెక్రటరీ లు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 29.10.2026

## గొడవ వద్దన్నందుకు..

### సర్దిచెబుతామని వెల్లిన మహిళపై కర్రతో దాడి చేయడంతో మృతి

**గాంధారి(జనంసాక్షి):**ఇంటి పక్కన వారు ఇద్దరూ గొడవ పెట్టుకుంటున్నారు ఎందుకు గొడవ పెట్టుకోవడం అని వయసులో పెద్దవిడైన మధుర భాయ్ ఇరువురికి నచ్చజెప్తే ప్రయత్నంలో మాకే చెప్తావా అంటూ ఆమె నెత్తిపై కర్రతో దాడి చేయడంతో అక్కడికక్కడే మరణించింది. వివరాల్లోకి వెళితే గాంధారి మండలంలోని నేరాలుతాండ గ్రామానికి చెందిన మధుర భాయ్ ఇంటి పక్కన ఇరువురు కోడళ్ళ వరుస అవుతారు. బర్రె తన స్థలంలో కట్టేసిందని ఎందుకు ఇక్కడ కట్టేసావని చిన్నగా గొడవగా చాలి చిలికి చిలికి గాలి వానగా మారి చివరికి కర్రతో దాడి చేసి మధురాబాయిని మృత్యువాత పడేలా చేసింది. దీంతో తాండవాసులు మధుర భాయ్(60) చికిత్స నిమిత్తం గాంధారి హాస్పిటల్ కు తరలించగా అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. దీంతో తాండవాసులు ఆక్రయించి గాంధారి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టడం జరిగింది. అక్కడికి చేరుకున్న సిఐ చౌదరి ఎస్సై మహేందర్ వారికి ఎంత నచ్చజెప్పి ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకుండా పోయింది.



## ‘డ్రగ్స్’ దుష్ప్రభావాలపై అవగాహన

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనంసాక్షి):** డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలు, ఇబ్బందులపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ మహేష్ బి. గితే తో కలిసి వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదవుతున్న ఎన్ డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై చేయాల్సిన విస్తృత ప్రచారం, డీ అడిక్షన్ కేంద్రంలో వైద్య సేవలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ షాప్ లలో తనిఖీ చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించాలని, డీ అడిక్షన్ సెంటర్ లో జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అటవీ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలు, ఇబ్బందులపై క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని వెల్లడించారు. వైద్య ఆరోగ్యశాఖ, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 10 డిగ్రీ కళాశాలలు, 20 జూనియర్ కళాశాలల్లో దాదాపు 2,600 మంది విద్యార్థులకు అవగాహన కల్పించామని తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులను సభ్యులుగా ఒక కమిటీ ఏర్పాటు చేసి ప్రతిరోజు ప్రార్థన సమయాల్లో డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఇట్టి సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, జిల్లా వైద్యాధికారి ఏంజెలాల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, ఇంటర్ విద్యాధికారి శరత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, వ్యవసాయ, కార్మిక, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును కప్పేస్తున్న కంకపొద..

**పొంచి ఉన్న రోడ్డు ప్రమాదాలు..!**



పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రం ప్రధాన రహదారి నుంచి కమాన్ పూర్ క్రాస్ రోడ్డుకు వెళ్లే దారిలో పోలీస్ స్టేషన్, కేడీసీసీ బ్యాంకు దాటిన తర్వాత ప్రధాన రహదారిపై కంకపొద రోడ్డును కప్పేస్తూ ఉండడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం పెద్ద సంఖ్యలో లారీలు ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఈ దారి గుండా వెళుతూ ఉంటాయి. రోడ్డు ప్రమాదం జరిగి ప్రజల ప్రాణాలకు ఇబ్బందులు కలగముందే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును కప్పేస్తున్న కంక పొదను పూర్తిగా తొలగించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

కమాన్‌పూర్(జనంసాక్షి):

## మైనర్ బాలికపై అత్యాచారం..

### నిందితుడిపై ఫోక్సో కేసు

**ఆర్మూర్,అక్టోబర్ 28(జనంసాక్షి):**ఆర్మూర్ మండలంలోని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే పాఠశాలలో మైనర్ బాలికపై మైనర్ బాలుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గత ఐదు నెలల కిందట స్వచ్ఛంద సంస్థ నడిపిస్తున్న పాఠశాలలో చేరిన బాలిక 5వ తరగతి చదువుతుంది. అదే స్వచ్ఛంద సంస్థ పాఠశాలలో మైనర్ బాలుడు ఎనిమిదవ తరగతి చదువుకుంటున్నాడు. యధావిధిగా కాలకృత్యాలకు మైనర్ బాలిక బాత్రూం వెళ్తున్న సమయంలో మైనర్ బాలుడు అదే బాత్రూంలోకి వెళ్లి బాలికను బెదిరించి బట్టలు విప్పి అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. మైనర్ బాలికపై గత నెల రోజుల నుండి అఘాయిత్యానికి పాల్పడుతుండగా దసరా సెలవుల నిమిత్తం ఇంటికి వెళ్ళింది. తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు బాలిక బంధువులు పాఠశాలకు చేరుకున్నారు. మైనర్ బాలిక భయపడి తను పాఠశాలకు వెళ్ళనని, స్వచ్ఛంద సంస్థలో చేరనని బంధువులతో మొరపెట్టి ఏడ్చింది. బంధువులు బాలికను దగ్గర తీసుకొని ఏం జరిగిందని ప్రశ్నించి ఆరా తీయగా అసలు విషయం బయటకు పొక్కింది. స్వచ్ఛంద సంస్థలో ఉంటున్న మైనర్ బాలుడు తనను శారీరకంగా కొడుతూ హింసిస్తున్నాడని బంధువులకు చెప్పింది. మైనర్ బాలిక బంధువులు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడైన మైనర్ బాలుడిని ప్రశ్నించగా తప్పును ఒప్పుకున్నాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడైన మైనర్ బాలుడిపై ఫోక్సో కేసు నమోదు చేశారు.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో సిరికొండ ఆదర్శ పాఠశాలకు ప్రథమ బహుమతి

### రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



**సిరికొండ(జనంసాక్షి):**నిజామాబాద్ జిల్లా స్థాయిలో నిర్వహించిన పీఎ శ్రీ పాఠశాలల అంతర్ పాఠశాలల కబడ్డీ పోటీల్లో సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. బాలుర విభాగంలో ప్రథమ బహుమతి సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకురాగా, మరో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 27, 28 తేదీల్లో నిజామాబాద్‌లోని డీఎస్ఏ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మొత్తం 28 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న సిరికొండ ఆదర్శ పాఠశాల జట్టు, ఆర్మూర్ జూనియర్ కళాశాల జట్టుతో తలపడి విజయం సాధించింది. దీంతో సిరికొండ విద్యార్థులు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలోనూ సిరికొండ జట్టు ప్రీ ఫైనల్ వరకు చేరుకుని ప్రతిభ కనబరిచింది.

**రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక**

సిరికొండ ఆదర్శ పాఠశాలకు చెందిన జి. రక్షిత్, వి. రవితేజ బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎం. రాఘవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఎంపికైన విద్యార్థులు వచ్చే నెల 5, 6 తేదీల్లో గాంధీపేట మండలంలోని తెలంగాణ పోలీస్ అకాడమిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదలతోపాటు జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## పకడ్బందీగా జనగణన

**అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28 (జనంసాక్షి):** జిల్లాలో జనాభా గణన 2027 ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని సూచించారు. జనాభా గణన నిర్వహణపై తహసీల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణన ద్వారా సేకరించిన సమాచారం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు కీలకమని తెలిపారు. అధికారులు పూర్తి అవగాహనతో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకొని, పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. జనాభా గణన?2027 రెండో దశ లెక్కింపునకు సంబంధించి రెండు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణలో మాస్టర్ శిక్షకులు డాక్టర్ భుక్య రవికుమార్, ఏ.ఆర్. యుగంధర్ బాబు సమాచార సేకరణ, నమోదు విధానం, సాంకేతిక అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పాండు, బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, ముఖ్య ప్రణాళిక అధికారి రఘునందన్‌తో పాటు జిల్లాలోని 25 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క బీభత్సం..

- రాజాపూర్‌లో ఐదుగురికి గాయాలు.. ఆరు గేదెలపై దాడి
- గాయపడిన వారికి మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స



**రామగిరి, అక్టోబర్ 28, (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామంలో పిచ్చికుక్క బీభత్సం సృష్టించింది. దారిన కనిపించిన వారిపై దాడి చేయడంతో ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. అలాగే ఆరు గేదెలపై దాడి చేయడంతో అవి కూడా గాయపడ్డాయి. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామంలో పిచ్చికుక్క సంచారంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని గమనించిన గ్రామ యువకులు, వార్డు సభ్యులు అప్రమత్తమై కర్రలు పట్టుకొని గ్రామంలో గస్తీ తిరిగారు. పిచ్చికుక్క దాడుల నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పిచ్చికుక్కను పట్టుకోవడంతో పాటు, గ్రామంలో ప్రజలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## నషాముక్త్ భారత్ కోసం కృషి

- పోలీస్, ఇతర శాఖల సమన్వయంతో డ్రగ్స్ నివారణపై పకడ్బందీ చర్యలు
- మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి):** నషా ముక్త భారత్ కోసం అందరం కృషి చేద్దామని జీవితాలను చిన్నాభిన్నం చేసే పొగాకు, గుట్కా తదితర మత్తు పదార్థాల అలవాట్లకు ప్రతి ఒక్కరూ దూరం ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, ఓయూ ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నషాముక్త్ భారత్, నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ – 2047 అవగాహన కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో వర్చువల్ గా వీక్షించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన వర్చువల్ కార్యక్రమానికి ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. వర్చువల్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతోపాటు కుటుంబానికి, సమాజానికి నష్టం కలిగిస్తుందన్నారు. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల (డ్రగ్స్) నియంత్రణకు పోలీస్, చైల్డ్ వెల్ఫేర్, విద్యా శాఖ, తదితర శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. డ్రగ్స్ సరదా కోసం మొదలై తరువాత అలవాటుగా మారి జీవితాలను అంధకారంలోకి తీసుకెళ్తుందన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు, విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు.

**ర్యాలీ..**

అంతకుముందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ చైర్మన్ సంగెం లక్ష్మణరావు, మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ‘నషాముక్త్ భారత్’ అవగాహన ర్యాలీ గీతా భవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ , ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్వో రాజ్ గోపాల్ రావు, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణం

– పట్టించుకోని అధికారులు





బాల్కొండ న్యూస్ 28 అక్టోబర్ (జనంసాక్షి): నిజామాబాదు జిల్లా బాల్కొండ భూ కబ్జాలకు పెట్టింది పేరు, కోట్ల విలువ చేసె ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతుందని ఈ భూమినే బాల్కొండ నియోజకవర్గం ప్రెస్ క్లబ్ భవనానికి అలాగే రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణానికి కేటాయించాలని రిటైర్డ్ ఉద్యోగులు,సీనియర్ సిటిజన్స్,పలువురు పాత్రి కేయులు జిల్లా కలెక్టర్ కు బుధవారం రోజు కలసి విజ్ఞప్తి చేసారు. గ్రామ పంచాయతీ మిగులు భూమి సర్వే నం 1340 ఒ 1342 లో వెంచర్ చేయడాని పూర్వ గ్రామ పంచాయతీ కార్య నిర్వాహక అధికారి గులాం మహ్మద్ హయాంలో ఆనాటి గ్రామ పంచాయతీ తీర్మానం తర్వాత బాల్కొండ జీ. పి. లేఖ నెం 78/74,తేదీ 10-09-1974, నోట్ ఫైల్ ను పూర్వ జిల్లా కలెక్టర్ బి. కే. పెంటయ్య, ఐ. ఏ. ఎస్, ఎల్. డిస్ / నెం 5853/1974 తేదీ 20-12-1974, ప్రకారంగా గ్రామపంచాయతీ భూమిని లేఅవుట్గా చేయడానికి అనుమతి ఇవ్వగ 1974 లో పంచాయతీ మిగులు భూముల్లో వెంచర్ చేసి వేలం పాట ద్వారా ప్లాట్స్ విక్రయించగ రాళ్లతో కూడిన మిగులు భూమిని “ఓపెన్ ప్లేస్ “ గ మార్క్ చేసిన స్థలాలను భవిష్యత్తులో ఏదైనా కార్యాలయాలకు కేటాయించాలంటే మళ్లీ గ్రామ పంచాయతీ తీర్మానం చేసి జిల్లా పంచాయతీ అధికారి ద్వారా జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం ఫైల్ పంపాలి. ప్రస్తుత గ్రామ పంచాయతీ వారు జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా అధికారం ఉంది కదాని ఇష్టం వచ్చినట్టు “ ఫేక్ డాక్యుమెంట్ “ సృష్టించి థర్డ్ పార్టీ ద్వారా క్రయ విక్రయాలు జరిపి అదే “ ఫేక్ డాక్యుమెంట్ తో “ ఫేక్ రిజిస్ట్రేషన్ చేసికొని కోట్లాది రూపాయల విలువ చేసె భూమిలో ఏలా అక్రమ నిర్మానాలు చేస్తున్నా రని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని నిర్మాణ స్థలాన్ని స్వాధీనం చేసుకొని మిగిలిన ఓపెన్ స్థలాన్ని ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి అలాగే రిటైర్డ్ ఉద్యోగుల భవన నిర్మాణానికి కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

## అవినీతి ఎస్సై

### రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన బంజారాహిల్స్ ఎస్సై విజయ్

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు చేపట్టారు. రూ.లక్ష లంచం తీసుకుంటూ బంజారాహిల్స్ పీఎస్ ఎస్సై విజయ్ పట్టుబడ్డారు. బాధితుడి నుంచి రూ.10లక్షలు లంచం డిమాండ్ చేసిన ఎస్సై.. అందులోని రూ.లక్ష తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. దీంతో విజయ్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**కొండాపూర్ భూ వివాదంపై**

## జాతీయ ఎస్టీ కమిషన్ సీరియస్

### సమస్యను త్వరగా పరిష్కరించి గిరిజనులకు న్యాయం చేయాలి

**అధికారులకు కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ ఆదేశాలు**



**సిరికొండ (జనంసాక్షి):**నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో నెలకొన్న భూ వివాదంపై జాతీయ ఎస్టీ కమిషన్ సీరియస్‌గా స్పందించింది. బుధవారం గ్రామాన్ని సందర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ వివాదానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి గిరిజనులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ, ఆర్డీవోతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. జాతీయ ఎస్టీ కమిషన్‌కు చట్టబద్ధమైన అధికారాలు ఉన్నాయని, గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం కమిషన్‌ను ఆశ్రయించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, రోడ్లు తదితర సమస్యలపై సంబంధిత కమిషన్లకు తమ పేరు, గ్రామం, ఫోన్ నంబర్‌తో పాటు సమస్య వివరాలను యాప్ ద్వారా పంపిస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కొండాపూర్‌లో భూ వివాదానికి సంబంధించి ఏర్పాటు చేసిన జెండా, గద్దెను ఎవరూ ముట్టుకోవద్దని అధికారులకు కమిషన్ సభ్యుడు స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ వివాదం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బంజారా గిరిజనుల్లో స్పందనకు దారితీసే అవకాశం ఉందని పేర్కొంటూ, సమస్య తీవ్రతను ఏసీపీ, ఆర్డీవోలకు వివరించారు. వివాదాన్ని త్వరగా పరిష్కరించి గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మూడు తండాలకు చెందిన సర్పంచులు, గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకెళ్లారు.

## పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ

### పోషకాహార కిట్ల పంపిణీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. ముక్తిదా



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 28(జనంసాక్షి):** నిస్సహాయ పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. ముక్తిదా అన్నారు. కామారెడ్డిలో వర్ద్ ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో నిస్సహాయ పిల్లలకు పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, పిల్లలకు పోషకాహారంతో పాటు ప్రేమ, ఆత్మీయత, ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఏ పిల్లవాడూ వివక్షకు, అవమానానికి గురికాకుండా కుటుంబ సభ్యులు, సమాజం అండగా నిలవాలని కోరారు. పిల్లలకు సమాన అవకాశాలు కల్పించి, వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. అవసరమైన వారికి న్యాయ సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టీ. నాగరాణి మాట్లాడుతూ పిల్లల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి అవసరమైన సహాయం అందించాలని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట్ సమతుల్య పోషకాహారం పిల్లల ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి డా. శ్రవంతి పిల్లలకు భద్రతతో కూడిన వాతావరణం కల్పించి, వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యాధికారి డా. స్నేహ పిల్లలకు అవసరమైన వైద్య సేవలు, ఆరోగ్య మార్గదర్శకత్వం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వర్ద్ ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాల చినప్ప రెడ్డి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం, పోషణకు తోడ్పడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో వర్ద్ ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ సమన్వయకర్త ఎస్. రాణి, రమేష్, సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఖాజా సామీ ఉల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిని కరువు జిల్లాగా ప్రకటించకపోవడం దారుణం

- నీళ్లు, కరెంటు లేక ఎండుతున్న వరి పంటలు
- రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?
- మంత్రి శ్రీధర్‌బాబుకు పుట్ట మధూకర్ సవాల్
- ఎండిన పొలాలను పరిశీలించి ప్రభుత్వంపై విమర్శలు



**మంథని, అక్టోబర్ 28 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించిన ప్రభుత్వం పెద్దపల్లి జిల్లాను విస్మరించడం దారుణమని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బుధవారం మంథని మండలం మైదుపల్లి శివారులో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నీళ్లు, విద్యుత్తు అందక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జిల్లాను కరువు ప్రాంతంగా ఎందుకు ప్రకటించలేదో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
ముత్తారం మండలంలో ఓ రైతు ఎండిన పొలాన్ని చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేయడం, మరికొందరు రైతులు విద్యుత్తు సరఫరా సక్రమంగా లేదని తీగలపై బట్టలు ఆరేసి నిరసన తెలపడం పరిస్థితికి నిదర్శనమన్నారు. ప్రతి గ్రామంలో సాగులో ఉన్న పది ఎకరాల్లో కనీసం రెండు ఎకరాల పంట ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు జిల్లాగా ప్రకటిస్తే పంట నష్టపోయిన రైతులకు ఎంతో కొంత పరిహారం అందేదన్నారు.
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరంతర విద్యుత్తు, సాగునీరు అందించి వ్యవసాయానికి ప్రాధాన్యమిచ్చామని పేర్కొన్నారు. గత పదేళ్లలో రైతులు ఇబ్బందులు పడ్డారన్న మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆనాడు ఒక్క గుంట భూమి ఎండిపోయినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ చేశారు. అధికారులతో తప్పుడు నివేదికలు ఇప్పించి పెద్దపల్లి జిల్లాను కరువు జాబితాలోకి రాకుండా చేశారని ఆరోపించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి రైతులకు క్షమాపణ చెప్పాలని, పెద్దపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించినప్పుడే గుర్తింపు

- ఎల్‌నినోపై అవగాహన కల్పించాలి
- బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- బోధన్ ఉమ్మడి మండలంలో కొలువుతీరిన పాలకవర్గ సభ్యులు



**బోధన్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** రైతులకు మెరుగైన సేవలు అందించినప్పుడే గుర్తింపు వస్తుందని ఆ దిశగా సహకార సంఘం చైర్మన్, పాలక మండలి సభ్యులు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం బోధన్ ఉమ్మడి మండలంలోని సహకార సంఘం చైర్మన్ పాలక మండలి సభ్యులతో బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాలకవర్గం నూతన సభ్యులు సమిష్టి కృషితో రైతుల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన్ సహకార సంఘం చైర్మన్ కోట పోతరెడ్డి, పెంటాకలాన్ సహకార సంఘం చైర్మన్ సార్గం రాధిక పోత రెడ్డి, అమ్దాపూర్ సహకార సంఘం చైర్మన్ సూర రవి, పెంటాకుర్దు సహకార సంఘం చైర్మన్ మద్దినేని శ్రీనివాసరావు, సంగం సహకార సంఘం చైర్మన్ విట్టల్ రెడ్డి, మినార్ పల్లి సహకార సంఘం చైర్మన్ మానవ రత్నకుమారి, జాడి సహకార సంఘం చైర్మన్ సుందర్ రాజ్ తదితర చైర్మన్లు, పాలకవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీవో విజయ కుమారి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మానాల మోహన్ రెడ్డి, గడుగు గంగాధర్, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంకుదాము, పాష సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి, ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, రెంజల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొబిన్ ఖాన్, సహకార సంఘం కార్యదర్శులు బాబా, శ్రీనివాస చారి, ఉమాకాంత్, శ్రీనివాస్, అనిల్, గంగాధర్, రవుఫ్, బోధన్ ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## రోలర్ స్కేటింగ్‌కు ప్రపంచ ప్రత్యేక గుర్తింపు

- ఆట ఆడడం వలన శరీర సమతుల్యత, ఏకాగ్రత పెరుగుతాయి
- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** క్రీడల ద్వారా విద్యార్థులకు ఒత్తిడి నుండి ఉపశమనం లభించడమే కాకుండా వివిధ కార్యక్ర మాలను చాలా హుషారుగా చేపట్టవచ్చుని తద్వారా విజయాలను సైతం నమోదు చేయవచ్చుని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోలర్ స్కేటింగ్ కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్నదని చాలామంది ఈ క్రీడను ఎంపిక చేసుకుంటున్నారని ప్రధానంగా ఈ క్రీడా ద్వారా జరిగే లాభాలు చెప్పారు. క్రీడల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను వివిధ పోటీలకు ఎంపిక చేస్తున్నామని, కావలసినటువంటి వనరులను సైతం సమకూర్చుతున్నామని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో పి. శ్రీహాస్ 9వ తరగతి, అండర్ - 15 విభాగంలో అద్భుతమైన క్రీడ ప్రదర్శన కనబర్చడమే కాకుండా వచ్చేనెల 10, 11, 12 తేదీలలో నిర్వహింపబడే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనారని హర్షం వ్యక్తం చేశారు. విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి జాతీయ స్థాయి పోటీలలోను అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అడవుల్లో వృథా నీటికి అడ్డుకట్ట.. వన్యప్రాణులకు భరోసా

- రుద్రంగి అటవీ ప్రాంతంలో విప్ ఆది శ్రీనివాస్ క్షేత్ర పరిశీలన
- చెక్‌డ్యామ్‌లు, చెరువుల పునరుద్ధరణకు కార్యాచరణ
- భూగర్భ జలాల పెంపునకు చర్యలు
- అధికారులతో అంచనాల రూపకల్పనకు ఆదేశాలు



**రుద్రంగి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** అడవుల్లో వృథాగా ప్రవహిస్తున్న నీటిని ఒడిసిపట్టి వన్యప్రాణులు, ప్రజలకు నీటి భరోసా కల్పిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రుద్రంగి, మానాల అటవీ ప్రాంతాల్లో అటవీ శాఖ డీఎఫ్ఓ సత్యనారాయణ, ఎఫ్ఆర్ఓలు మాధవి, సీతల్, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. సీమర్లు, గోలేపు లొద్ది, నాగారం చెరువు, రెండుగట్ల వాగు తదితర ప్రాంతాలను పరిశీలించారు.
ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని సహజ నీటి వనరుల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. రుద్రంగి, కోనరావుపేట మండలాల పరిధిలోని అడవుల్లో ప్రవహించే వాగులు, వంకల్లో నీటిని నిల్వ చేసేందుకు చెక్‌డ్యామ్‌లు, చిన్న చెరువులు, కుంటలను పునరుద్ధరిస్తామన్నారు. మరిమడ్ల అడవిలోని జాలవాగు, కొండ చెరువు ప్రాంతాల్లోనూ అవసరమైన పనులు చేపడతామని చెప్పారు.
మరిమడ్ల-మానాల మధ్య, సీమర్ల ఒర్రె, సూరమ్మ బుగ్గ ఒర్రె ప్రాంతాల్లో దెబ్బతిన్న చెక్‌డ్యామ్‌లను పరిశీలించి, అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపడతామన్నారు. రెండుగట్ల వాగు నీటిని నిల్వ చేయడంతోపాటు, సాధ్యమైన చోట నాగారం చెరువుకు మళ్లించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయం సమీపంలోని చెక్‌డ్యామ్ ద్వారా నీటిని నిల్వ చేసి సమీప గిరిజన తండాలకు ప్రయోజనం కల్పిస్తామన్నారు. అడవుల్లో నీటి నిల్వలతో వేసవిలో వన్యప్రాణులు, పక్షులకు తాగునీటి ఇబ్బందులు తగ్గడంతోపాటు భూగర్భ జలమట్టాలు పెరుగుతాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. అటవీ, నీటిపారుదల శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల అంచనాలు రూపొందించాలని సూచించారు. అటవీ శాఖ నిధులతోపాటు అవసరమైన అదనపు నిధులను సమకూర్చుకుని పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. సహజ నీటి వనరుల సంరక్షణతో సమీప గ్రామాల తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, సర్పంచి గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నంబర్ల కేటాయింపులో అక్రమాలు..
## వార్డు సభ్యుడి సస్పెన్షన్

- ధర్మారం 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్‌పై చర్యలు
- నలుగురి అసెస్‌మెంట్ నంబర్ల నమోదుపై విచారణ
- పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కలెక్టర్ ఉత్తర్వులు
- ఆరు నెలలు లేదా తదుపరి ఉత్తర్వుల వరకు సస్పెన్షన్



**పెద్దపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** గ్రామ పంచాయతీలో ఇంటి నంబర్లు, అసెస్‌మెంట్ నంబర్ల కేటాయింపులో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైన నేపథ్యంలో ధర్మారం గ్రామ పంచాయతీ 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.
ధర్మారం గ్రామ పంచాయతీ 2026-27 డిమాండ్ రిజిస్టర్‌లో ఇంటి నంబర్లు, అసెస్‌మెంట్ నంబర్ల కేటాయింపుపై అందిన ఫిర్యాదుల మేరకు పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ జరిపి నివేదిక సమర్పించారు. అసెస్‌మెంట్ నంబర్లు 153, 154, 173, 186లను వరుసగా నూనె మంజుల, సమాల అనిల్, గుర్రాల స్వరూప, నూనె శ్రీనివాస్ పేర్లపై నమోదు చేసిన వ్యవహారంలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు.
ఈ వ్యవహారంలో అప్పటి, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ ఆపరేటర్, కంప్యూటర్ ఆపరేటర్ల వాంగ్మూలాలను విచారణలో పరిగణనలోకి తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈ అంశంపై ధర్మారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. వార్డు సభ్యుడు తన అధికార స్థానాన్ని దుర్వినియోగం చేసి, ఇతరులతో కలిసి అసెస్‌మెంట్ నంబర్ల నమోదు ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా జోక్యం చేసుకున్నట్లు విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 37(6) ప్రకారం సాయి గణేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. క్రమశిక్షణా చర్యల ప్రక్రియ పూర్తయ్యే వరకు లేదా ఆరు నెలల గడువు ముగిసే వరకు, ఏది ముందుగా జరిగితే అప్పటివరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 204/2026 నమోదు చేసినట్లు వెల్లడించారు. సస్పెన్షన్ ఉత్తర్వులను అమలు చేయాలని ధర్మారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

## కారం చల్లినా చిక్కిన ఘరానా దొంగ!

- వేలిముద్రలు దొరకకుండా దొంగతనం.. నాట్‌గ్రిడ్‌తో పోలీసుల ఛేదన
- వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడు అరెస్టు
- బంగారం, వెండి, నగదు అపహరణ కేసుల్లో నిందితుడి పాత్ర
- కరీంనగర్ రూరల్ పోలీసుల వలలో అజయ్




**కరీంనగర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):** దొంగతనం చేసిన ఇంట్లో వేలిముద్రలు లభించకుండా కారం పొడి చల్లి తప్పించుకోవాలనుకున్న ఓ ఘరానా దొంగను కరీంనగర్ రూరల్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో పట్టుకున్నారు. వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం అల్లీపూర్‌కు చెందిన బాలసాని అజయ్‌ను బుధవారం బొమ్మకల్‌లోని కోకాకోలా ధాబా వద్ద అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇంటర్ చదువుతున్న సమయంలోనే అజయ్ దొంగతనాలకు అలవాటుపడ్డాడు. గతంలో మానకొండూరు మండలం ఊటూరు బ్యాంకు దోపిడీ కేసుతోపాటు సుల్తానాబాద్‌లో జరిగిన మూడు చోరీల కేసుల్లో అరెస్టయ్యాడు. 2025లో హైదరాబాద్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేసిన సమయంలో అక్కడ సెక్యూరిటీ గార్డుగా ఉన్న రాజుతో పరిచయం ఏర్పడింది.
ఇద్దరూ బైక్‌పై శ్రీశైలం వెళ్లి తిరిగివస్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో అజయ్ చొరబడి రెండున్నర తులాల బంగారం, నగదు అపహరించాడు. అనంతరం కాశీ వెళ్లాలనే ఉద్దేశంతో కరీంనగర్‌కు చేరుకున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మకల్ విజయ్‌నగర్ కాలనీలో ఓ ఇంట్లో చొరబడి పావు తులం బంగారం, 25 తులాల వెండిని దొంగిలించాడు. వేలిముద్రలు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఇంట్లోని కారం పొడిని చల్లినట్లు పోలీసులు గుర్తించారు. గత ఆగస్టులో జరిగిన ఈ చోరీపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాట్‌గ్రిడ్ యాప్ ద్వారా లభించిన సాంకేతిక సమాచారంతో నిందితుడిని గుర్తించారు. అనంతరం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

- రసాయన ఎరువుల మితిమీరిన వినియోగాన్ని తగ్గించాలి
- "ఖేతీ బచావో అభియాన్" లో మంథని ఏడిఏ అంజనీ మిశ్రా




**మంథని, అక్టోబర్ 28, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్య పల్లె గ్రామంలో "ఖేతీ బచావో అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యం మరియు ఎల్‌నినో ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అంజని మిశ్రా మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని, పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్యంగా ఎరువులను వినియోగించడం ద్వారా భూసారం పెంపొందించడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి డాక్టర్ నవ్య మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రసాయన ఎరువుల మితిమీరిన వినియోగాన్ని తగ్గించాలని, సాగు ఖర్చులను తగ్గించి రైతులకు మెరుగైన ఆదాయం అందించేందుకు పంటల వైవిధ్యాన్ని పాటించాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వినోద్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో ఎదురయ్యే అవకాశమున్న సమస్యలను వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవాలని, రబీ సీజన్‌లో ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేసుకోవడంతో పాటు పంట నష్టాలను తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- కరువు జాబితాలో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం
- జిల్లా లోని అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలి.
- జిల్లా కలెక్టర్ కువినతిపత్రం సమర్పించిన బిజెపి నేతలు



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 28 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు ప్రభావిత మండలాల జాబితాలో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని,జిల్లాలోని అనేక మండలాల్లో కరువు పరిస్థితులు తాండవిస్తున్నప్పటికీ, వాటిని విస్మరించి కేవలం 3 మండలాలను మాత్రమే జాబితాలో చేర్చకపోవడం పట్ల బిజెపి శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం రోజున కరీంనగర్ జిల్లా లోని అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలని, మొత్తం కరీంనగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, బిజెపి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ, శ్రీనివాస్ రావు, కనుమల్ల గణపతి,డిప్యూటీ మేయర్, రాష్ట్ర అధికార ప్రతినిధి వై సునీల్ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డిలు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, కరెంట్ సరిగ్గా అందకపోవడం వల్ల జిల్లాలో పంట దిగుబడి పూర్తిగా దెబ్బతిన్నదని, భూగర్భ జలాలు ఎండిపోయాయని తెలిపారు. సాగు, తాగు నీటికి తీవ్ర కొరత ఏర్పడటంతో రైతులు, సామాన్య ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సాధారణ వర్షపాతం గణాంకాల ఆధారంగా కాకుండా, మండలాల వారీగా నమోదైన వర్షపాతం, నేలలో తేమ, పంటల నష్టం, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల స్థాయి, ఉపగ్రహ చిత్రాలు, వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి నివేదికలు రైతుల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని కరువు ప్రభావిత ప్రాంతాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని డిమాండ్ చేశారు.
అర్హత ఉన్న ప్రతి మండలాన్ని కరువు ప్రభావిత జాబితాలో చేర్చాలని, కరువు ప్రభావిత రైతులకు వర్తించే ఇన్పుట్ సబ్సిడీ, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, సాగునీరు, తాగునీరు, పశుగ్రాసం వంటి సహాయక చర్యల అమలుపై యుద్ధ ప్రాతిపదికన సమీక్ష నిర్వహించాలని కోరారు. రైతు సంక్షేమం, వ్యవసాయ పరిరక్షణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకొని కరీంనగర్ జిల్లా రైతులకు సంపూర్ణ న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కోరారు.

## నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పోస్టర్ ఆవిష్కరణ

**పెద్దపల్లి,అక్టోబర్ 28(జనంసాక్షి) :** నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈరోజు పెద్దపల్లిలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార పోస్టర్‌ను తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ ప్రభుత్వ విప్ విజయ రమణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్,పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ హర్ష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహించడం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయడం వంటి అంశాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎర్రబాటి వెంకటేశ్వర్ రావులిలి, వైస్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కావేటి రాజగోపాల్, జిల్లా కోశాధికారి పాంపాటి శ్రీకాంత్, పాల్గొన్నారు.

## కల్వల ప్రాజెక్టును పునర్నిర్మించాలి

- ఆయకట్టు రైతులు, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి
- ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజు డిమాండ్



**శంకరపట్నం అక్టోబర్ 28 జనంసాక్షి :** మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండల పరిధిలో గండి పడి తెగిపోయిన కల్వల మినీ ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే పునర్నిర్మించి ఆయ కట్టు రైతులు, మత్స్యకారులను ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజు డిమాండ్ చేశారు. దెబ్బతిన్న మినీ ప్రాజెక్టును సందర్శించిన ఆయన పరిస్థితిని పరిశీలించి, రైతులు, మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టు దెబ్బతినడంతో సంబంధిత వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి, పునర్నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు.
ఈ సందర్భంగా విశారదన్ మహారాజుకు మద్దతుగా తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి కుతాడి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి కొర్ని ధర్మారెడ్డి, మానకొండూరు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎండీ సల్మా, శంకరపట్నం మండల అధ్యక్షుడు సందెల రంజిత్, మండల ప్రధాన కార్యదర్శి చింతిరెడ్డి జైపాల్ రెడ్డి, కరీంనగర్ టౌన్ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా సీనియర్ నాయకులు భాషవేణి రాజేందర్, చిట్టంపల్లి నాగరాజు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రాజెక్టు పునర్నిర్మాణానికి మద్దతు తెలిపారు.

## ప్రతి నిమిషం కీలకమే .. స్ట్రోక్‌లో ఆలస్యం చేస్తే శాశ్వత వైకల్యం

- స్ట్రోక్ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు - సకాలంలో చికిత్సతో కోలుకునే అవకాశం
- కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్ట్ డా. కె.సంజయ్ కుమార్




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 28 (జనంసాక్షి ) :** మెదడుకు రక్త సరఫరాలో అంతరాయం ఏర్పడినా, మెదడులో రక్తస్రావం జరిగినా ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి చేరుకోవడం అత్యంత కీలకమని, చికిత్సలో ఆలస్యం మెదడుకు తీవ్రమైన నష్టం కలిగించి శాశ్వత పక్షవాతానికి దారి తీయవచ్చని కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్స్‌కన్సల్టెంట్ ఇంటర్వె న్షనల్ న్యూరాలజిస్ట్ డా. కె.సంజయ్ కుమార్ తెలిపారు.
ఈ సందర్భంగా డాక్టర్ కే సంజయ్ కుమార్ మాట్లాడుతూ... భారత్‌లో ప్రతి సంవత్సరం లక్షలాది మంది స్ట్రోక్ బారిన పడుతున్నారని, స్ట్రోక్ ముఖ్య లక్షణాలు ముఖం ఒకవైపు వాలిపోవడం, చేయి లేదా కాలు అకస్మాత్తుగా బలహీనపడటం, మాట తడబడటం, చూపులో మార్పులు రావడం వంటి లక్షణాలు, సాధారణ నీరసంగా భావించి నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా రాత్రి సమయంలో లక్షణాలు కనిపించినా ఉదయం వరకు వేచి చూడకుండా తక్షణమే వైద్య సహాయం పొందాలి.
గోల్డెన్ అవర్‌ను కోల్పోవద్దు
రక్తనాళంలో రక్తం గడ్డకట్టడం వల్ల వచ్చే ఇస్కీమిక్ స్ట్రోక్‌లో, అర్హులైన రోగులకు నిర్ణీత సమయంలో థ్రాంబోలైటిక్ చికిత్స అందించడం ద్వారా రక్తప్రసరణను పునరుద్ధరించే అవకాశం ఉంటుందని, కొందరికి రక్తనాళంలో గడ్డను తొలగించే ప్రత్యేక చికిత్స అవసరమవుతుంది. ఏ చికిత్స అందించాలనేది బ్రెయిన్ స్కాన్, లక్షణాలు ప్రారంభమైన సమయం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యులు నిర్ణయిస్తారు. బీపీ, షుగర్ ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని,
అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, అధిక మద్యపానం, కొన్ని గుండె సంబంధిత సమస్యలు స్ట్రోక్ ముప్పును పెంచుతాయని తెలిపారు. వీటిని నియంత్రించడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనల ప్రకారం మందులు వాడటం ద్వారా స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని, చికిత్సతో పాటు పునరావాసం ముఖ్యం స్ట్రోక్ వచ్చిన తర్వాత ప్రాణాలను కాపాడటంతో పాటు రోగి తిరిగి సాధ్యమైనంత సాధారణ జీవితం గడిపేలా చేయడం ముఖ్యమని తెలిపారు. స్ట్రోక్ విషయంలో ప్రతి నిమిషం విలువైనదని, లక్షణాలను గుర్తించిన వెంటనే ఆసుపత్రికి చేరుకోవడం ద్వారా మెదడుకు జరిగే నష్టాన్ని, వైకల్య తీవ్రతను తగ్గించే అవకాశం ఉంటుందని డాక్టర్ కే సంజయ్ కుమార్ తెలిపారు.

# సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ

- యాసంగిలో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం
- తాగునీటి సరఫరాకు ఏడాది ముందస్తు ప్రణాళిక
- రైతులకు మద్దతు ధర అందేలా ధాన్యం కొనుగోళ్లు
- అధికారులతో సమీక్షించిన మంత్రి శ్రీధర్‌బాబు



**పెద్దపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొంటూ రైతుల సంక్షేమం, తాగునీటి భద్రతకు ప్రాధాన్య మిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, డీసీపీ రాంరెడ్డితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షపాతం, భూగర్భ జలాలు, వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్తు, ధాన్యం కొనుగోళ్లపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ప్రస్తుత ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసినప్పటికీ, ప్రస్తుతం ప్రాజెక్టుల నుంచి సాగునీరు అందించే పరిస్థితులు లేవని మంత్రి తెలిపారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో రానున్న ఏడాది పాటు గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అర్హులకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై అవగాహన కల్పించి, అందుబాటులో ఉన్న సబ్సిడీలను వినియోగించుకునేలా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. యాసంగిలో నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగును తగ్గించి, మొక్కజొన్న, శనగ, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనె గింజల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ విప్ విజయరమణారావు సూచించారు. బోర్లలో నీరు అందుబాటులో ఉన్న రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని తెలిపారు. వ్యవసాయానికి రోజుకు 12 గంటల త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, రానున్న రోజుల్లో డిమాండ్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రైవేటు మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని, కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జూన్ నుంచి అక్టోబర్ వరకు జిల్లాలో 863 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, సాధారణం కంటే ఎనిమిది శాతం లోటు ఉందని వివరించారు. అంతర్గాం, శ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో భూగర్భ జలమట్టం రెండు మీటర్లకు పైగా తగ్గిందన్నారు. 2026-27 యాసంగిలో సుమారు 1,53,586 ఎకరాల్లో పంటల సాగుకు అవకాశం ఉండగా, 90,015 ఎకరాలు బీడుగా ఉండే పరిస్థితి ఉందని తెలిపారు. తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడంతోపాటు సూక్ష్మసేద్యం, మల్చింగ్ విధానాల ద్వారా ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని 1,490 ఎకరాలకు పెంచే చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో 17.62 టీఎంసీల నీటి నిల్వ ఉందని, జిల్లాకు ఏడాదికి 1.85 టీఎంసీల తాగునీరు అవసరమ వుతుందని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలతో సుమారు 285 రోజులపాటు బల్క్ నీటి సరఫరా చేయవచ్చన్నారు. జిల్లాలోని 373 గ్రామీణ ఆవాసాల్లో 353 చోట్ల తాగునీటి సరఫరా సంతృప్తికరంగా ఉందని తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వల పెంపునకు ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. నవంబర్ రెండో వారంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయని, 311 కేంద్రాల ద్వారా 2,75,316 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గోదాముల మొత్తం నిల్వ సామర్థ్యం 5,17,700 మెట్రిక్ టన్నులు కాగా, అవన్నీ నిండిపోయాయని, మిల్లర్ల వద్ద మరో 2.84 లక్షల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వ ఉందని వివరించారు. కొనుగోళ్లు ప్రారంభమయ్యేలోపు నిల్వలకు అవసరమైన స్థలాన్ని సమకూర్చు కోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

### మొబైల్‌కు ఛార్జింగ్ పెట్టే క్రమంలో ప్రమాదం

**చేవెళ్ల, అక్టోబర్ 28 (జనంసాక్షి):** చేవెళ్ల మండలం దామరగిద్ద గ్రామ పరిధిలోని ఓ వ్యవసాయ భూమిలో బుధవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై 18 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడిని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవినాథ్‌గా గుర్తించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన నాథునాథ్ తన భార్య, కుమారులు, కుమార్తె, అల్లుడితో కలిసి సుమారు ఐదు నెలల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. వీరంతా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మహమ్మద్ షఫీకి చెందిన ప్రీకాస్ట్ పనులను వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. వారం రోజుల క్రితం నాథునాథ్ తన భార్య, కుమారుడు కరణ్‌నాథ్, కుమార్తె శివానీభాయ్‌తో కలిసి పనుల నిమిత్తం శంకర్‌పల్లికి వెళ్లారు. రవినాథ్, అతని అల్లుడు రాకేష్‌నాథ్ దామరగిద్ద గ్రామంలోని వ్యవసాయ భూమిలో ప్రీకాస్ట్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో రవినాథ్ తన మొబైల్ ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టేందుకు విద్యుత్ వైర్‌కు హుక్‌ను అనుసంధానించడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో హుక్ ప్రమాదవశాత్తు జారి అతనిపై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు అతని అల్లుడు రాకేష్‌నాథ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. సమాచారం అందుకున్న మృతుడి తండ్రి నాథునాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని కుమారుడు మృతి చెందినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై ఎవరి పట్లా అనుమానం లేదని పేర్కొంటూ, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలి

### యూనియన్ల గుర్తింపు వివాదాన్ని పరిష్కరించాలి : కూనంనేని సాంబశివరావు

**ముషీరాబాద్, అక్టోబర్ 28 (జనం సాక్షి):** ఆర్టీసీ కార్మికుల హక్కులతో ఆటలాడితే సహించేది లేదని, యూనియన్ల గుర్తింపు ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చిక్కడపల్లిలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఎంప్లాయీస్ యూనియన్ కూటమి నిర్వహించిన ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, కార్మికుల ప్రజాస్వామ్య తీర్పును గౌరవించాలని, ఎన్నికల ఫలితాల్లో అవకతవకలను సరిదిద్దాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు మాట్లాడుతూ, నల్గొండ, వరంగల్, మెదక్, సికింద్రాబాద్ రీజియన్లలో గుర్తింపు ఫలితాలపై అభ్యంతరాలున్నాయని తెలిపారు. 1958 కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న మాట్లాడుతూ, రీజియన్ స్థాయి ఎన్నికల ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫలితాల్లో తప్పులను సరిదిద్దకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహతో పాటు ఇతర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, గుర్తింపు వివాదాన్ని వెంటనే పరిష్కరించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఐక్య పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్మిక శాఖ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## చందానగర్ పోలీస్ స్టేషన్‌లో సైబరాబాద్ సిపి ఆకస్మిక తనిఖీ...

శేరిలింగంపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ బుధవారం చందానగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్కు కనీస సమాచారం లేకుండా అకస్మాత్తుగా పోలీస్ బాస్ అడుగుపెట్టడంతో పోలీసు అధికారులు ఒకింత ఉలిక్కిపడ్డారు. తనిఖీలో భాగంగా సిపి పోలీస్ స్టేషన్ ఆవరణలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న సిబ్బందితో ముచ్చటించి వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రక్షక్ యాప్ వినియోగాన్నికూడా ప్రత్యేకంగా సమీక్షించారు. విధి నిర్వహణలో అంకితభావం చూపిన మహిళా పోలీసులను ఈ సందర్భంగా సైబరాబాద్ సిపి రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. దీంతోపాటు స్టేషన్‌కు వచ్చిన సైబర్ క్రైమ్ బాధితులతో స్వయంగా మాట్లాడి, వారికి సత్వర న్యాయం జరిపేందుకు ప్రత్యేక చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి సీహెచ్.వై శ్రీనివాస్ కుమార్, చందానగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సల్బత్తాపూర్‌లో వివాహిత మహిళ ఆత్మహత్య

**వికారాబాద్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామంలో వివాహిత నందిని (22) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆరు నెలల క్రితమే వివాహమైన యువతి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన నందిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. ఇంటి తలుపులు చాలాసేపటి వరకు తెరుచుకోకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె ఉరివేసుకుని కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దారూర్ సీఐ రఘురామ్, బంట్వారం ఎస్సై పుండ్లిక్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నందినికి ఆరు నెలల క్రితమే అదే గ్రామానికి చెందిన బసప్పతో వివాహమైనట్లు తెలిసింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందిన అనంతరం కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని వెల్లడించారు.

## ఇంజినీరింగ్ చదువులు.. బుల్లెట్ బైకుల చోరీలు!

- చదువును పక్కనపెట్టి దొంగతనాల బాట పట్టిన విద్యార్థులు
- అమీర్‌పేట కేంద్రంగా ముఠా కార్యకలాపాలు
- నలుగురు బుల్లెట్ బైకులు, 11 నకిలీ నంబర్ ప్లేట్లు స్వాధీనం
- ఐదుగురు నిందితులను పట్టుకున్న చందానగర్ పోలీసులు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి): ఇంజినీరింగ్ చదువుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన కొందరు విద్యార్థులు దారి తప్పి ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడ్డారు. మరో ఇద్దరు ఉద్యోగులతో కలిసి ముఠాగా ఏర్పడి ఖరీదైన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైకులను లక్ష్యంగా చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు చెందిన ఐదుగురు నిందితులను చందానగర్ పోలీసులు అరెస్టు చేసి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి ఏసీపీ సీహెచ్‌వై శ్రీనివాస్, సంబంధిత పోలీసు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గడ్డం ప్రవీణ్, బురిడీ గోపీచంద్, చోడవరపు దినేష్‌కుమార్, గీసాల షణ్ముఖ సత్యసాయి, సీరపు దినేష్‌కుమార్ ఈ ముఠాలో సభ్యులుగా ఉన్నారు. వీరిలో ముగ్గురు కాకినాడలో ఇంజినీరింగ్ చదువుతుండగా, మరో ఇద్దరు ఉద్యోగులు. 2025 డిసెంబరు నుంచి ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌లోని అమీర్‌పేటను కేంద్రంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు అమీర్‌పేటలో స్కూటర్లను అద్దెకు తీసుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ఖరీదైన బైకులను గుర్తించేవారు. అదును చూసి నకిలీ తాళాలతో వాటిని అపహరించి, రాత్రికి రాత్రే నంబర్ ప్లేట్లు, తాళాలు మార్చి ఆంధ్రప్రదేశ్‌కు తరలించేవారు. అక్కడ వాటిని



తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ నెల 25న చందానగర్ కోదండరామ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆడెపు అజయ్ ఇంటి ముందు పార్కు చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకు చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం చందానగర్ ఎంఎంటీఎస్ రోడ్డు వద్ద చోరీ చేసిన బైకును తరలిస్తుండగా నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మూడు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులు, ఒక కేటీఎం డ్యూక్ బైకు, 11 నకిలీ నంబర్ ప్లేట్లు, చోరీకి ఉపయోగించే పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు 15 నుంచి 20 ద్విచక్ర వాహనాలను చోరీ చేసి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. నగరంలోని ఇతర పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన వాహనాల చోరీ కేసుల్లోనూ నిందితుల ప్రమేయంపై దర్యాప్తు చేస్తున్నారు. చదువుతో ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన యువత నేరాల బాట పట్టడం ఆందోళన కలిగిస్తోంది.

## నాటుసారా రవాణా చేస్తూ వ్యక్తి అరెస్ట్

**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** రామారెడ్డి మండలం కన్నాపూర్ తండాకు చెందిన కాట్రోత్ మహిపాల్ (28) నాటుసారా రవాణా చేస్తుండగా జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం కన్నాపూర్-రామారెడ్డి రోడ్డులోని సాయిలు పౌల్ట్రీ ఫారం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, టీవీఎస్ బైక్‌పై 2.5 లీటర్ల నాటుసారా తరలిస్తున్న మహిపాల్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సారాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో నాటుసారా, గంజాయి అక్రమ తయారీ, విక్రయాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మద్య నిషేధ, ఎక్సైజ్ అధికారి బి. ముకుంద రెడ్డి హెచ్చరించారు. నిందితులను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమాలపై సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఎం. శంకర్, అమృత రెడ్డి, రాజు, మహిళా కానిస్టేబుల్ శిరీష పాల్గొన్నారు.

## బియ్యం పంపిణీ వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి
- ప్రతిరోజూ నిల్వల వివరాలు నవీకరించాలి
- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఎంఎల్‌ఎస్ పాయింట్ల ఇన్‌చార్జులతో సుదీర్ఘ సమీక్ష



**రంగారెడ్డి, అక్టోబర్ 28 (జనంసాక్షి):** ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం సరఫరా, పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తూ, ప్రజలకు సకాలంలో ధాన్యం అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలోని అన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ల ఇన్‌చార్జులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యం తరలింపు, నిల్వలు, పంపిణీ మరియు రోజువారీ స్టాక్ నిర్వహణపై కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి బియ్యం తరలింపును నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత రేషన్ దుకాణాలకు బియ్యం సకాలంలో చేరేలా సమన్వయం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో రోజువారీ సరుకు, పంపిణీ, మిగిలిన నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని, వాస్తవ నిల్వలకు-రికార్డులకు మధ్య తేడాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో బియ్యానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, ప్రజా పంపిణీ వ్యవస్థలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టించినా, స్టాక్ వివరాల్లో తప్పుడు నమోదు చేసినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్లలో త్వరలోనే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, అక్రమాలు వెలుగుచూస్తే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ డిఎం ఎస్. స్వప్న, పి. రాము పాల్గొన్నారు.



### పెట్టుబడులు నష్టపోయి.. అప్పుల భారం

పంట దిగుబడులు రాకపోవడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కోల్పోయి, బ్యాంకు రుణాలు, ప్రైవేటు అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు బోరుబావుల్లో నీరు అడుగంటిపోతుండగా, మరోవైపు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక సాగునీటి కోసం రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. లక్నాపూర్, కోట్‌పల్లి ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న రైతుల పంటలకు అవసరమైన నీటిని విడుదల చేయాలని, యాసంగి వరి సాగుకు సాగునీరు అందించాలని కోరారు.

## ఎండిన పంటలు.. తీరని రైతు కష్టాలు!

**ధారూర్‌ను కరువు మండలంగా ప్రకటించాలి**

- మండలానికి రూ.200 కోట్లు.. జిల్లాకు రూ.2 వేల కోట్లు విడుదల చేయాలి
- పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి
- క్షేత్రస్థాయిలో పర్యటించి కరువు పరిస్థితులను పరిశీలించాలి

**ధారూర్, అక్టోబర్ 28 (జనంసాక్షి):**

ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయి, పెట్టుబడులు చేతికందక, అప్పులు తీర్చే మార్గం కనిపించక రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు సంఘం, కేవీపీఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ధారూర్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రూ.200 కోట్లు, వికారాబాద్ జిల్లాకు రూ.2 వేల కోట్ల నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ధారూర్ మండలంలోని సోమారం, కొండాపూర్ కలాన్, రుద్రారం, ధారూర్ గ్రామాల్లో ఎండిపోయిన పత్తి, వరి, కంది, మొక్కజొన్న తదితర పంట పొలాలను తెలంగాణ రైతు సంఘం, సీపీఎం నాయకుల బృందం సందర్శించి రైతుల పరిస్థితులను పరిశీలించింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మదులపల్లి సుదర్శన్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సతీష్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలాలు అడుగంటడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. పత్తి, వరి, వేరుశనగ, కంది, మొక్కజొన్నతో పాటు కూరగాయలు, పండ్ల తోటలు సైతం దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

### ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

ఎండిపోయిన పత్తి, వరి, కంది తదితర పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. కూరగాయలు, పండ్ల తోటలు నష్టపోయిన రైతులకు కూడా తగిన పరిహారం అందించాలని, పంటల బీమా పరిహారం, రైతులకు రావాల్సిన బోనస్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతులపై ఉన్న రూ.2 లక్షల వరకు బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

### కరువు పర్యటనలు చేపట్టాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులు, ఉన్నతాధి కారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి కరువు పరిస్థితులను పరిశీలించాలని నాయకులు డిమాం డ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల ను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి, ముఖ్యమంత్రి, శాసనసభాపతి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధారూర్ మండలాని కి రూ.200 కోట్లు, జిల్లాకు రూ.2 వేల కోట్ల నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోక పోతే రైతుల పరిస్థితి మరింత దయ నీయంగా మారుతుందని హెచ్చరించారు. ఈ పర్యటనలో తెలంగాణ రైతు సంఘం నాయ కులు సుదర్శన్, సతీష్, లాలయ్య, లక్ష్మయ్య, వెంకట్ రాములు, రాజు, అంజయ్య, యాదయ్య, దశరథ్ పాల్గొన్నారు.

## లక్ష్య సాధనలో యువత పట్టుదలతో ముందుకు సాగాలి

- తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలి: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ
- ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు నైపుణ్యాలపైనా దృష్టి పెట్టాలి
- నిరుద్యోగ యువతకు అండగా నిలవడమే లక్ష్యం: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**తాండూరు, అక్టోబర్ 28 (జనంసాక్షి):** యువత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనతో కృషి చేస్తే విజయం సాధించవచ్చని తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చుతూ, లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించకూడదని సూచించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలోని బీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా బుధవారం తాండూరులోని విలియం మూన్ స్కూల్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ అభ్యర్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా 2018 నుంచి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం 200 మందికి పైగా నిరుద్యోగులకు కానిస్టేబుల్, ఎస్ఐ, గ్రూప్స్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ అందించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంపై దృష్టి సారించిందని, వివిధ ఉద్యోగ నియామక ప్రక్రియలతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రాజీవ్ యువ వికాసం వంటి కార్యక్రమాల ద్వారా నైపుణ్యాలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహిస్తోందని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత కంప్యూటర్, కమ్యూనికేషన్ నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో నైపు ణ్యాలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. అందించిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, తాండూరుకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు విద్యుత్తు, నీటిని పొదుపుగా వినియోగించేలా యువత చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే బీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. యువత తమ లక్ష్యాలను సాధించేలా నిరంతరం అండగా నిలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ, ట్రైనీ కలెక్టర్ సచిన్ భరద్వాజ్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ధారాసింగ్, ప్రజాప్రతినిధులు, యువత, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మాదాపూర్ పిఎస్ పరిధిలో ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్







**శేరిలింగంపల్లి, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కొనుగోలు, విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 508 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాంకు చెందిన రాబిందాస్ (33) శేరిలింగంపల్లిలో ఆటో డ్రైవర్‌గా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన నిత్య గోపాల్ దాస్ (31) మాదాపూర్‌లోని ఓ కేఫ్‌లో వంటమనిషిగా పనిచేస్తు న్నారు. అస్సాంకే చెందిన ఉత్తీర్ణ హజారికా (27) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉత్తీర్ణ హజారికా గంజాయి కొనుగోలు చేసేందుకు మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని రాజా వైన్స్ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ రాబిందాస్, నిత్య గోపాల్ దాస్‌తో కలిసి గంజాయి కొనుగోలు చేస్తుండగా, ముందస్తు సమాచారంతో కాపుకాసిన పోలీసులు ముగ్గురినీ పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయితో పాటు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రాథమిక విచారణలో రాబిందాస్, నిత్య గోపాల్ దాస్ డోము అనే వ్యక్తి వద్ద గంజాయిని సేకరించి, చిన్న ప్యాకెట్లుగా మార్చి వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. డోమును పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, అతడిని అదుపులోకి తీసుకుంటే మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
29 అక్టోబర్ 2026

# ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభించాలి..
- నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- 12 వేల మంది సర్పంచులు, 12 వేల మంది పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతోపాటు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రజలకు భరోసా కల్పించాలని పిలుపునిచ్చారు. బీఆర్‌కే భవన్‌లోని సెర్ప్ కార్యాలయం నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 వేల మంది సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో మాట్లాడారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సెర్ప్ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా అదనపు కలెక్టర్లు ఐటిడిఓ అధికారులు, డిఆర్డిఓ లు, డిపిఓ లు, జడ్పి సీఈఓ లు, ఇంజనీరింగ్ విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన 'జలసిరి' వీడియోను మంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 12,516 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 244 గ్రామ పంచాయతీల్లోనూ వెంటనే పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. అక్టోబర్ 27న ఉపాధి పనులకు 3,97,788 మంది కూలీలు హాజరుకావడం రికార్డుగా నిలిచిందని, ఈ సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామాల్లో కూలీలను సమీకరించి వారికి నిరంతరంగా పనులు కల్పించాలని సూచించారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించాలని, పనుల నిర్వహణలో సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతూనే, కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించి వలసలను నివారించాలని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ పనులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల పునరుద్ధరణతోపాటు వర్షపు నీటిని ఒడిసిపట్టే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పశువులకు మేత, తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి వృథాను అరికట్టేందుకు సర్పంచులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చనే విశ్వాసాన్ని ప్రజల్లో కల్పించాలని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అవసరమైన నిధులు అందుబాటులో ఉంచుతోందన్నారు.

## ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు

# మండల స్థాయిలో సమన్వయ కమిటీలు

- గ్రామీణ ఉపాధి, పశువులకు పశుగ్రాసం, తాగునీటి భద్రతకు ప్రాధాన్యం
- ప్రతి మండలంలో కమిటీల ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశాలు

**హైదరాబాద్, అక్టోబర్ 28 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పశు సంపద, గ్రామీణ ప్రజల జీవనోపాధిపై ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలను చేపట్టి, ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు పశుగ్రాసం, తాగునీటి భద్రతకు భరోసా కల్పించేందుకు మండల స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ జి.ఓ.ఆర్.టి. నెం.579ను జారీ చేశారు. వికసిత్ భారత్–గారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం, 2025 కింద చేపట్టాల్సిన చర్యల్లో భాగంగా ఈ మార్గదర్శకాలను జారీ చేశారు.

### మండల పరిషత్ అభివృద్ధి అధికారి నేతృత్వంలో కమిటీలు

మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన మండల సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీరాజ్, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. మండల పరిషత్ అధికారి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి ఇతర శాఖల అధికారులను కూడా కమిటీలో చేర్చుకునే అవకాశం కల్పించారు.

### గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి

గ్రామీణ కుటుంబాలకు కూలి ఉపాధి కల్పించేందుకు అన్ని గ్రామాల్లో అనుమతించదగిన పనులు అందుబాటులో ఉండేలా కమిటీలు చర్యలు తీసుకుంటాయి. కూలీల సమీకరణ, పని దినాల కల్పన, వేతనాల సకాలంలో చెల్లింపులను పర్యవేక్షిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా అవసరమైన పనులను ముందుగానే గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేస్తాయి.



### 35,959 చిన్న నీటిపారుదల చెరువుల పరిధిలో పశుగ్రాసం అభివృద్ధి

పశువులకు అవసరమైన పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు ప్రాధాన్యం ఇచ్చింది. గ్రామపంచాయతీలు, గ్రామీణ ఆవాసాల పరిధిలో ఉన్న 35,959 చిన్న నీటిపారుదల చెరువులను గుర్తించి, నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాసం సాగుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేయాలని ఆదేశించింది.

మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల ద్వారా పశుగ్రాసం సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారు. వ్యవసాయ బోర్లు లేదా ఇతర నిర్ధారిత నీటి వనరులు కలిగిన రైతులను గుర్తించి వ్యక్తిగత స్థాయిలోనూ పశుగ్రాసం సాగును ప్రోత్సహిస్తారు. పశువుల మేత కొరతను ముందుగానే అంచనా వేసి, అవసరమైన ప్రాంతాల్లో పశుగ్రాసం అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తారు. పశువులు, మేకలు, గొర్రెలకు తగినంత తాగునీరు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పశువుల నీటి తొట్టెలను నిర్మించడంతో పాటు ఇప్పటికే ఉన్న తొట్టెలను పరిశీలించి మరమ్మతులు చేపడతారు. వేసవిలోనూ పశువులకు నిరంతరాయంగా తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటారు. తాగునీటి కొరత ఎదురయ్యే గ్రామాలను గుర్తించి, గ్రామీణ నీటి సరఫరా శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన మరమ్మతులు, ఇతర నివారణ చర్యలు చేపడతారు. గ్రామీణ తాగునీటి మౌలిక సదుపాయాలు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షిస్తారు.

### నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం

నీటి భద్రతలో భాగంగా చిన్న నీటిపారుదల చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫీల్డ్ ఛానళ్ల అభివృద్ధి, మరమ్మతులతో పాటు వ్యవసాయ కుంటలు, మ్యాజిక్ సోక్ పిట్స్, డ్రెయిన్ ఎండ్ సోక్ పిట్స్, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, చెక్‌డ్యామ్‌ల వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పునర్భరణ ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేలా చర్యలు చేపడతారు.

### గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనోపాధి పనులు

గ్రామీణ రహదారులు, కల్వర్టులు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ సంఘాల భవనాల నిర్మాణం, అభివృద్ధి పనులను అవసరాలకు అనుగుణంగా చేపడతారు. పశువుల షెడ్లు, మేకల షెడ్లు, గొర్రెల షెడ్లు, ఉద్యానవనాలు, పట్టు పరిశ్రమకు సంబంధించిన పనుల ద్వారా గ్రామీణ కుటుంబాల జీవనోపాధి భద్రతకు తోడ్పడతారు. ప్రతి గ్రామపంచాయతీలో మౌలిక సదుపాయాల కొరతను గుర్తించి, గ్రామసభల భాగస్వామ్యంతో అవసరమైన పనులను ప్రణాళికలో చేర్చుతారు.

### వారానికొకసారి సమీక్ష.. జిల్లా కలెక్టర్లకు నివేదికలు

మండల సమన్వయ కమిటీలు కనీసం వారానికి ఒకసారి సమావేశమై పనుల పురోగతిని సమీక్షించాలి. గుర్తించిన పనులు, మంజూరైన పనులు, ప్రారంభించిన పనులు, పూర్తయిన పనులు, కల్పించిన ఉపాధి, నీటి సంరక్షణ పనులు, జలసిరి కార్యక్రమం తదితర అంశాలపై పురోగతిని పరిశీలించాలి. పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాలి. ప్రతి కమిటీ వారపు పురోగతి నివేదికను జిల్లా కలెక్టర్లకు సమర్పించాలి. సిద్ధం చేసిన వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను సంబంధిత గ్రామపంచాయతీ జీపీ సాప్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అన్ని మండలాల్లో కమిటీల ఏర్పాటు, ఎల్ నినో నివారణ చర్యల సమర్థవంతమైన అమలు, కమిటీల పనితీరుపై క్రమం తప్పకుండా సమీక్షించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, పశుగ్రాసం, తాగునీరు, నీటి సంరక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ఈ మార్గదర్శకాలు దోహదపడనున్నాయి.

# పొలిటికల్ డ్రామాగా కాంగ్రెస్ ధర్నా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఢిల్లీలో జరగనున్న ఇండియా కూటమి ర్యాలీ కోసం ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసనలు పొలిటికల్ డ్రామా అని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముందస్తు బుకింగ్, ముందస్తు చెల్లింపులు లేకుండా ప్రత్యేక రైళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నా చేయడం కేవలం పొలిటికల్ డ్రామా అని రామచందర్ రావు మండిపడ్డారు. స్పెషల్ ట్రైన్లు కేటాయించడానికి స్పష్టమైన నిబంధనలు, అధికారిక ప్రక్రియలు ఉంటాయని ఆయన గుర్తుచేశారు. ముందస్తుగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు అడ్వాన్స్ నిధులు చెల్లించాల్సి ఉంటుందని, అలా ఏమీ చేయకుండా ఉన్నపళంగా రైళ్లు కావాలని పట్టుబట్టడం కామెడీగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా దసరా నుంచి దీపావళి వరకు పండుగల సీజన్ నడుస్తోందని, సౌత్ సెంట్రల్ రైల్వే ఇప్పటికే ప్రయాణికుల రద్దీ కోసం వెయ్యికి పైగా ప్రత్యేక రైళ్లను నడుపుతోందని తెలిపారు. ఇలాంటి టైమ్‌లో రైళ్లు, కోచ్‌ల లభ్యత చాలా కీలకమైన అంశమని రాంచందర్ రావు పేర్కొన్నారు. అంతగా ఢిల్లీకి వెళ్లాలనుకుంటే కాంగ్రెస్ నాయకులు టికెట్లు కొనుగోలు చేసి సాధారణ రైళ్లలో, విమానాలు, బస్సుల్లో వెళ్లవచ్చని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వ్యవస్థల ప్రతిష్టను దిగజార్చేందుకే స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇలాంటి నాటకాలు ఆడుతున్నారని రాంచందర్ రావు ఫైర్ అయ్యారు.

# మోడీ, రేవంత్ ఒకేతాను ముక్కలు

- బీసీల విషయంలో ఇద్దరికీ చిత్తశుద్ధి లేదు
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మోడీ, రేవంత్ ఒకేతాను ముక్కలని, బీసీల విషయంలో ఇద్దరికీ చిత్తశుద్ధి లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని తన పెద్దన్న అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, బీసీ బిల్లు ఆమోదం పొందిన తర్వాత అనేకసార్లు ప్రధానిని కలిసినప్పటికీ బీసీల ముచ్చట మాత్రం ఎప్పుడూ ఎత్తలేదని ఆరోపించారు. రాష్ట్రపతి వద్ద ఆగిపోతుందని తెలిసే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ బిల్లులను ఇక్కడ ఆమోదించి కేంద్రానికి పంపిందే తప్ప సమస్య పరిష్కారంపై వారికి ఎలాంటి సీరియస్‌నెస్ లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్త ఓబీసీల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని భాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ మంటపంలో నిర్వహించిన సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. జనగణనలో ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ ఇప్పటికే తీర్మానం చేసిందని గుర్తు చేసిన కవిత.. అదే తరహాలో తెలంగాణ అసెంబ్లీలోనూ తీర్మానం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అసెంబ్లీని సమావేశపరచాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకపోతే రాష్ట్రంలో జనగణనను నిలిపివేయాలని, అందుకు రాష్ట్రానికి అధికారం ఉందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే జనగణనలో భాగంగా ఇళ్ల లెక్కింపు ప్రారంభమైందని, బీసీల జనాభా లెక్కలు తేల్చడంలోనూ నిర్లక్ష్యం చేస్తే వారి హక్కులకు తీవ్ర నష్టం జరుగుతుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు బీసీల పట్ల చిన్నచూపు ఉందని, బీసీలంతా ఐక్యంగా పోరాడితేనే రిజర్వేషన్ల సాధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జనగణన కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు ఏ కులం జనాభా ఎంతన్నది ఎందుకు తేల్చడం లేదని ప్రశ్నించారు. దేశ బడ్జెట్ రూ.50 లక్షల కోట్లుగా ఉంటే బీసీలకు కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. బీసీల హక్కుల కోసం పోరాడకపోతే భవిష్యత్ తరాలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ పేరుకు మాత్రమే బీసీ అని ఆయన బీసీలకోసం చేసిందేమి లేదని దుయ్యబట్టారు. పిల్లలకు భూములు, బంగారం, ఆస్తులు కూడబెట్టడం కంటే వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే హక్కులను సాధించి పెట్టడమే నిజమైన ఆస్తి అని కవిత అన్నారు. బీసీ బిడ్డలకు జనాభా ప్రాతిపదికన తగిన రిజర్వేషన్లు కల్పిస్తే ఒక్క తరం జీవితాలే కాకుండా రాబోయే తరాల భవిష్యత్తు కూడా మారుతుందని పేర్కొన్నారు. ఓబీసీల హక్కుల సాధన విషయంలో రాజకీయ పార్టీలు, పట్టింపులకు అతీతంగా అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

# ఖమ్మం ప్రజలు అప్రమత్తంగా ఉండండి

- తుఫాన్ ప్రభావిత నష్టాల నివారణకు చర్యలు చేపట్టాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం (జనంసాక్షి) :** తుఫాన్ ప్రభావంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు. తుఫాన్ కారణంగా సంభవించే నష్టాలను నివారించేందుకు ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం నుంచి ప్రస్తుత వర్షాలతో తాత్కాలిక ఉపశమనం లభిస్తున్న నేపథ్యంలో, వర్షపు నీటిని భవిష్యత్తు అవసరాల కోసం నిల్వ చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, వర్షాలకు తడిసి నష్టపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచించారు.

# నేడు ప్రముఖ జర్నలిస్టు సతీష్ చందర్ నవల ఆవిష్కరణ






**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రముఖ జర్నలిస్టు, రచయిత సతీష్ చందర్ రచించిన 'పరువు తండ్రి.. ఎరువు భర్త' నవల ఆవిష్కరణ సభ గురువారంసాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు ఆవిష్కర్తగా వ్యవహరించనున్నారు. సభకు తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ అధ్యక్షత వహించనున్నారు. ప్రముఖ రచయిత్రి కుప్పిలి పద్మ ప్రధాన వక్తగా ప్రసంగించనున్నారు. వక్తలుగా ఆంధ్రప్రదేశ్ సచిత్ర వారపత్రిక పూర్వ సంపాదకులు వల్లూరి రాఘవరావు, ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం అధ్యాపకులు ఎం.వసంత్ పాల్గొననున్నారు. ఎం.ప్రవంత్ ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో అధ్యాపకులుగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమానికి ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం కరస్పాండెంట్ గౌరీ చందర్ ఆహ్వానం పలుకుతున్నారు. ఈ నవల ఆవిష్కరణ సభకు సాహిత్యాభిమానులు, రచయితలు, జర్నలిస్టులు, పాఠకులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

# విషతుల్యంగా మారిన గాలి, నీరు!

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- చెరువులు కలుషితం..
- వృత్తులు, వ్యవసాయం దెబ్బతిన్నాయి
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన
- శాశ్వత పరిష్కారం కోసం జన సంకల్ప యాత్ర





**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 28: (జనంసాక్షి) :** స్వచ్ఛమైన గాలి పీల్చడం, సురక్షితమైన నీరు తాగడం పౌరుల హక్కు. వాటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పరిసరాల్లో గాలి, నీరు కలుషితమవుతున్నాయని, ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే డిమాండ్‌తో ఆయన చేపట్టిన నాలుగు రోజుల జన సంకల్ప బయాత్ర రెండో రోజు అన్నోజిగూడ నుంచి ఘట్‌కేసర్ మీదుగా రాంపల్లి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు.

ప్రముఖ పర్యావరణవేత్త పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యపై గతంలోనే న్యాయపోరాటం చేశామని తెలిపారు. డంపింగ్ యార్డును తొలగించాలన్న డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయాలని కోరారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందడం ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న వ్యర్థాల వల్ల నీరు కలుషితమవుతోందని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రాంపల్లి చెరువును పరిశీలించిన ఈటల రాజేందర్‌కు గ్రామస్థులు తమ కష్టాలను వివరించారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, కలుషిత జలాల వల్ల చెరువు నీటి నాణ్యత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుపై ఆధారపడిన రజకులు, మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. వ్యవసాయానికి నీటిని వినియోగించలేకపోతున్నామని, పశువులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కలుషిత నీటితో బట్టలు ఉతికితే చేతులపై చర్మ సమస్యలు వస్తున్నాయని వాపోయారు.

డంపింగ్ యార్డు నిర్వహణలో లోపాల వల్లే సమస్య తీవ్రతరమవుతోందని ఈటల రాజేందర్ ఆరోపించారు. వ్యర్థాల నుంచి వెలువడే కలుషిత జలాలను శుద్ధి చేసి విడుదల చేయాల్సి ఉండగా, నిర్వహణ సరిగా జరగడం లేదని విమర్శించారు. సంబంధిత సంస్థలు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు సమీపంలోని చెరువులు, కాలువలను కలుషితం చేస్తున్నాయన్న స్థానికుల ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందేలా కృషి చేస్తానని ఈటల రాజేందర్ తెలిపారు. ఈ అంశంపై ప్రధానమంత్రికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసి పంపిస్తే కేంద్రం నుంచి అవసరమైన సహకారం పొందేందుకు ప్రయత్నిస్తానన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

### ఈ నెల 30న బహిరంగ సభ

డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 30న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఈటల రాజేందర్ ప్రకటించారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యాత్రలో బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370